వెల రూ. 10

సాహిత్య

# ప్రస్థానం

సెప్టెంబర్ 2017



సాహితీస్రవంతి





ఫొటోలు: దేవ సహాయం, నెల్లూరు 9030360084 (ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 21 నుండి వారం రోజుల పాటు ఎం.బి. విజ్ఞానకేంద్రం, విజయవాడలో జరిగిన ఫొటో ప్రదర్శనలో ప్రదర్శించిన ఫొటోలు )

సాహిత్య ప్రస్థానం సెప్టెంబర్ 2017

సంపుటి : 16 సంచిక : 9

# మన ప్రస్థానం కోసం.. చేయి కలుపుదాం...

**2002** అక్టోబర్ – డిసెంబర్‌లో త్రైమాసికగా ప్రారంభమైన సాహిత్య ప్రస్థానం పదిహేనేళ్లు పూర్తి చేసుకుంటున్నది. నూతన సహస్రాబ్దిలో వినూత్నంగా విశాల దృక్పథంతో మొదలై విజయవంతంగా నడిచిన చరిత్ర అది. ప్రస్థానం ఎందరో కవులు రచయితలు విమర్శకులకు అవకాశం కల్పించింది. మరెందరో ప్రసిద్ధులూ ప్రముఖులూ మేధావులు తమ రచనలతో ప్రస్థానంకు నిండుదనం తెచ్చారు. చెప్పినా చెప్పకపోయినా అంతకు ముందునుంచి వున్న ముఖ్య సాహిత్య పత్రికల వరవడి మారింది. విధానం మార్చుకోలేని వారు కూడా కనీసం రూపురేఖలైనా ఈ తరహాలోకి మార్చుకోవలసి వచ్చింది.

♦

ప్రస్థానం ఒక ప్రత్యేక సందర్భంలో చారిత్రిక అవసరంగా వచ్చిన సాహిత్య పత్రిక. సమగ్ర సామాజిక దృక్పథం,సమతుల్యత సంయమనం మేళవించిన పత్రిక. సంప్రదాయ సాహిత్య పత్రికల తరహాలో గాక కొత్త గొంతులకూ నూతన విమర్శక విశ్లేషకులకూ విద్యార్థులకూ అవకాశం కల్పించింది. అందుకే అవిరామంగా కొనసాగింది.

♦

ఇప్పుడిక కొత్త పరిస్థితులకూ నూతన కర్తవ్యాలకూ అంకితమయ్యే సమయం వస్తున్నది. సంపాదకవర్గం, నిర్వాహక నాయకత్వం సాకల్యంగా సమీక్షించింది. లోపాలోపాలను గుర్తిస్తున్నది. మీ సూచనలు మరీ ముఖ్యంగా విమర్శలు ఆహ్వానిస్తున్నది. కొత్త శీర్షికలతో ఎక్కువ పేజీలతో మీ ముందుకు రావడానికి సిద్ధమవుతున్నది.

♦

ఇంతకాలం ఆర్థికంగా మా తంటాలు మేము పడుతూ నెట్టుకొచ్చాం. భారమైనా ఇన్నేళ్లు పదిరూపాయలకే అందిస్తూ అభినందనలు అందుకున్నాం. అయితే మారిన పరిస్థితులలో ప్రగతిశీల సాహిత్య కారుల ముందు సవాళ్లు మరింత పెరుగుతున్నాయి. కొత్త తరం ఆకాంక్షలూ మారుతున్నాయి. వీటన్నిటినీ అందుకోవడానికి వీలుగా పత్రిక తయారు కావాలి. ఇందుకోసం ధర పెంచడం అనివార్యమవుతున్నది. ఈ కాలంలో అది పెద్ద పెరుగుదల కాదని మీరే అంటారని మాకు తెలుసు. అయినా సరే వివరించడం మా ధర్మం. వివరాలు లోపల వున్నాయి. ఇవి కూడా *2019* జనవరి నుంచి అమలులోకి వస్తాయి.

♦

అప్పటిలోగా పెద్ద సంఖ్యలో సాహితీ మిత్రులను కలుసుకోవాలి. ప్రస్థానం ప్రతి రచయితకూ కవికీ సాహిత్యజీవికి చేరేలా చూడాలి. సహృదయ దాతలందరి సహాయ సహకారాలు పొందగలగాలి. అందుకే వచ్చే మూడు నెలలూ ప్రస్థానం పెంపుదలకు కేటాయించండి. సాహిత్య బృందాలుగా సంచరించండి. మరో ప్రస్థానం కోసం రంగం సిద్ధం చేయండి. మీకివే మా అక్షరాభినందనలు

బొమ్మలు : తుంబలి శివాజి, గంగాధర్

## ఈ సంచికలో ...

కవిత .......... 4
రెక్కల్ని ఎగరనిద్దాం (కథ) .......... 5
కవిత .......... 9
భూ కేంద్రీకరణ మీద యుద్ధం 'జీవకోన'.......... 10
ఆర్. వసుంధరా దేవి కథలో 'స్త్రీ' చిత్రణ.......... 16
కవిత .......... 19
పితృస్వామ్యం అడుగుజాడల్లో.......... 20
మారాలి లోకం (కథ)'.......... 22
విలక్షణ ఆత్మకథ 'నేనో కూలోణ్ణి' .......... 26
కవిత .......... 30
కత్తుల వంతెనపై కవిత్వ సమరం.......... 31
స్టేన్లీ కుబ్రిక్ 'ఎ క్లాక్ వర్క్ ఆరెంజ్'.......... 34
మునుపటి మహబూబ్‌నగర్ జిల్లా శాసనాలు.......... 37
కవిత .......... 40
ఓపెన్ సీక్రెట్స్ (కథ) .......... 41
కాకినాడ సాహితీస్రవంతి 4వ వార్షికోత్సవం.......... 45
కవిత.......... 46
స్వీకారం.......... 47
డైరీ.......... 49

సంపాదకవర్గం

**తెలకపల్లి రవి** (ప్రధాన సంపాదకుడు)

**వొరప్రసాద్** (వర్కింగ్ ఎడిటర్)

**కె. సత్యరంజన్ ♦ చీకటి దివాకర్**

**గనారా ♦ శమంతకమణి**

**♦ కెంగార మోహన్**

**కె.లక్ష్మయ్య,** మేనేజర్

మనీ ఆర్డర్లు, రచనలు పంపించవలసిన చిరునామా:

ఎడిటర్, సాహిత్య ప్రస్థానం, ఎం.బి.
విజ్ఞానకేంద్రం, డో.నెం. 27-30-4, 3వ
అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట,
విజయవాడ - 520 002

సెల్: 9490099059

ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com

## కవిత

# ప్రతిపక్షం

- సి.హెచ్.వి.బృందావన రావు
9963399189



ఇప్పుడు మనం మాట్లాడుకోవలసింది
నువ్వు ఎంత రాశావనే దాన్ని గురించి కాదు.
ఏం రాశావనే దాన్ని గురించి.
చమూ సమూహాలతో చెలరేగిపోయిన
నిన్నటి చక్రవర్తి పల్లకీని
అలంకార శైలితో ఆకాశం దాకా మోశావా
ఆరుగాలమూ రెక్కలు ముక్కలు చేసుకున్నా
అర్ధాకలితోనే మిగిలిపోతున్న
అతిసామాన్యుడి ఆవేదనను గురించి
ఆవగింజంతైనా రాశావా.
గాలివాలులో నీటిజాలులో అందరితో పాటు
ప్రవాహ దిశగా నిష్పూచీగా సాగిపోయావా
ఒంటరిగా నైనా ఏటికి ఎదురీదుకుంటూ
బ్రతుకు సుడిగుండాల్లో చిక్కుకున్నవారికి
నీ కవితా దండాన్ని ఆసరాగా అందించావా
నువ్వు నీ వొంటి చుట్టూ ఎన్ని శాలువాలు
కప్పించుకున్నావనేది ప్రధానం కాదు
నువ్వే ఒక శాలువాగా మారి
నిర్భాగ్యుల శరీరానికి
రక్షణగా అమరావా లేదా అనేది ముఖ్యం.
కొరమాలిన వారిని కొసరి కొసరి కీర్తించిన నీ మెడ
ఎన్ని పూమాలలతో వొంగిపోయిందనేది కాదు
అధికార బధిరాంధుల్ని ధిక్కరించి నీ తల
ఎంతెంత పైకి లేచింది అనేదే అసలు విషయం.
శ్లేషార్థాలూ చమత్కారాలూ
ఛందోవ్యాకరణాలూ కవి సమయాలతో
ఏలినవారి పాలనా వైభవాలను
అలంకారాలతో సజ్జితం కావించావా – లేక
అనుకంపతో అభాగ్యుల అసహాయత్వానికి
అంతరంగ సహానుభూతి ఆర్ద్రతను ఇంత అద్దావా?
ఐదేళ్ళకోసారి పార్టీలూ ప్రభుత్వాలూ
మారిపోవచ్చుగాని – ఓ కవీ!
నీ స్థానం వుండాల్సింది ఎప్పుడూ ప్రతిపక్షం గానే !
ఏ ఎండకా గొడుగు
పట్టడం కాదయ్యా కవి అజెండా
కవిత అనేది ఎల్లప్పుడూ
పోరాటవీరుని చేతిలో జెండా..!

---

## ఆగస్టు నెల పురస్కారాలు

**మనసు గీసిన బొమ్మ**
కథకు: **రూ.700/-**
రచయిత : **నవజీవన్**

**వాళ్ళు**
కవితకు : **రూ .500/-**
రచయిత : **కావేరిపాకం రవిశేఖర్**

***కథ, కవితకు సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కారాల చెక్కులు ఈ రచయితలకు అందుతాయి***

పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు.
సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని
ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు.

**- ఎడిటర్**

కథ

# రెక్కల్ని ఎగరనిద్దాం....

- యస్.వి.యమ్.ఎన్. గాయత్రి
9440465797



**నా** చేతినిండా కాగితాలు...

దార్శనికాలు ఎక్కువయ్యే కొద్దీ ప్రయాణం ఎటుసాగాలో నిర్ణయించుకోవడం కష్టం.

అందులోనూ అవతలి వారి బూట్లలో దూరి మరీ కూర్చోడం తెలిసిన నాలాంటి వారికి....

ఇంజనీరింగ్ తర్వాత ఏం చెయ్యాలనే ప్రశ్నకు సమాధానం నా జీవితాన్ని నిర్దేశిస్తుంది. నా చేతిలోని ఈ పేపర్లలో సమాధాన్ని వెతుక్కుంటున్నాను.

'వచ్చే నెలలో టెస్ట్ వుంటుంది. ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసుకుంటే' జనవరి కల్లా ల్యాండ్ ఐపోవచ్చు." పేపర్లు నాకందిస్తున్న జ్యో చేతివంక చూసాను. తెల్లటి నాజూకైన వేళ్ళు... వేలికి చిన్న డైమండ్ రింగ్.....

ఆమె స్టేటస్ కు సింబల్‌గా.....

''మనీ ఎంత అవసరం ఉండొచ్చు''! అడిగాక అనిపించింది. అడిగుండాల్సింది కాదని !

" ఓ థర్టీ... థర్టీ ఫైవ్ దాకా ఉండొచ్చు. ఎలాగూ పార్ట్ టైం జాబ్ చేస్తాం కదా...

"పార్ట్ టైం అంటే ఎక్కడా? సరుకుల కొట్లోనా? పెట్రోల్ బంక్‌లోనా"? ఈ సారి నాలో జనించిన ఈ సందేహాన్ని తొక్కి పట్టేసాను బైటపెట్టలేదు.

జ్యో, నేను బిటెక్ నాలుగు సంవత్సరాలు కలిసి ప్రయాణించాం. ఇప్పుడు జ్యో నాకు ఇంకో అవకాశం ఇస్తోంది... కలిసి ప్రయాణించడానికి నా ఉద్దేశ్యమేంటో జ్యోకు పట్టదు. జ్యోకు నేనంటే ఇష్టమే. కానీ.. విదేశాల్లో వుండటమంటే ఇంకా ఇష్టం.


"ఊరు.. దేశం.. ఇవన్నీ వదలిపోవాలి!" నసిగానని నాకు తెలుస్తోంది. జ్యో కనుబొమ్మ ఒకటి పైకి తీసింది. చిన్నగా భుజాలు ఎగరేసింది. ఏదో సినిమాలో చూసానే... ఇలాగే.... గాలికి రేగుతున్న నా కొప్పుని తన ముని వేళ్ళతో సవరించింది.

"ఏవన్నీ వదిలేటం' స్టడీస్ కోసం నువ్వు పుట్టి పెరిగిన పల్లెటూరును, ఇంటిని వదిలెయ్యలేదూ? 'నేనూ– నా పల్లెటూరు' అంటూ... మీ నాన్నతో కలిసి మట్టి పిసుక్కోడం లేదుకదా! ఇదీ అంతే.. ఇంకొంచెం అడ్వాన్స్.. ఫారిన్."

జ్యో ధాటికి నేను తట్టుకోగలనా? కురుక్షేత్రంలో అర్జునుడిలా వింటున్నాను. కాకపోతే... ముకుళిత హస్తాలతో కాదు అంతే.

"మీ ఫాదర్ కోరిక కూడా అదేకదా! పెద్ద చదువులు చదవడం... కాకపోతే ఫారిన్‌లో... మన జెనరేషన్, సెంటిమెంట్స్ కొంచెం పక్కనపెట్టే చాలు శంకర్... మన తర్వాత జనరేషన్స్... హ్యాపీస్".

జ్యో చాలా తెలివైంది. చురుకైంది. ఎంత బాగా సమస్యను విడదీస్కుంటూ వెళ్తుందో... అందులోనూ కళ్ళు ఒకసారి చిన్నవి చేస్తూ... ఒకసారి పెద్దవి చూస్తూ, రకరకాల హావభావాలు పలికిస్తూ వుంటే ఆటోమేటిక్‌గా తలూపుతూ వుండిపోయాను.



"సిటీలో సిమెంట్‌రోడ్లకు అలవాటుపడ్డావ్. పల్లెగట్లమీద నడవాలంటే ఇప్పుడు తడబడ్డంలా..... ఫారిన్ రోడ్లు ఒకసారి చూసావంటే.... మరి యిక ఈ దేశం రోడ్లమీద కాలు కూడా పెట్టవ్.

ఇంతలో జ్యోకు ఫోన్‌కాల్ వచ్చింది.... 'యా యా.. కాల్ యూ బ్యాక్ ఇన్ టెన్ మినిట్స్", జ్యో చెప్తోంది. ఫోన్ లో అవతలి వ్యక్తి అవినాశ్ అని నాకు అర్థమయ్యింది. జ్యో ఫారిన్ వెళ్తుంది. కూడా నేనుంటే నాతో లేకుంటే అవినాశ్‌తో. తను చాలా క్లియర్‌గా వుంది. నా బుర్రే రకరకాల ఆలోచనలతో చిందరవందరగా వుంది.

'య్యా... ఇందాక డబ్బుల గురించి అనుకున్నాంగా... నీకు సొంతిల్లు వుంది కదా? సెక్యూరిటీ కింద పెట్టొచ్చు. ఎంతలో తీర్చేస్తావ్ ! "

నేను అవునన్నట్లు, కాదన్నట్లు తలూపాను నా అన్నయ్యకు దూరాలోచన ఎక్కువే. ఇప్పటికే నా ఉద్యోగ ప్రయత్నాలు ఎంతవరకు వచ్చాయని వాకబు చేస్తున్నాడు. ఇది జ్యో కు చెప్పినా కొట్టిపారేసి ఇంకోక సలహా చెప్తుంది. పోనీ జ్యో ముందు మోకాళ్ళ మీద కూలబడి ప్రాధేయపడితేనో ! నో... వే.. జ్యో నాలా సెంటిమెంటల్ ఫూల్ కాదు. చాలా ప్రాక్టికల్. నా మోకాలు చిప్పలు పగలటం..... గుండె బద్దలవడం మినహా ఏదో జరగదు. పరిస్థితులు ఆలోచిస్తూ అక్కడే కూర్చున్నా. కళ్ళల్లోంచి నీరు ధారపాతమవడం తెలుస్తూనే వుంది. తుడుచుకొనే ప్రయత్నం నేను చేయలేదు. ఎందుకంటే ఎప్పట్లానే నన్ను గమనించే వాళ్ళుఎవరూ లేరు.

ప్రస్తుతం నా చేతిలో జ్యో పెట్టిన పేపర్లున్నాయి. మా ఇంటి అరుగు మీద కూర్చొని వాటిని తడిమి చూస్తున్నాను. నా పక్కనున్న ఫోల్డర్లో మరికొన్ని పేపర్లు, అప్లికేషన్లు, అందులో ఒకటి ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ కాల్ లెటర్. నాకు ఈ లెటర్ చూపుతూ నా స్నేహితుడు అన్నమాటలు బాగానే గుర్తున్నాయి.

"పై చదువులంటే మాటలారా !! ఇంతకు ముందంటే తప్పదు. ఇప్పుడు ఇరవై సంవత్సరాలు వచ్చిన తర్వాత మళ్ళీ డబ్బుల కోసం చేయిచాచాల్రా... ముందు ఏదో ఒక ఉద్యోగంలో జాయిన్ అవుదాం. కొద్దీగా కూడబెట్టాక ఆలోచిద్దాం...."

కానీ మా నాన్న అభిప్రాయాలూ, ఆకాంక్షలూ వేరుగావున్నాయి. ఆయన పాలిటెక్నిక్‌తో చదువు ఆపాల్సివచ్చింది. "నా మీద పెట్టిన ఖర్చు చాలు. ఇక రూపాయి కూడా పెట్టను." అని తెగేసి చెప్పారు తాతయ్య. 'శంకర్... నువ్వు పోస్ట్ గ్రాడ్యుయేట్ అవ్వాలిరా.... తర్వాత గవర్నమెంట్ కాలేజీలో లెక్చరర్ అవు. జీవితం స్థిమితంగా వుంటుంది. ఇదీ ఆయన ఉద్దేశ్యం'. ఇంకా రెండేళ్ళు ప్రతిపైసాకు లెఖ్ఖ చెప్పలేను. మీ ముందు ఇంకా కూడా చేయి చాచలేను' అని ఎలా చెప్పడం? నా పక్కనున్న ఫోల్డర్ లో ఇంకో పేపరుంది. క్యాట్‌కు సంబంధించిందది. నేను కష్టపడే మనస్తత్వం వున్న విద్యార్థినే. నాన్న కోచింగ్‌కు ఇంకొద్దివేలు కడితే!... క్యాట్‌లో టాప్ ర్యాంకు తెచ్చుకుంటే.

ఎదురుగా ఎవరో ఉన్నట్లనిపించింది తలెత్తాను నేను. "విష్ణు" అన్న కొడుకు. ఇంటి ముందు వైపున్న వేప చెట్టుకు కావలించుకొని, ఇంటి వైపు ఏకాగ్రతతో చూస్తున్నాడు. వాడికి పన్నెండేళ్ళు. చెయ్యెత్తి పిలిచాను నేను. నిక్కరను పైకి లాక్కుంటూ పరిగెత్తుకు వచ్చాడు.


"చిన్నా ఏంటి సంగతి!" అరుగు మీద నా పక్కన కూర్చోబెట్టుకుంటూ అడిగాను నేను.

"ఇల్లు చూస్తున్నా.. చిన్నాన్నా...." గొప్పగా కొంచెం తలెగరేసి చెప్పారు. "ఇల్లు చూడ్డమేంట్రా! నువ్వు పుట్టిందగ్గర్నుంచీ ఇక్కడే కదా ఉన్నావ్! " చాలా మందికి లాగే అవతలి వాడికి కొంచెం టైం ఇచ్చే ఓపిక లేదు నాకు.

"ఇల్లు బొమ్మ గీస్తాను. చిన్నాన్నా..." చిన్నా గొంతులో కాన్ఫిడెన్స్.

"ఓ అందుకా అంత తీక్షణంగా పరిశీలిస్తున్నావు? సరే మొదలుపెట్టు చిన్నా ఉత్సాహంగా ఇంటికి లోపలికి పరిగెత్తి, రైటింగ్ పాడ్, పేపరు పెన్సిలు తెచ్చుకున్నాడు చిన్నాను పక్కన కూర్చోబెట్టుకొని, అతడు గీయడాన్ని చూస్తున్నాను. చాలా

అలవొకగా అతని చేతులలో ఇంటి బొమ్మ రూపుదిద్దుకుంటోంది. అతడి పరిశీలనాశక్తి చూస్తే నాకు ఆశ్చర్యమనిపించింది. పెంకులతో కప్పిన వసారాను, ఎత్తుగా నిలబెట్టిన ద్వారాన్ని, ఇరువైపులా వున్న విశాలమైన అరుగులను ముందున్న చెట్టును చకచకా గీస్తున్నాడు.



'చిన్నా డ్రాయింగునే తన వృత్తిగా ఎంచుకుంటేనో!' బాగా చదివిన, సమర్థుడైన వ్యక్తికి మనం మంచి ఆదాయాన్ని గ్యారంటీ ఇవ్వగలం. కానీ అదే కళాకారుడికైతే, అదే భవిష్యత్తు, ఆదాయం హామీ ఇవ్వగలమా!

ఆంగ్లేయులు బలవంతంగా మనమీద రుద్దిన వ్యవస్థ ఇది. వారికి అనుగుణంగా, కావాల్సినంత మంది గుమాస్తాలను ఉత్పత్తి చేసే కర్మాగారాలను, ఏర్పరచారు. దాన్నుండి బైటపడే పరిస్థితుల్లో మనం లేము. 'ప్రతిభను డిగ్రీలు, డబ్బులతో కొలవడం మాత్రమే మనకు తెలుసు.

స్వభావసిద్ధంగా చిన్నాలో ఉన్న ఈ కళకు ఎలా స్పందించాలో కూడా తెలియక చూస్తూ వున్నాను. మరో ఐదు నిమిషాల్లో బొమ్మగీయడం ముగించి "బావుందా చిన్నాన్నా" అంటూ అడిగాడు చిన్నా. అతడి చుట్టూ చేయివేసి, దగ్గరకి తీసుకొని "బావుందిరా చిన్నా" అన్నాను మనస్ఫూర్తిగా.

చిన్న ముఖంలో వేయిదీపాల కాంతి

"ఈ ఇంటినే వేయాలని ఎందుకనుకున్నావ్ చిన్నా!" అడిగాను నేను. "ఈ ఇల్లంటే నాకెంతో ఇష్టం చిన్నాన్నా. ఇక్కడుంటే నాకు హాయిగా వుంటుంది." విప్పారిన ముఖంతో చెప్పాడు చిన్నా. అటుగా పని చేసుకుంటున్న మా అమ్మను కేకేసి పిలిచాడు వాడు.

"నానమ్మా... ఇది చూడు బొమ్మ"

ఆమె మా వైపుగా వచ్చి డ్రాయింగ్ పేపర్‌లోకి తొంగిచూసింది. 'చాలా బావుందిరా చిన్నా అచ్చం మన ఇల్లు ఉన్నట్టే గీసావు" అమ్మ మాటలకు.. వాడి మొహంలో నవ్వు. మరోసారి డ్రాయింగ్‌ను పరికించిందామె. "ఇక్కడ గుడి బొమ్మ గీయి". కాగితంలో ఒక చోట చూపుతూ అందామె చిన్నా మొహంలో నవ్వులేదిప్పుడు. "నామ్మా! మన ఇంటి పక్కన గుడి లేదు కదా!

"అయితేనేం! ఈ కాగితంలో ఇక్కడంతా ఖాళీయేకదా! ఇదుగో ఈ చోట బొమ్మగీయి" చిన్నా మొహంలో కొంత అసహనం "నామ్మా గుడి గీస్తే సెట్ అవదు. ఇంటి బొమ్మ పెద్దదిగా గీచాను కదా! గుడి బొమ్మ చిన్నదిగా మాత్రమే వస్తుంది. బావోదు". పెద్దది-చిన్నది ఏమిట్రా? గుడి ఉందా? లేదా? అన్నది ముఖ్యం. మనం చేసే ప్రతిపని దేవుని ఆశీర్వచనం వుండాలా? వద్దా? ఆ దేవుని కృప లేకపోతే నువ్వు బొమ్మ గీయలేవు తెలుసా? ఆయన ప్రస్తావన వచ్చినప్పుడు కాదు కూడదు అనకూడదు.... లెంపలేసుకో" అమ్మ మాటలకు చిన్నా కళ్ళల్లో చిన్నపాటి భయం వాడి ఇష్టానికి వ్యతిరేకంగా ఇంటి పక్కగా గుడిబొమ్మ గీచాడు. అమ్మ ఆనందపడిపోయింది.

అమ్మ పద్ధతి అంతే నా చదువు విషమయినా అంతే. నా మనస్సులో ఏముందో చెప్పాలని ప్రయత్నించినప్పుడల్లా "నాకేం తెలుస్తాయిరా అవన్నీ, అన్నిటికీ దేవుడే వున్నాడు" అంటుంది. ఆమెకు అర్థం కాకపోయినా కనీసం నేను చెప్పేది వింటే బావుండు. కానీ చిన్నాకు మాత్రం ఇంకోసారి ఎప్పుడయినా విడమరిచి చెప్పాలి. భక్తిమార్గంలో భయం వద్దనీ... కోపం వస్తే శపించేంత తక్కువ స్థాయిలో దేవుడు లేడని....


ఇప్పుడు బొమ్మ కొంచెం విచిత్రంగా వుంది. నానమ్మను సంతోషపెట్టే క్రమంలో చిన్నా తన ఆనందాన్ని కోల్పోయాడు. మా అమ్మ మాత్రం సంబరపడిపోయింది. చిన్నా గుడి బొమ్మను గీసినందుకో!... లేక ఆమె మాటను గౌరవించినందుకో ఏదైతేనేం? ఒక చేత్తో డ్రాయింగ్ పేపరు. మరో చేత్తో చిన్నా రెక్కపట్టుకొని ఇంటిలోపలికి తీసుకుపోయింది.

"మన చిన్నా బొమ్మలు ఎంత బాగా గీచాడో చూడండి' తీసుకెళ్ళి చిన్నాని మా నాన్న ముందు నించోబెట్టింది. ఎరువుల బస్తాలు ఎన్ని తెప్పించాలో లెఖ్ఖలేస్తున్న నాన్నకి ఇది పనిలేని పనిగా తోచివుండొచ్చు. మా అమ్మ చేతిలోని పేపరును చేతిలోకి తీసుకోకుండానే ఓ కంటితో ఓరగా చూసారాయన.

" ఓ మన ఇల్లా ! తేలిగ్గా అనేసారాయన. "కానీ ఇల్లు పెద్దదిగా... గుడి చిన్నదిగా... ఓ మూలకు వుందేమిటి? అన్నారాయన. ఏది బావుందో ముందు చెప్పి ఎలా ఉంటే బావుంటుందో తర్వాత చెప్పే సహనం ఎంత మందికి వుంటుంది!

నాన్న పేపరువంక ఇంకొక్కసారి చూసారు. "ఇక్కడంతా ఖాళీగానే వుందికద చిన్నా! పేపరు మొత్తం వరి పైరు వేసెయ్యి. మనది పల్లెటూరని తెలియొద్దూ !"

డ్రాయింగ్‌లో కూడా తమ ఇష్టాయిష్టాలను జొప్పించచూస్తున్నారు. నా కెరిర్ విషయంలో జోక్యం చేసుకోవడం పెద్ద విషయం కాదనిపించింది. తనకు నచ్చడం లేదన్న విషయం చిన్నా మొహంలో ప్రస్ఫుటంగా కనబడుతోంది. అయినా వాళ్ళు ఖాతరు చేయడం లేదు. ఇంక నా అభిప్రాయాల్ని అడిగి మరీ ఎవరు తెలుసుకుంటారు?



చిన్నా మౌనంగా అక్కడే కూర్చొని పేపరంతా వరిగడ్డి గీసాడు. "అద్దీ... ఇప్పుడు ఎంతో బావుంది." మెచ్చుకోలుగా అన్నారు నాన్న. జ్యా అమ్మా నాన్న వదినల ఉద్దేశ్యాలకు అనుగుణంగా వెళ్ళాలంటే, నా బ్రతుకు చిత్రం ఎలా వుంటుందో నా కళ్ళకు కనబడింది. విషాదమూ, విరక్తి కలయగలిపిన నవ్వొకటి నా పెదవులపై కదలాడింది.

"ఏదీ, నన్ను చూడనీ..." అటుగా వచ్చిన మా వదిన దాదాపు లాక్కున్నట్లుగా తీసుకుంది. ఆ పేపరును. చూసీ చూడగానే మా వదిన గొంతు ఖంగుమంది.

"గీతల్లో కూడా పెంకులే... నీ ఖర్మ ఇట్టా తగలడింది. ఇంటి ముందు ఈ బావి ఒకటి. అవున్లే, స్విచ్చేస్తే నీళ్ళుపడే షవరు నువ్వు చూసుంటేకదా గీయటానికి ! పనికొచ్చే పనులు చేయరా ఫో.. పోయి చదువుకో".

మనసు అట్టడుగు పొరల్లో దాగున్న అసహనాన్ని వెళ్ళగక్కడానికి, చాలామందికి పిల్లలు సాధనం అనుకుంటా. మా వదిన మాటల తూటాల దెబ్బ నాకు తెలుసు. నేను పై చదువులకు వెళ్తున్నానన్నప్పుడు ఆమె మాట్లాడిన మాటలు నాకు బాగా గుర్తు.

"ఇదిగో శంకరం నువ్వు ఎక్కడ చదివినా, ఏ దేశానికి పోయినా నాకేమీ అభ్యంతరం లేదు." మాట్లాడుతూనే అటూ ఇటూ పరికించింది. "నువ్వూ మాలా మట్టి పిసుక్కోమని నేను చెప్పను. కానీ... ఈ ఇంటి మీద ఏమైనా ఆశవుంటే.. వదులుకో.. ఇప్పటికే నీ మీద ఖర్చు ఎక్కువే అయింది.

ఇలాంటి సమాధానాన్ని కొంత నేను ఊహించిన మాట నిజమే. ఎదురు చూసిందే అయినా.... ప్రతికూల మాటలు వినడం కష్టం. నా ఆలోచనల్లోకి నన్ను వదిలేసి వదిన వెళ్ళిపోయిందప్పుడు. కానీ ఆ 'మాటల' వెనుక కారణాలు నాకు తెలుసు. గతంలోంచే కద ప్రవర్తన పుట్టుకొస్తుంది.

ప్రాథమికంగా నా అన్న పెద్దగా చదువుకోలేదు. కాబట్టి నా చదువు కోసం పెట్టిన ఖర్చంతా ఆమెకు అడిషనల్ అనిపిస్తుంది. రోజూ క్యూలో నుంచొని మంచినీళ్ళ టాంకరు నుండి రెండు బిందెల మంచినీళ్ళు తెచ్చుకున్న గతం ఆమెది. పరిస్థితులు ఆమె మనస్సును, శరీరాన్ని దృఢతరం చేసాయి. ఆమెకు పల్లెటూరంటే ఏవగింపుకు చాలా కారణాలే వున్నాయి. నిజానికి పల్లెటూర్ల అందాల్ని పొగిడేవాళ్ళల్లో అధికశాతం పల్లెటూర్లలో నివసించరు. సంవత్సరానికి ఒక్కసారి వచ్చి "అబ్బ! పచ్చదనం...." అనేసి పోతారు. పేడతో అలికిపెట్టిన ముగ్గు బానే వుంటుంది. చేయిపెట్టి, కళ్ళాపి కలిపినప్పుడు కదా ఆ సౌకర్యం తెలిసేది. గుండెనొప్పి వచ్చిన నాన్న వైద్యం అందక, గిలగిల కొట్టుకొని ప్రాణం విడుస్తే.... ఏ కూతురికి పల్లె మీద ప్రేమ వుంటుంది?

అమ్మ అంత హఠాత్తుగా అరిచేసరికి భయపడిపోయాడు చిన్నా. వదిన కోపం ఇంకో పదినిముషాలు కొనసాగింది. మామూలు కంటే గిన్నెలు ఎక్కువ శబ్దం చేస్తున్నాయి. నేను చిన్నా భుజం చుట్టూ చేయివేసాను. "చిన్నా ... అమ్మకు ఈ ఇల్లు నచ్చదు... వర్షాకాలంలో ఈ పెంకులు కారుతూ వుంటాయి కదా! అందుకు ఆమెకు అధునాతనంగా ఉండే ఇల్లంటే ఇష్టం."

చిన్నాకు ఏ బొమ్మ గీయడం ఇష్టమో... ఎవరికి పట్టదు. ఎవరికి వారు తమ కోణం నుంచే ఆలోచించారు. వాళ్ళకు కావాల్సింది రాబట్టుకున్నారు. నా భవిష్యత్తు గురించి నేను ఏ కలలు కంటున్నానో ఎవరికీ పట్టదు. ఒకళ్ళది ఆశ... ఒకళ్ళది భయం. కాని నాకు ఇది జీవితం. అది ఎలా వుండాలో నాకు తెలియాలి.

"చిన్నా... రేపు నిన్ను చెరువుగట్టుకు తీసుకువెళతాను. అన్ డిస్టర్బ్‌డ్... నీకు నచ్చిన బొమ్మ గీసెయ్. చిన్నా మొహంలో విరిసిన నవ్వు.... నా కళ్ళలో ప్రతిఫలించింది. నా జీవిత చిత్రాన్ని నేను గీసుకోబోతున్నందుకు.

**కవిత**

## కంచెల దారి

- డా॥ సి. భవానీదేవి
9866847000

దేశమంటే మనుషులే ఐతే
మనుషుల్ని తరిమికొట్టే మా మట్టినేమనాలి?
మా తలపై ఉంది ఆకాశం మాత్రమే
కాళ్ళకింద చారెడు మట్టి కోసం
మీరంతా నాటుకున్న కంచెల వెంబడి
ప్రాణభయంతో పరిగెత్తుతున్నాం
మాకూ ఇల్లు వాకిలి ఉద్యోగం ఉండేవి
మీలాగే కుటుంబమూ ఉండేది
మా పాదాల ముళ్ళ ప్రయాణం
మరో దేశాన్ని ఆక్రమించుకోటానికో
వ్యాపారం పేరుతో దోపిడీకో కాదు
స్వంతగడ్డ మీద బతకలేని వాళ్ళకి
భూమ్మీదే బతికే యోగ్యత పోతుందా?
ఎవరో అధికార ఆగడాలు సృష్టిస్తుంటే
ఇంకెవరో తిరుగుబాటు విలయాలు కల్పిస్తే
మరెవరో మతమౌఢ్యాన్ని ముడివేస్తే
ఇందరి చేతల్లో చేతుల్లో నుసి అవుతున్న వాళ్ళం
ఆయిల్ ట్రక్కుల్లోంచి, క్రూయిజుల్లోంచి



డింగీలలోంచి కొన ఊపిరితో ఉరికినా
మీ సరిహద్దుల కంచెల కాపలా నేత్రాలు
మళ్ళీ మమ్మల్ని మహాసముద్రాల్లోకి తోసేస్తున్నాయి
అమానవీయ ద్వీపాల తిరస్కార గర్జన
మా బతుకు హక్కును బూది చేస్తున్నప్పుడు
ఏ దేశాన్నయినా మేమెంతని గౌరవిస్తాం?
తీరాల్లో శవాలుగా కొట్టుకువచ్చే
మా చిన్నారుల పాలబుగ్గల మీద
కమిలిపోయిన కన్నీటి చారికల సాక్షిగా
ఈ ఉగ్రమత హంతకత్వాన్ని శపిస్తున్నాం
సువిశాల భూమితల్లి ఒడిలో
మాకో అడుగు నేలకోసం వేడుకుంటున్నాం
ప్రతి దేశపు పహరా కంచెల మధ్య
మా కోసం ఓ చిన్న దారి చూపించమంటున్నాం
(సిరియా ప్రజల కోసం బాధపడ్తూ)

## మహాసంగ్రామం

- డా॥ ఈదూరు సుధాకర్
9849561613

ఈ సంగ్రామం
రాజుల మధ్య
రాజ్యాలమధ్య కాదు
విద్య మధ్య
విద్యార్థుల మధ్య
సారీ...
విద్యా సంస్థల మధ్య
♦
ఇక్కడ
ఆరవతరగతిలో ఐఐటి
ఎనిమిదవ తరగతిలో ఇంటరు
బోధిస్తారు
చెంబుడు బుర్రలో
బిందెడు గుమ్మరిస్తారు
ఎవరు
ఒకరో ఇద్దరో

జన్మతప్త జలస్థంభన
"విద్య" నేర్చిన వీరులుతప్ప
ఈతరాని ఆవరేజ్‌లు
విద్యకూ విద్యాసంస్థలకి
బలైపోతున్నారు
♦
అమాయక అమ్మానాన్నలు
మమ్మీ డాడీల శునకానందంలో
కార్పొరేట్ స్కూల్ల
మిథ్యా ప్రచారాలకి
బానిసలైపోతున్నారు
గర్భస్థంగానే పిండాలని
ఎంసెట్ గుంజలకి కట్టెసి
'నీట్' పరీక్షలు పెట్టెసున్నారు
బాల్యం లేని విద్యార్థులు



మార్కుల పోటీలో
బోన సాయిలౌతున్నారు
♦
అమ్మల్లారా
ఈజిప్ట్ మమ్మీల్లారా
ఈ సంగ్రామం
మార్కుల కోసం కాదు
'రాంకుల' కోసం
సారీ... క్షమించండి
"రాంకర్ల" కోసం !!!

విశ్లేషణ

# భూకేంద్రీకరణ మీద యుద్ధం "జీవకోన"




- రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
9440222117

***క్విట్ఇండియా ఉద్యమకాలంలో జన్మించిన లంకిపల్లె ఆర్థిక శాస్త్రనిపుణులు. గ్రామీణ వ్యవసాయరంగ ఆర్థికాంశాలు తెలిసిన వారు. గ్రామీణ మానవ సంబంధాలలోని వెలుగుచీకట్లు తెలిసినవారు. స్వాతంత్ర్యానంతర భారత దేశ సామాజిక పరిణామాలపట్ల విమర్శనాత్మక దృష్టిగలవారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యమే అన్ని సమస్యలకూ పరిష్కారమని ఆయన సిద్ధాంతం దానికి విఘాతం కలిగించే ఆర్థిక రాజకీయ పరిణామాలను విమర్శనాత్మకంగా ఆయన తన నవలల్లో చిత్రించారు.***

*"ఒకనాటి రాచరికం - కుటుంబపాలన వ్యవస్థ*
*రాచరిక పాలనలో భూమి కేంద్రీకృతమైంది*
*కాలక్రమంలో మార్పులు వచ్చాయి*
*రైతాంగ పోరాటాలు జరిగాయి*
*భూమి వికేంద్రీకరణ, భూసంస్కరణ చట్టాలు వచ్చాయి*
*అవి ఏమైనాయో ఇప్పుడు తెలియడంలేదు*
*భూమి తిరిగి కేంద్రీకృతమవుతూ వుంది*
*కొత్త రాజకీయ రాచరికం వారసత్వం చిందులు తొక్కుతూ వుంది"*

**(జీవకోన : పు.207)**

లంకి పల్లె కన్నయ్యనాయుడు 2008లో అమెరికాకు వెళ్ళిన సమయంలో ఆరువారాలలో రాసిన గొప్ప నవల జీవకోన. క్విట్ఇండియా ఉద్యమకాలంలో జన్మించిన లంకిపల్లె ఆర్థిక శాస్త్రనిపుణులు. గ్రామీణ వ్యవసాయరంగ ఆర్థికాంశాలు తెలిసిన వారు. గ్రామీణ మానవ సంబంధాలలోని వెలుగుచీకట్లు తెలిసినవారు. స్వాతంత్ర్యానంతర భారత దేశ సామాజిక పరిణామాలపట్ల విమర్శనాత్మక దృష్టిగలవారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యమే అన్ని సమస్యలకూ పరిష్కారమని ఆయన సిద్ధాంతం దానికి విఘాతం కలిగించే ఆర్థిక రాజకీయ పరిణామాలను విమర్శనాత్మకంగా ఆయన తన నవలల్లో చిత్రించారు.

2008 నాటికి ప్రపంచీకరణ దుష్ఫలితాలు భారతదేశం అనుభవంలోకి వచ్చాయి. 1991 ప్రాంతంలో భారతదేశంలోకి ప్రవేశించిన ప్రపంచీకరణ అతివేగంగా అన్ని రంగాలలోకి చొచ్చుకుపోయింది. రైతుల, చేనేత కార్మికుల ఆత్మహత్యలు భారతదేశానికి ప్రపంచీకరణ ఇచ్చిన 'మహత్తర కానుక'. విద్య, వైద్యం, ఉపాధి, ఆరోగ్యం సారాంశంలో ప్రజాజీవితమే ప్రైవేటీకరింపబడింది. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వాళ్ళు ప్రజల బతుకును ప్రైవేటీకరించడమే గుడ్‌గవర్నెన్సు ప్రచారం చేశారు. ప్రజల పట్ల బాధ్యత నుండి తప్పుకోవడం ప్రశ్నించిన వాళ్ళను కాల్చి చంపడం గొప్ప పాలనగా ప్రచారం చేసుకున్నారు. అభివృద్ధి సంస్కరణ అనే మాటలకు అర్థాలు తలక్రిందులయ్యాయి. బహుళజాతి కంపెనీలకు అడుగులకు మడుగులొత్తడమే ప్రజాస్వామ్యంగా మారిపోయింది. మానవీయ, సామాజిక, సంప్రదాయ శాస్త్రాల అధ్యయనాన్ని నిరుత్సాహపరచి, కంప్యూటర్ విద్యను దైవవిగ్రహంగా చేసి పూజించారు. భారతదేశంలో పుట్టి పెరిగి చదువుకొన్నవాళ్ళు అమెరికాకు పోయి బతకడమే దేశభక్తి కింద జమైపోయింది.

మన దేశ విద్యావంతులకు మనదేశంలో మంచి జీవితాన్నివ్వలేకపోవడం సిగ్గుపడాల్సిన అవసరం లేని అంశంగా మారిపోయింది. 2008 నాటికి అమెరికా మత్తు తూకం మించిపోయింది. ఈ నేపథ్యంలో 'జీవకోన' నవల వచ్చింది.

***అమెరికాలో పుట్టిన ఒక తెలుగమ్మాయి తెలుగు రాష్ట్రానికి వచ్చి, తెలుగు ప్రజలలో కలిసిపోయి, వాళ్ళ జీవన సంస్కృతిని అర్థం చేసుకొని, వాళ్ళ సమస్యల పరిష్కారంలో కృషి చేసిన తీరుకు 'జీవకోన' నవల ప్రతిఫలకం.***

తెలుగునేలలో పుట్టి, ఇక్కడ గాలి పీల్చి, ఇక్కడి నీళ్ళు తాగి, ఇక్కడ బట్టగట్టి, ఇక్కడి తిండి తిని, ఇక్కడ ప్రజల శ్రమతో చదువుకొని, ఈ సౌకర్యాలన్నీ కల్పించిన ప్రజల పట్ల బాధ్యతనుంచి తప్పుకొని తెలుగు విద్యావంతులు అమెరికా గోచి ఎగబెట్టడానికి ఉవ్విళ్ళూరుతున్న కాలంలో, ఇక్కడ చెయ్యడానికి ఏ పనీ లేనట్లు అమెరికాకు ఊడిగం చెయ్యడానికి తెలుగు యువత పరుగులెత్తుతున్న సమయంలో, అమెరికాలో పుట్టిన ఒక తెలుగమ్మాయి తెలుగు రాష్ట్రానికి వచ్చి, తెలుగు ప్రజలలో కలిసిపోయి, వాళ్ళ జీవన సంస్కృతిని అర్థం చేసుకొని, వాళ్ళ సమస్యల పరిష్కారంలో కృషి చేసిన తీరుకు 'జీవకోన' నవల ప్రతిఫలకం.

చిత్తూరు జిల్లాలోని జీవకోన, దాని సమీపంలోని రాయపురం గుడిపాళెం, కృష్ణాపురం వంటి గ్రామాలు ఈ నవలా కథాస్థలాలు. జానకీబాల రఘురాంల కుమారుడు శివానంద వైద్యవిద్యనభ్యసించి గుడిపాళెంలో ఆసుపత్రి పెట్టి గ్రామీణ పేద ప్రజలకు వైద్యసేవలందిస్తూ ఉంటారు. అమెరికాలో నీరజా సూర్యప్రకాశ్‌రావుల కుమార్తె శైలజ హార్వార్డ్ విశ్వవిద్యాలయంలో ఎం.బి.ఏ చదివి భారత దేశానికి వచ్చి జీవకోన ప్రాంతంలో ప్రజల సమస్యల పరిష్కారంలో భాగస్వామి అవుతుంది. తన పెంపుడు తండ్రి రఘురాంను అతని భార్య జానకీబాలతో కలుపుతుంది. నవల ప్రారంభమయ్యే సమయానికి శివానంద్ తల్లిదండ్రులు విడిపోయి ఉంటారు. శైలజ తల్లిదండ్రులు మరణించి ఉంటారు. శైలజ జీవకోనలో లిల్లీగా అందరికీ పరిచయమౌతుంది. ఇలా ఈ నవల ఒక కుటుంబ కథ, మరో రకంగా గ్రామకథ.

శివానంద తల్లిదండ్రులు జానకీబాల, రఘురాంల, జానకీ బాల సంపన్నుని కుమార్తె. రఘురాంకి ఆమె తండ్రి ఆర్థిక సహాయం చేసి చదివించి కూతురునిచ్చి పెళ్ళి చేస్తాడు. రఘురాం విశ్వవిద్యాలయంలో బయోకెమిస్ట్రీ అధ్యాపకుడు. జానకీబాల ఉద్రేకి. వాళ్ళిద్దరి మధ్య ఆర్థిక వైద్యమేగాక, స్వభావవైరుధ్యం కూడా ఉంది. అందువల్ల నిరంతరం ఇద్దరి మధ్య ఘర్షణ. రఘురాం దగ్గర నీరజ పరిశోధన చేస్తుంటే వాళ్ళిద్దరి మధ్య అక్రమ సంబంధముందని అనుమానిస్తుంది. రఘురాంకు అమెరికాకు వెళ్ళే అవకాశం వస్తే వెళ్ళవద్దంటుంది. ఆమెను ధిక్కరించి రఘురాం అమెరికాకు వెళ్ళి గొప్ప శాస్త్రజ్ఞుడౌతాడు. నీరజ కూడా అమెరికాకు వెళ్ళిందని తెలుసుకున్న జానకీబాల అక్కడ వీళ్ళిద్దరూ కలిసి ఉంటున్నారని అనుమానిస్తుంది తీవ్రంగా రఘురాంను దూషిస్తూ లేఖలు రాస్తుంది. అలా వాళ్ళు ఇరవై అయిదేళ్ళు దూరంగా ఉండిపోతారు.

నీరజ అమెరికాకు వెళ్ళిన తర్వాత గుంటూరుకు చెందిన సూర్యప్రకాశ్‌రావును వివాహం చేసుకుంటుంది. నీరజ అనంతపురం అమ్మాయి. నీరజా సూర్యప్రకాశ్‌రావులకు శైలజ పుట్టిన తొలినాళ్ళలోనే కారు యాక్సిడెంటు జరుగుతుంది. నీరజ అప్పటికప్పుడే కన్నుమూస్తుంది. సూర్యప్రకాశ్‌రావు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చేరి, తాను బతకనని అర్థం చేసుకుని తన ఆస్తినంతా శైలజ పేర వీలునామా రాసిపెట్టి, ఆమెను రఘురాంకు అప్పగించి కన్నుమూస్తాడు. లేతబిడ్డగా ఉన్న శైలజను రఘురాం లిల్లీ అని పిలుస్తూ పెంచి పెద్ద చేశాడు.

శివానంద తల్లి పెంపకంలో, శైలజ పెంపుడు తండ్రి పెంపకంలో పెరిగినా ఇద్దరూ చక్కగా చదువుకున్నారు. గొప్పవ్యక్తిత్వాలను నిర్మించుకున్నారు. బాధ్యతగా బతకడం అలవరచుకున్నారు.

లిల్లీ(శైలజ) కంపెనీ ఉద్యోగం మానుకొని, న్యూయార్క్ నుండి రాయపురం వచ్చి, అక్కడి ప్రజా జీవితాన్ని, సామాజిక సమస్యలను అర్థం చేసుకుని వాటిని పరిష్కరించే క్రమంలో, తనను పెంచి పెద్ద చేసిన రఘురాంను భారతదేశానికి తీసుకువచ్చి, అతని భార్యతో కలుపుతుంది. శివానందతో లిల్లీ పెళ్ళి జరిగే సమయానికి తన తండ్రివైపు బంధువులను కూడా కలుపుకుంటుంది.

ఈ నవలలో రెండంశాలు ప్రధానంగా చిత్రింపబడ్డాయి. అవి 1. కుటుంబ సంబంధాల రూపంలోని స్త్రీ పురుష సంబంధాలు. 2. గ్రామీణ సంబంధాల రూపంలోని సామాజిక సంబంధాలు. ఈ రెంటింటిని ఆవరించిన ఆర్థిక రాజకీయ

పరిస్థితులు, వీటిని మార్చడానికి జరిగిన ప్రయత్నాలు – ఇవే ఈ నవలలోని ఇతివృత్తం.

> *జీవకోన ప్రాంత ప్రజా సమస్యలను అవగాహన చేసుకుని వాటి పరిష్కారం కోసం ప్రయత్నిస్తుంది. జీవకోనలో శైలజ చివరిదాకా లిల్లీయే. తెల్లపిల్ల.*

జీవకోనలో రఘురాం ఒక పేదవాడు. రమణయ్య రఘురాంను చేరదీసి చిన్నప్పటినుండి విద్య కోసం ఆర్థికసహాయ చేస్తాడు. రఘురాం బయోకెమిస్ట్రీ చదివి పిహెచ్‌డి చేసి విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడౌతాడు. రమణయ్య తన కూతురు జానకీబాల నిచ్చి రఘురాంకు పెళ్ళి కూడా చేశాడు. రమణయ్య మరణానంతరం జానకీ రఘురాంల మధ్యగల ఆర్థిక అసమానత, జానకి విపరీతతత్వం వాళ్ళ దాంపత్య జీవితం మీద పడుతుంది. జానకి ఇంటర్ వరకు చదువుకుంది. టీనేజ్ ప్రేమ జ్వరం పట్టుకుని చదువు ఆగిపోయింది. తాను తప్పు చేశానని ఆమె ఆలస్యంగా గ్రహించింది. అప్పటికి జరగవలసిన నష్టం జరిగిపోయింది. ఉద్రేకం, కోపం, వాక్పరుష్యం, అనుమానం వంటి బలహీనతలతో ఆమె రఘురాంతో గొడవపడేది. నీరజ రఘురాం స్కాలర్. ఆమె ఇంటికి వస్తే వాళ్ళిద్దరి మధ్య సంబంధాలున్నాయోమోననుకుంది. నీరజ థీసిస్ పూర్తి చేయించే సహాయంలో రఘురాం ఆలస్యంగా ఇంటికి వస్తే యుద్ధమే చేసింది. ఆయనకు అమెరికాకు వెళ్ళే అవకాశం వస్తే వెళ్ళవద్దని అడ్డుకుంది. ఆయన ఆమె మాట వినకుండా అమెరికా వెళ్ళాడు. వెళ్ళిన తర్వాత కూడా వాళ్ళ మధ్య గొడవలు జరిగేవి. తీవ్రమైన పదజాలంతో జానకి రాసిన ఉత్తరంతో వాళ్ళ మధ్య పూర్తిగా అగాధం ఏర్పడింది. అలా ఇరవైఅయిదేళ్ళు గడిచిపోయాయి. జానకీబాలకు మొగవాళ్ళ మీద ద్వేషం పట్టుకుంది. కొడుకు శివానందను మాత్రం జాగ్రత్తగా చదివించింది. రఘురాంకు తనకు భర్త అయ్యే అర్హత లేదని, తనను మోసం చేసి వెళ్ళిపోయాడని ఆమె అభిప్రాయం. నీరజ కూడా అమెరికా వెళ్ళింది. కాబట్టి రఘురాం ఆమెతో ఉంటూ తనను నిరాదరిస్తున్నాడని అనుమాన పడింది.

నీరజది అనంతపురం జిల్లా ఆమె తండ్రి సూర్యప్రకాశ్‌రావు గుంటూరు వాసి. నీరజ పిహెచ్‌డి పూర్తి చేసుకొని అమెరికా వెళ్ళి సూర్యప్రకాశ్‌రావును పెళ్ళాడింది. శైలజ పుట్టిన కొన్నాళ్ళకే కారు యాక్సిడెంట్‌లో నీరజ చనిపోయింది. తీవ్రగాయాలతో ఆసుపత్రిపాలైన సూర్యప్రకాశ్‌రావు తన ఆస్తిని శైలజ పేర వీలునామా రాసి, పాపను రఘురాం చేతిలో పెడతాడు. రఘురాం ఆమెను లల్లీ అని పిలుస్తూ పెంచి పెద్దచేసి హార్వార్డ్ విశ్వవిద్యాలయంలో ఎంబిఏ చదివిస్తాడు. శైలజ తన కుటుంబ విషయం, తన పెంపుడు తండ్రి కుటుంబ విషయం తెలుసుకొని జానకీబాల రఘురాంలను కలపాలని జీవకోనకు వస్తుంది. అనేక ప్రయత్నాల తర్వాత వాళ్ళను కలుపుతుంది. వాళ్ళ కుమారుడు శివానందను వివాహమాడుతుంది. శైలజ ఢిల్లీ వచ్చి, తిరుమలకు పోతుంది. కాటేజ్‌లో ఉంటుంది. జానకీబాల శివానందలు కూడా తిరుమలకు వెళతారు. వర్షం విపరీతంగా కురుస్తూ వుంటే, శైలజ ఉండే కాటేజ్ పంచన ఒదుగుతారు. నీరజ తలుపుతీసి లోనికి రమ్మంటుంది. ఈ కలయిక యాదృచ్ఛికమే. వాళ్ళతో కలుసుకుని నీరజ జీవకోనకు వెళ్తుంది. అక్కడి గ్రామాలన్నీ తిరిగి అక్కడి సామాజిక స్థితిగతులను అర్థం చేసుకుంటుంది. ఒకవైపు జానకీబాల, ఆమె పెద్దమ్మ వర్ధనమ్మల ద్వారా, అలాగే మాటల మల్లయ్య అనే సహాయకుని ద్వారా రఘురాం జానకీబాలల కుటుంబ విషయాలు తెలుసుకుని అర్థం చేసుకుంటుంది. మరోవైపు జీవకోన ప్రాంత ప్రజా సమస్యలను అవగాహన చేసుకుని వాటి పరిష్కారం కోసం ప్రయత్నిస్తుంది. జీవకోనలో శైలజ చివరిదాకా లిల్లీయే. తెల్లపిల్ల.

తిరుమల నుండి జానకీబాలతో పాటు రాయపురం వచ్చిన కొద్దికాలంలోనే, గుడిపాళెంలోని వర్ధనమ్మ దగ్గరికి వెళ్ళిపోతుంది. శివానందతో లిల్లీ సన్నిహితంగా ఉండడం గమనించి జానకి అనుమానపడుతుంది. అల్లా రెండుసార్లు అమెరికా వెళ్ళి వస్తుంది. చివరిసారి రఘురాంను భారతదేశానికి తీసుకువస్తుంది. పట్నంలో ఇల్లు కొని అక్కడ ఉంచుతుంది. రఘురాం రాసిపెట్టుకున్న డైరీని వర్ధనమ్మ, శివానందల ముందు జానకీబాలకిచ్చి చదవమంటుంది. జానకీబాల ఆ డైరీని చదివి తన తప్పును తెలుసుకుంటుంది. భర్తను కలుసుకుంటుంది. శివానంద శైలజల (లల్లీ పెళ్ళికి ఆమోదిస్తుంది. పెళ్ళి సమయానికి శైలజ నానమ్మ, మేనత్తలు కూడా కలుసుకుంటారు. "దాంపత్యజీవితంలో అపనమ్మకం అనర్థాలకు హేతువు" "ఆస్తికి అహంకారానికి దగ్గర సంబంధం ఉంది" "విద్వేషానికి మూలం ప్రేమరాహిత్యం" "స్త్రీ పురుషుల మధ్య నమ్మకం ప్రేమకు పునాది" – ఇలాంటి సూత్రాల మీద ఈ నవలలో స్త్రీ పురుష

సంబంధాలు చిత్రింపబడ్డాయి. సాధారణంగా భారతదేశంలో స్త్రీలు పురుషాధిపత్యానికి బలైపోతారు. ఈ నవలలో స్త్రీ ఆధిపత్యాన్ని రచయిత ప్రదర్శించారు. ఆమె వ్యక్తిగత స్వభావం ఇందుకు ఒక కారణమైతే, ఆమె ఆస్తి మరో కారణం ఇందుకు.

> ***ఈ నవలలో స్త్రీ ఆధిపత్యాన్ని రచయిత ప్రదర్శించారు. ఆమె వ్యక్తిగత స్వభావం ఇందుకు ఒక కారణమైతే, ఆమె ఆస్తి మరో కారణం ఇందుకు.***

కుటుంబంలో స్త్రీ పురుష సంబంధాలలోనేగాక, మానవ సంబంధాలలో కూడా డబ్బు ఎలాంటి పాత్ర నిర్వర్తిస్తుందో రచయిత చిత్రించారు. రఘురాంది జీవకోనలో చివరిగ్రామమైన కృష్ణాపురం. ఆయనకు అయిదేళ్ళప్పుడు అతని తండ్రి రాత్రిపూట వరిపంట కావలికిపోయి చనిపోయాడు. జానకీబాల తండ్రి రమణయ్య రఘురాం చదువుకు సహాయం చేస్తాడు. రఘురాం కుటుంబానికి మూడుచోట్ల మూడెకరాల భూమి ఉంటుంది. అతని అన్న ఆ భూమిని అమ్మేసి ఒకేచోట కొందామంటే రఘురాం అందుకు ఆమోదించి ఇంకొంచెం డబ్బు కూడా ఇచ్చాడు. కాని ఆ అన్న ఆ నాలుగెకరాల భూమిని తన ఒక్కడి పేరుమీదనే రాయించేసుకున్నారు. అమ్మ గొడవ చేస్తే రఘురాం సర్దిచెప్పాడు బాధతో ఆమె కన్ను మూసింది. అప్పుడు ఈ రఘురాంకు "అన్నదమ్ముల అనుబంధం భూమితో ముడిపడి వుంది" అని అనిపించింది. పెళ్ళయినాకా జానకీబాల తనమీద పెత్తనం చెలాయించడానికి కూడా ఆమె ఆర్థిక ఆధిపత్యం కారణమని ఆయనకర్థమైంది. "జానకీబాల అసంతృప్తికి కారణం అత్తవారింటి ఆస్తి లేకపోవడం" అని ఆయనకు స్పష్టమైంది.

భారతీయ గ్రామంపై పెత్తందార్ల భోజ్యం, ఆధిపత్యవాదులు అభివృద్ధి విరోదులు, స్వార్థపరులు, ప్రజల శ్రమను తమ సుఖాలకు సోపానాలుగా వాడుకుంటారు. అన్ని రకాల వనరులను, ఆఖరికి వైవాహిక సంబంధాలను కూడా తమ ఆర్థిక ప్రయోజనాలకు ఉపయోగించుకుంటారు. వీళ్ళకు ప్రజాస్వామ్యం మీద గౌరవం ఉండదు. ప్రజల హక్కులను ఆమోదించడం ఆస్తికోసం, ఆధిపత్యం కోసం ఎంతకైనా తెగిస్తారు. దేనికైనా తెగబడతారు. 'జీవకోన' ఈ వాస్తవాన్ని చాలా విస్తృతంగా చిత్రించింది.

వర్ధనమ్మ గుడిపాళెంలో ఉంటుంది. ఆమె భర్తను ఆమె బావ మోసం చేసి ఎక్కువ ఆస్తిని కాజేసి ఉంటాడు. ఆయన కొడుకులు గిరిబాబు, హరిబాబు, వితంతువైన వర్ధనమ్మ ఆస్తంతా తమదేనని అనుకుంటూ ఉంటారు. ఈ యిద్దరికీ పడదుగాని, దోపిడీలో ఇద్దరూ ఏకమౌతారు. వర్ధనమ్మ ఆధ్యాత్మిక చింతనలో మునిగి తన ఇంటిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రస్థాపన కోసం ప్రభుత్వానికి ఇచ్చేస్తుంది. దానిని అడ్డుకోడానికి వచ్చిన హరిబాబును నిర్దాక్షిణ్యంగా మాట్లాడి తిప్పి పింపిస్తుంది. తన ఆస్తి తన ఇష్టమని నిస్సంకోచంగా చెబుతుంది. హరిబాబు ఆమెను దబాయిస్తాడు. 'మమ్మల్ని కాదని జీవకోన జనం ఏ పనీ చేయలేరు. మా మాట కాదని ఒక్క అడుగు ముందుకు వేయలేరు. మా నీడే వారికి అండ" అంటాడు. కాని వర్ధనమ్మ బెదరదు. దీనికంతటికీ లిల్లీయే కారణమని హరిబాబు ఆమె అంతు చూస్తానంటాడు". ఆమె జోలికి వెళ్తే మీరు మిగలరు" అని స్పష్టం చేస్తుంది వర్ధనమ్మ. గిరిబాబు, హరిబాబు తొందర పడ్డాడంటారు. "ఒకడిని మించిన మరొకరు అన్నదమ్ములు" అంటాడు రచయిత. మాటల మల్లయ్య మాటల్లో "అన్నదమ్ములు పగలు జనానికి ప్రత్యర్థులుగా కన్పడతారు. రాత్రుల్లో మిత్రులు ఇద్దరు తోడుదొంగలు. అక్రమార్జనలో, భూకబ్జాలో ఇద్దరూ భాగస్తులు. వీరు జీవకోనలో వేర్వేరు రాజకీయ పార్టీల నాయకులు. అంతా రాజకీయ కపటనాటకం. ఎన్నికల్లో ఏ పార్టీ గెలిచినా, రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసినా, జీవకోనలో అన్నదమ్ముల నాయకత్వం, ఆధిపత్యం కొనసాగుతుంది. సామాన్యజనం వాడి అదుపు ఆజ్ఞలకు కట్టుబడి ఉంటారు. "హరిబాబు సర్పంచి ఆయన పెద్ద కొడుకు కాంట్రాక్టరు, రెండో కొడుకు వ్యాపారి. గిరిబాబు బావమరది చౌకదుకాణం నడుపుతూంటాడు. అందరివీ అక్రమార్జనలే. గ్రామ ప్రజలే కాదు, వనరులూ, ఆదాయాలూ అన్నీ వీళ్ళ చేతుల్లోనే ఉన్నాయి. 2008 నాటికి భారతదేశానికి స్వతంత్ర్యం ఐదు దశాబ్దాలు దాటింది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా మనం మన దేశాన్ని గురించి చెప్పుకుంటాం. గ్రామస్థాయిలో భారతదేశం ప్రజాస్వామికం కాని వాస్తవాన్ని "జీవకోన" ప్రదర్శించింది. కొన్ని గ్రామాల సముదాయం ఆర్థికంగా సాంఘికంగా ఒక్క కుటుంబం చేతిలో ఉండటం అప్రజాస్వామికతకు నిదర్శనం.

హరిబాబుకు ఊర్లో పెద్దిలు. పట్నంలో చిన్నిల్లు. వ్యక్తిగత జీవితం నియమబద్ధంగా లేని నాయకుడు హరిబాబు. వర్ధనమ్మ తన ఇంటిని ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి దానం చేస్తుంటే అడ్డుకున్న హరిబాబు, అనివార్యంగా గ్రామానికి వచ్చిన

ఆరోగ్య కేంద్రం ప్రారంభసభలో తన ప్రయత్నం వల్లే అది గ్రామానికి వచ్చినట్లు చెప్పుకున్నాడు. ఈ ఎగిరిపోయే పేలాపిండిని కృష్ణార్పణం అనే బాపతు నాయకుడు హరిబాబు. జానకీబాల తన కొడుకు శివానందకు చేసే పెళ్ళి ప్రయత్నాలను హరిబాబు జనకీబాల వ్యక్తిగత జీవితాన్ని గురించి అవతలి వాళ్ళకు చెప్పి అడ్డగొడతాడు. గిరిబాబు కూతుర్ని కట్టబెట్టి రాజకీయంగా ఎదురు లేకుండా ఎదగాలని వాళ్ళ ప్రయత్నం వర్ధనమ్మ తన ఆస్తిని శివానందకు రాసిచ్చిందని తెలిసి "ఎంతా పని చేసింది దొంగముండ!" అనుకున్నారు సోదరులు.

> *ఈ నవలలోని దుర్మార్గాలు చదివినప్పుడు భారతదేశం ఎప్పుడు నిజమైన ప్రజాస్వామిక దేశంగా మారుతుందా! అనిపిస్తుంది.*

జీవకోన చెరువుకు గండి పడింది గండి పూడిస్తే ప్రజల సాగు, తాగునీటి సమస్య తీరుతుంది. గండి పూడ్చకపోవడం వల్ల అక్కడి వ్యవసాయం నాశనమై పోయింది. ఈ సోదరులు చెరువు భూమిని ఆక్రమించుకొని గండి పూడ్చకుండా అడ్డుపడుతుంటారు. దీనిని పూడ్చడం కోసం జరిగే ప్రయత్నాలను రాజకీయ ప్రాబల్యంతో అడ్డుకుంటారు. లిల్లీ ఈ సమస్య మీద అధ్యయనం చేసింది. 'గ్రామీణ సమగ్రాభివృద్ధి' అనే వ్యాసం రాసి ప్రచురించింది. అందులో దళారీలను ప్రస్తావించింది. ఆ వ్యాసం ప్రభుత్వాన్ని కదిలించింది. యువ కలెక్టర్ రాజీ పడకుండా చెరువు గండి పూడ్చివేతకు సహకరించాడు. గిరిబాబు రాజధానికి పోయి చెరువు గండి పూడ్చివేతను ఆపడానికి వత్తిడి తెచ్చేలోపల రెవెన్యూశాఖ పనులన్నీ అయిపోయాయి. చెరువుకు విముక్తి కలిగింది. హరిబాబు రగిలిపోయాడు. లిల్లీని నాశనం చేస్తానని శపథం చేశాడు. ఈ సమయంలో తనకు సహకరించలేదని వీరయ్యను కొట్టాడు. మూగన్నను చంపడానికి యత్నించాడు. కలెక్టర్ దగ్గర దురుసుగా ప్రవర్తించాడు. ఈ సమయంలోనే వీళ్ళ నాన్న దేవళంపేట భూముల్ని నకిలి పత్రాలు సృష్టించి కబ్జాచెయ్యడం, గిరిబాబు సోదరులు అటవీభూముల్ని ఆక్రమించుకోవడం ప్రస్తావనకు వస్తాయి.

భాషా అనే యువకుడుంటాడు. అతన్ని హరిబాబు పెద్ద కొడుకు పట్నం పోయి లిల్లీ ఎక్కడుండేదీ తెలుసుకొని రమ్మనిపంపించి, అతని ఇంటికి వెళ్ళి అతని భార్యను నాశనం చేస్తాడు. ఈ అన్యాయాన్ని భాషా హరిబాబు దృష్టికి తీసుకుపోతే అతను భాషానే తన్నాడు. "గ్రామంలో న్యాయం నిద్దరపోయిందనీ" అనుకొని భాషా ఊరొదిలి వెళ్ళిపోయాడు.

ఒకరోజు గోపాలయ్య మేకల్ని మేతకు అడవికి తోలుకొని పోయాడు. అక్కడ ఒక చెట్టుకు హరిబాబు ఉరివేయబడి ఉండడం చూశాడు. అక్కడికి చేరిన జనం హరిబాబు లీలల్ని గుర్తు చేసుకున్నారు. హద్దులు మీరి అప్పులు చేశాడు. అన్నీ బినామీ అప్పులే. ఆయన దగ్గర అనేకంగా పాస్‌బుక్కులున్నాయి. అన్నింటి మీద అప్పులున్నాయి. అతన్ని అన్నలు హత్యచేసి ఉంటారని కూడా అనుకున్నారు కాని అతన్ని గిరిబాబు హత్య చేయించాడని తర్వాత బయడపడింది. ఆ సమయంలో ఇద్దరు వితంతువులు హరిబాబు దురాగతాలను గురించి మాట్లాడుకున్నారు.

"పిలిచేది పొలం పనికి, కడుపులో పాడుబుద్ధి"

"మన బతుకుల్లో నిప్పులు పోసి, వళ్ళు గుల్ల చేసే పీడ విరగడయింది". ఇలాంటి హరిబాబు మీద అన్న గిరిబాబు అనుమానపడేవాడు. అందుకే అడ్డు తొలగించుకున్నాడు. గిరిబాబుకీ తన రాజకీయరంగం మీద గౌరవం లేదు.

"సమాజంలో కాలుష్యానికి పుట్టినిల్లు రాజకీయం
మెట్టినిల్లు అక్రమవ్యాపారం"

ఇలాంటి వ్యవస్థలోని అమెరికాలో పుట్టి పెరిగిన అమ్మాయి లిల్లీ తన కుటుంబ మూలాలు వెతుక్కుంటా వచ్చి గ్రామ ప్రజల సమస్యల్ని పరిష్కరించే ప్రయత్నం చేసింది. పేద మహిళలకు కుట్టుమిషన్లు తీసిచ్చి, వాళ్ళు కుట్టిన బట్టలను అమెరికాకు పంపించి వాళ్ళు ఆర్థికంగా నిలదొక్కుకోడానికి సహాయం చేసింది. గ్రామ సమస్యల మీద వ్యాసాలు రాసి వ్యవసాయం మునిగిపోకుండా కాపాడింది. శివానంద వంటి మంచి మనిషి పక్కన ఉన్నా, బలహీనతకు లోనుగాకుండా నిగ్రహం పాటించింది. కుటుంబ సమస్యను ఎంతో జాగ్రత్తగా పరిష్కరించి జానకీబాల రఘురాంలను కలిపింది.

ఈ నవలలోని దుర్మార్గాలు చదివినప్పుడు భారతదేశం ఎప్పుడు నిజమైన ప్రజాస్వామిక దేశంగా మారుతుందా! అనిపిస్తుంది. "ఇప్పుడు పల్లె జీవితం సంపూర్ణం కాదు. మారిన ప్రపంచ ఆర్థికవిధానం పల్లెను తాకింది. పల్లె అప్పుల ఊబిలో వుంది. రైతాంగం ఆత్మహత్యలపర్వం కొనసాగుతూ ఉంది. ఆత్మహత్యలు ఎలా ఆగుతాయి? అప్పుల మాఫీ సమస్యకు శాశ్వత

## కవిత

# నాగుపాము

- వల్లభాపురం జనార్ధన
8179939547



అర్ధరాత్రి మోగుతుంది జీయెస్టీ గంట
కార్పొరేట్లకు పచ్చపంట
చిన్న వ్యాపారులకు తంట
దాన్ని ఆపకుంటే బతుకుమంట
జీయెస్టీ....జీయెస్టీ....జీయెస్టీ
వస్తుసేవల పన్నుచట్టం
వానపామని ముట్టుకుంటే నాగుపాము
ప్రజాస్వామ్య వేషంలో రజాకారు కవాతు
తల్వారుకాని తల్వార్‌తో
చిన్న ఉత్పత్తి వ్యాపారం తల ఖండిస్తుంది
కేంద్ర పభ్రుత్వం కుబేరుడు
వినియోగదారులు తిరుపతి క్షవరం
భక్తులు
అప్పు తీసుకోకున్నా శాశ్వతంగా
అప్పుఖాతాకు చెల్లింపుదారులు
మాఫీ యెప్పటికే టీ.వీ.సీరియలే
పన్ను మాఫీ ఉండదన్నది నిజం నిజం
అది వస్తుసేవలపన్ను కాదు
వస్తుక్షవరం పన్ను
జీయెస్టీ...జీయెస్టీ...జీయెస్‌టీ
ఆధిపత్య మార్వాడీ కొరడా
చిన్న సన్న, నడిమి తరగతి
చేనేత ఉత్పత్తి దారులు బలిమేకలు
స్వదేశీ, విదేశీ కార్పొరేటు వ్యాపార
పంజాలకు ఫలహారాలు
వడ్డింపుల వాతలు, నడ్డివిరిచే చేతలు
కేంద్రం సావుకారు
రాష్ట్రాలు బిచ్చగాళ్ళు, బొచ్చెల క్యూలే
రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్రం భూంపట్
ప్రగతి గోసాయి చిట్కాలు
ధరలు తగ్గడం ఒంటెపెదవి
పెరగడం పులిపంజా
నిరుద్యోగ నిర్మూలనం ఆకాశ
పంచాంగం
జీయెస్టీ శకుని నీతులు
పన్నుల సంస్కరణ వానపాములో
నాగుపాము
ఒకేదేశం ఒకేపన్ను
నల్లమందు తినిపించే జోలపాట
జీయెస్టీని ఆమోదిద్దాం, స్వాగతిద్దాం
మన బండలతోనే మన నెత్తులు
పగులగొట్టుకుందాం
సాహో జీయెస్టీ...జీయెస్టీ...

---

పరిష్కారం కాదు." అన్న రచయిత మాటలు పాఠకులను ఆలోచనలో పడవేస్తాయి.

'పల్లె క్షేమం సమాజం క్షేమం'

అనే శివానంద మాటలు మన పాలకులకు అర్థమవుతాయా?

"పల్లె పట్టులో పరిశ్రమలు రావాలి
అవి పంటల అభివృద్ధికి దోహదం కావాలి"

అన్న సూచన మన పాలకుల చెవికెక్కుతుందా?

''పల్లెమీద పలు విధాల ఆర్థిక దండయాత్రలు జరుగుతున్నాయి"అన్న విశ్వేశ్వర శాస్త్రి మాట నిజం కాదా?


'జీవకోన' నవల ఒక వ్యక్తి జీవితం కాదు ఒక వ్యవస్థ జీవిత ప్రతిఫలకం. భూస్వామ్య స్వభావం వదులుకోకుండానే ప్రజాస్వామ్యం ముసుగులో చలామణి అవుతున్న పెట్టుబడిదారీ వ్యవస్థకు ఈ నవల ప్రతిబింబం. ప్రపంచీకరణ రాకతో, మూలిగే నక్క మీద తాటిపండు పడినట్లు, నిరాదరణకు గురౌతున్న భారతీయ గ్రామం ఛిద్రమైపోవడం పట్ల ఆవేదన ఈ నవలలో కనిపిస్తుంది.

చట్టాలు చేసేవారెవరు?
వారిలో పల్లెల్లో పుట్టి పెరిగిన వారెంతమంది?
వారి బుద్ధులేమైనాయి?
వారికి పల్లె పరిస్థితులు తెలియవా?
తెలుసు!

పదవి దొరికితే పల్లెను మరచిపోతారు అన్న జానకీబాల దెప్పిపొడుపు ఈ నవల ఆగినచోట నుంచి పాఠకులను, పాలకులను వెంటాడుతుంది. నేలవిడిచి సాము చేస్తున్న భారతీయ రాజ్యవ్యవస్థపైన విమర్శ 'జీవకోన' నవల.

## విశ్లేషణ

# ఆర్. వసుంధరాదేవి కథలలో - స్త్రీ చిత్రణ




**- ఆర్. సుజిత**
**9177110048**

***వసుంధరాదేవి కథలన్నీంటిలోనూ ప్రధాన పాత్ర స్త్రీనే! ఒక ఆఫీసరు భార్య మానసిక ప్రపంచమెంత పరిమితమో, ఆ ప్రపంచమూ అంతే పరిమితమైంది. అయితే తనకు తెలిసిన ప్రపంచపు శకలంలోంచి అనంతమైన విశ్వ స్వరూపాన్ని దర్శించగలగడంలోనూ ఆమె ప్రతిభ పాఠకుల్ని విభ్రాంతుల్ని చేసింది. ఇంట్లో పని చేసే హసీనా, షాకిరాల్లాంటి మామూలు మనుషుల జీవితాల్లోంచీ రచయిత్రి పొందిన అసాధారణమైన, ఆ పాత్రల్ని మరపురాని పాత్రలుగా రూపొందించింది.***

ఒక్కొక్క రచయితది ఒక్కోశైలి. ఒక్కో జిల్లాకు ఒక్కో ప్రత్యేకత. రాయలసీమ ప్రాంతానికి చెందిన అనంతపురం, కడప, కర్నూల్, చిత్తూరు జిల్లాలకు చెందిన రచయిత్రులు తనదైన శైలిలో అనేక కథలను రాశారు.

చిత్తూరుకు చెందిన ఆర్. వసుంధరాదేవి కథ ప్రారంభంలోనే కథా వస్తువుకు బీజాంకురాలు కన్పిస్తాయి. కథనానికి దిక్సూచిగా కనిపిస్తుంది. కథా వస్తువులోని ఒక తాత్విక దృష్టి కోణమే కథనంలో చింతనాధారంగా అల్లుకుంటూ వస్తుంది. ఈ చింతనాధారం తాళం చెవుల గుత్తిలాంటిది. ఒక్కొక్క తాళం చెవితో ఒక్కొక్క తలుపు తెరుచుకున్నట్లుగా లోపలే అతని హృదయాన్ని వెలిగించే విద్య ఈ రచయిత్రికి బాగా తెలుసు. కథల్లో ఎక్కడికక్కడే అందాన్నిమెరిపించే చలం, లోతైన విశ్లేషణ చేసే కొడవటిగంటి కుటుంబరావు లాంటి రచయితలూ ఈ సందర్భంలో గుర్తుకువస్తారు.

ఈ ప్రపంచం ఒక అస్పష్టమైన వర్ణచిత్రం, అందులో మనం గుర్తించగలిగేది అంతకుముందే మనస్సులో ఎరుకగా ఉన్న దాన్ని మాత్రమే. తనలోని గుర్తునే బయటా గుర్తిస్తాము అంటారు రచయిత్రి వసుంధరాదేవి. ఈమె కథల్లోని పాత్రలు మనకు తెలిసిన ప్రపంచంలోని సాదాసీదా మనుషులే! ఒక మామూలు సన్నివేశంలోంచి అసాధారణమైన సత్యాన్ని ఆవిష్కరించే ఈమె కథలన్నింటినీ చదివినప్పుడు రచయిత్రికున్న "ఎరుక" ఎటువంటిదో అర్థం అవుతుంది. అలా అర్థం చేసుకునే క్రమంలో ఆ "ఎరుక" పాటకుడిలోనూ వెలుగుల్ని విరజిమ్మి అతడిలోని మాలిన్యాన్ని శుభ్రపరుస్తుంది. గొప్ప సాహిత్యం అంతకంటే చేయవలసింది మరేముంటుంది.

వసుంధరాదేవి కథలన్నీంటిలోనూ ప్రధాన పాత్ర స్త్రీనే! ఒక ఆఫీసరు భార్య మానసిక ప్రపంచమెంత పరిమితమో, ఆ ప్రపంచమూ అంతే పరిమితమైంది. అయితే తనకు తెలిసిన ప్రపంచపు శకలంలోంచి అనంతమైన విశ్వ స్వరూపాన్ని దర్శించగలగడంలోనూ ఆమె ప్రతిభ పాఠకుల్ని విభ్రాంతుల్ని చేసింది. ఇంట్లో పని చేసే హసీనా, షాకిరాల్లాంటి మామూలు మనుషుల జీవితాల్లోంచీ రచయిత్రి పొందిన అసాధారణమైన, ఆ పాత్రల్ని మరపురాని పాత్రలుగా రూపొందించింది. కథను రాస్తున్న వ్యక్తీ కథలోని ప్రధాన పాత్ర స్త్రీ కావడం చేత ఈ కథలన్నీ సహజ సిద్ధమైన స్త్రీ వాద కథలుగా కూడా తయారయ్యాయి.

ఆర్. వసుంధరాదేవి "చెరువు దగ్గర" కథలో సుశీల పాత్ర అత్యాచారానికి గురయిన స్త్రీని నాగరిక ప్రపంచం దోషిగా చూసి చివరకు సుశీల మరణానికి కారణం అవుతుంది. "చెరువు దగ్గర" కథలో సుశీల ఒక ఉత్తమ ఇల్లాలు. గడచిన జీవితం

ఎడారిలాగా, ముందున్నది స్మశానంలాగా తోస్తుంది ఆమెకు. ఎందుకు అలా జరిగింది? తను ఏదో సాధించాలి అనే తపన అలాగే మిగిలిపోతుంది. భర్తను, కుటుంబాన్ని ప్రేమించే వ్యక్తి. అత్యాచారానికి గురైన స్త్రీ సుశీల. తన ప్రమేయం లేకుండా తనపై అత్యాచారం జరిగిందని, తన భర్తకు తెలిసినా చివరకు బాధ పెడతాడు. అత్త, ఆడబిడ్డలు సుశీలను చూసి "ఆ ప్రాణం అప్పుడే పోయింటే బాగుండేది. ఏ పాపం చేసుకున్నావో" అని అంటుంటే ఆమె తల్లిదండ్రుల దగ్గర తనను ఓదార్చే మాటలు లేకపోయాయి.

**వసుంధరా దేవి కథలలో "చెరువు దగ్గర" కథ ఒక ఎత్తు కాగా, "హసీనా" కథ మరో ఎత్తు. తనలో ఉన్న మూడనమ్మకమే పిల్లలను బలిచేస్తుంది.**

ఈ కథలో సుశీల చేసిన నేరం ఏంటి? ఆమె చేసిన తప్పు ఏంటి? మానసికంగా బాధలు అనుభవించింది. కాబట్టి అటువంటి వారిని అర్థం చేసుకోవాలి. సమాజంలో ఇటువంటి అత్యాచారాలకు బలియైన వాళ్ళు ఎదుటివారి మాటలకు వారి ప్రవర్తనకు ఓర్చుకోలేక తనువు చాలిస్తున్నారు. అటువంటి వారి పట్ల మనం సహృదయంతో ఉండాలి. ఇవి వ్యక్తి ప్రమేయం లేకుండా జరుగుతున్నాయి. అది సమాజంలోని మానవ మృగాల తప్పు. అంతేకాని అత్యాచారానికి గురైన వారి తప్పు కాదు. సమాజం మారాలి. అత్యాచారానికి గురైన వ్యక్తులను అర్థం చేసుకోవాలి. వారికి తగినటువంటి సహాయం చేయాలి. జీవితం పట్ల ఆసక్తి కలిగించాలి. మంచి మాటలు చెప్పి మనవంతు సహాయం అందించాలి. అంతేకాని వారిని దోషిగా చూడటం, కించపరచడం, మానసికంగా బాధపెట్టడం లాంటివి చేయడం మంచిది కాదు. ఇది చాలా హేయమైంది. అమానుషమైంది. ఇది మన దేశంలో చాలా ఎక్కువగా ఉంది. అత్యాచారాలకు గురైన వారికి ప్రభుత్వం కూడా చేయూతనివ్వాలి. బ్రతుకు మీద ఆశను కలిగించాలి. వాటికి పాల్పడే వారి పట్ల ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

వసుంధరా దేవి కథలలో "చెరువు దగ్గర" కథ ఒక ఎత్తు కాగా, "హసీనా" కథ మరో ఎత్తు. తనలో ఉన్న మూడనమ్మకమే పిల్లలను బలిచేస్తుంది. యజమానురాలి మూడేళ్ల బాబుకు విరోచనాలు వస్తే హసీనా ఒక వెల్లుల్లి రెబ్బ తెచ్చి కాల్చి వీపుమీద వాత పెడితే తగ్గిపోతుంది అని సలహాలివ్వడం తనలోని మూఢనమ్మకాన్ని తెలియజేసింది. స్త్రీలు మూఢనమ్మకాలకు బలైపోతున్నారని రచయిత్రి ఈ కథ ద్వారా తెలియజేసింది.

వెల్లుల్లిరెబ్బ కాల్చి పెడితే విరోచనాలు తగ్గిపోతాయా! పోవు. ఇక అక్కడ మచ్చ ఏర్పడుతుంది. ఈ నూతన సమాజం వైద్యపరంగా ఎంతో అభివృద్ధిలోకి వచ్చింది. అయినా హసీనా లాంటి వాళ్ళు ఇంకా మూఢనమ్మకాల మత్తులో పడి ఆ మూఢనమ్మకాలను తమ పిల్లల మీద కూడా చూపిస్తున్నారు. అలవాట్లు, సంప్రదాయాలు మారుతున్నా కొంతమందిలో ఇవి మారడం లేదు. చిన్న పిల్లలని కూడా చూడకుండా దోషాలు ఉన్నాయంటూ నాలుకల మీద శూలంతో గుచ్చడం, కాల్చడం, కామెర్లకు చేతి మీద వాత పెట్టడం వంటి మూఢనమ్మకాలను వదిలిపెట్టడం లేదు. నాగరికత తెలియని వాళ్ళు ఈ మూఢనమ్మకాలకు అలవాటుపడుతుంటే... నాగరికత తెలిసిన వాళ్ళు బాగా చదువుకున్న వాళ్ళు కూడా మూఢనమ్మకాలను గుడ్డిగా నమ్ముతున్నారు. వీటిని విడిచిపెట్టి మనిషి విజ్ఞానశాస్త్రాన్ని చక్కగా ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలి. మనిషి అభివృద్ధి చెందితే సమాజం, సమాజం అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధిలోకి వస్తుంది. ఈ రోజుకు కూడా ఎంతో మంది ప్రజలు, పాలకులు కూడా మూఢనమ్మకాలకు చిక్కుకుపోతున్నారు. అందుకే మన భారత రాజ్యాంగాన్ని రాసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, రాజ్యాంగ రచయితలు భారత రాజ్యాంగంలో శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని సూచించారు.

"హసీనా" కథలో ఆమె తన ఎనిమిదేళ్ళ కొడుకుని ఒక హోటల్‌లో పనికి పంపుతుంది. ఆ పిల్లాడు తల్లిని విడిచి ఉండలేక తల్లి దగ్గరే పడుకొనే అలవాటు ఉండడం చేత హోటల్ నుండి తల్లి దగ్గరకు వచ్చేస్తాడు. ఈ సందర్భంలో తల్లి మీద కొడుకుకు ఉన్న ప్రేమను తెలియజేస్తుంది. కాని సినిమాలకు, షికార్లకు అలవాటు పడిన హసీనా పసి పిల్లాడు అని చూడకుండా పనిలో పెట్టడం తప్పు. పనిలో పెట్టింది కాకుండా తన యజమానురాలితో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో పేరు ఎక్కినంత గొప్పగా చెప్పుకుందే తప్పు.. తను తప్పు చేస్తున్నాను అని తన మనసుకు అనిపించలేదు.

వసుంధరాదేవి మరో కథ "షికారా". షికారా ఇంటి పని మనిషి. భర్త, తల్లీ, తమ్ముడూ, అందరి చేత ఏదో ఒక విధంగా

## సరికొత్తగా సాహిత్య ప్రస్థానం

సాహిత్య ప్రస్థానం 15వ వార్షికోత్సవ సందర్భంగా సరికొత్త శీర్షికలతో మరింత ఆకర్షణీయంగా, ఆలోచనలు పెంచేవిధంగా సాహిత్య ప్రస్థానాన్ని వెలువరించబోతున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం.

* 2018 జనవరి నెల సంచిక నుండి మార్పులతో కూడిన సాహిత్య ప్రస్థానం సంచిక వెలువడుతుంది.
* మంచి రచనలకు, కొత్త ఆలోచనలు రేకెత్తించే సృజనకు ఎప్పటిలాగే సాహిత్య ప్రస్థానం వేదికగా ఉంటుంది.
* సాహిత్య ప్రస్థానం పత్రిక ధర కూడా ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని పెంచక తప్పట్లేదు. 15 ఏళ్లుగా ఒకే విధంగా రు.10గా వున్న పత్రిక ధరను 2018 జనవరి నుంచి రు.20 కి పెంచడం జరుగుతుంది.
* సాహిత్య ప్రస్థానం పేజీలు 64కు పెంచి, ఆ పేజీలను మరింత విశ్లేషణ కోసమే గాక మూడు మాసాల కొక ప్రత్యేక అధ్యయనం కోసం వినియోగించడం జరుగుతుంది..
* చందాదారుల చందాలను కూడా పెరిగిన ధరకు అనుగుణంగా సర్దుబాటు చేయటం జరుగుతుంది.
* చందాదారులు ఈ మార్పులను గమనించి సహృదయంతో ఎప్పటిలాగానే ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నాం.
* పత్రికలో మార్పులు, చేర్పులకు సంబంధించి పాఠకుల నుండి సూచనలు కోరుతున్నాం. – ఎడిటర్

## సాహితీస్రవంతి రాష్ట్ర కమిటీ సమావేశాలు

విజయవాడలో ఆగస్టు 26, 27 తేదీలలో సాహితీస్రవంతి రాష్ట్ర కమిటీ సమావేశాలు జరిగాయి. సాహితీస్రవంతి కార్యక్రమాలను సమీక్ష చేసుకుని, భవిష్యత్ కర్తవ్యాలను ఈ సమావేశంలో రూపొందించుకోవడం జరిగింది. తొలిరోజు సమావేశం ఇటీవల కన్నుమూసిన డా. సి.నారాయణరెడ్డి, డా.వి. చంద్రశేఖర రావులకు నివాళి అర్పించింది. ఈ సందర్భంగా సాహిత్య అంశాలతో కూడిన ఉపన్యాస శిక్షణపై కార్యశాల జరిగింది. వర్తమాన సమాజపు సాహిత్య అవసరాలను తీర్చడానికి సాహితీ స్రవంతి, సాహిత్య ప్రస్థానం నిబద్ధతతో కృషి చేయాలని ఈ రెండు రోజుల సమావేశంలో సంకల్పం తీసుకోవడం జరిగింది. అదే విధంగా సుదీర్ఘ కాలంగా నిరాటంకంగా సాహితీస్రవంతి ఆధ్వర్యంలో వెలువరిస్తున్న సాహిత్య ప్రస్థానం మాసపత్రికలో తగిన మార్పులు తీసుకురావాలని నిర్ణయించడం జరిగింది.

దగా పడి మనుషుల పట్ల విశ్వాసం కోల్పోయి ఎటో వెళ్ళిపోయింది. “ఎక్కడ బిచ్చగాళ్ళ గుంపు కనిపించినా షికారా కోసం చూస్తాను” అప్రయత్నంగా అనే కథకురాలి మాటలు గుండెను పిండేస్తుంది. యజమానురాలు షికారాను ఎందుకు ప్రేమించలేకపోయింది? అనే విచికిత్సకు లోనవుతుంది. యజమాని సేవకుల మధ్య మానవ సంబంధాలలో ప్రేమ మొద్దుబారి పోయింది. ఈ భౌతిక కారణాన్ని అడుగడుగునా చూపింది. కథ ముగింపుకు వచ్చేసరికి మరో మూల కారణాన్ని కథలో ప్రవేశపెట్టింది. అదే ప్రేమకు జన్మస్థానం ఎక్కడుంది?


సామాజిక స్థాయిలో భేదాలు భౌతికంగా అంతరించే వరకు మనిషి ప్రేమించడానికి అశక్తుడా..? ప్రేమకు జన్మస్థానం మనిషిలో ఉందా? లేక నేటి సమాజంలో ఉందా? ఈ కారణాల్తో ముడిపడిన లోకంలో మనిషి ప్రేమలూ, ఆపేక్షలూ కూడా కారణాలకు లోబడే ఉంటాయి. ఆ కారణాలు సామాజిక స్థాయి బేధాలకు సంబంధించినవి అయినప్పుడు వాటిలో ముడిపడిన ప్రేమలో కూడా అదే భేధమూ, అదే పరిమితి చోటుచేసుకోవడం సహజం.

బాధ్యతనంతా సమాజం మీదికి తోసేసి సమాజమే అట్లా ఉంటే ఇంక నేనేం చేస్తాను? అని తప్పించుకోవడంలోని వ్యక్తి చైతన్య తిరస్కరణ, రచయిత్రికి ఇష్టం లేదు. ముందుగా సమాజాన్ని మార్చాలి అనే సుదూర స్వప్నాలతో తన ప్రేమ లేమికి ముసుగు తగిలించుకోదు. దేని మీద సాకులు చెప్పకుండా తన మనస్సులోనే ప్రేమ కారణం లేకుండా ఉదయించడానికి గల అవకాశాన్ని మాత్రమే రచయిత్రి షికారా కథలో ప్రస్తావించారు. సమాజంలో మానవ సంబంధాలు అడుగంటి పోతున్నాయి అని రచయిత్రి ఈ కథ ద్వారా తెలియజేశారు. వాటిని కాపాడుకోవాలనే బాధ్యత మన అందరి మీద ఉంది.

## కవిత

# భాషకి దూరంగా

హిందీ మూలం: **నరేశ్ సక్సేనా**
తెలుగు : **డా. వెన్నా వల్లభరావు**
**9490337978**



చెట్టు చేమలకు మాటలు వచ్చి ఉంటే
అవి పళ్ళకి బదులు
బహుశా తియతియ్యని
మాటల్నే మనకు ఇచ్చేవేమో !

మేఘాలకు కూడా భాష వచ్చి ఉంటే
వర్షానికి బదులు
దీర్ఘ కవితల్నే వినిపించి ఉండేవేమో !
ఒక్క నీటి చుక్కైనా వర్షించేవి కావేమో !

పుష్పాలు సౌందర్యంపై
ఒక మంచి వ్యాసాన్నిచ్చేవేమో!
పరిమళం, పుష్ప పరాగం
ఒక్క రేణువైనా ఇచ్చుండేవి కావేమో !
భూమికి మాటలొచ్చి ఉంటే
అది కూడా
బహుశా పైరు పంటల కథ వల్లించి ఉండేదేమో !
ఆకలితో అలమటిస్తున్న మనిషి చైతన్యంలో
మాటలు కాక

అన్నం మెతుకులు ఉంటాయేమో !
అన్నం రుచి ఉంటుందేమో !
అన్నపు సువాసన ఉంటుందేమో !

కొన్ని రోజులపాటు మనం
పూర్వ యుగాలకు వెళ్ళిపోతే ఎంత బాగుంటుంది–
మనిషికి భాష తెలియని రోజుల్లోకి
ప్రతివిషయాన్ని పలికి కాక
సైగ చేసి చూపించిన రోజుల్లోకి !

---

# పాఠం నేర్పే గురువు

- చలపాక ప్రకాష్
9247475975

ఏదో రాయమని
కలం గోలపెడుతోంది!
వెంట అంటిపెట్టుకున్న కష్టాల సుడిగుండాన్ని
అద్దంలో చూసుకునే సరికి–
కలంలో ఆరిపోయిన సిరాలాగా
గుండెలో తడి ఆరిపోతోంది!!



ఏమీ తోచని ఒంటరితనం
సత్తువులేని కాళీని మిగిల్చి
ఉచితంగా కట్టిపడేస్తోంది!!!


ఏదో చెప్పాలనే బాధ–
పైకి నవ్వుల ముఖాన్ని
కప్పుకు తిరుగుతోంది

నాటకం అంటే తెరపైనే కాదు–
తెరముందూ వేయక తప్పదని
కాలగడియ ఋజువు చేస్తోంది

అందుకే–
కనిపించేవన్నీ పాలు కాదు–
కనిపించేవన్నీ నీళ్ళూ కాదు–
క'న్నీళ్ళ' కడలిలో చెలరేగే తుఫానులో
చీకటి వెలుగుల జీవితపార్శ్వాన్ని
ముందుతరాలకి పాఠాలుగా నేర్పే గురువుగా
కాలం నిలిపుంచుతోంది!

## నచ్చిన రచన

# పితృస్వామ్యం అడుగుజాడల్లో




- మందరపు హైమవతి
9441062732

వచన కవితా పితామహుడు కుందుర్తి వచన కవితా ప్రక్రియలోనే కథ, నవల, నాటకం, ఆత్మకథ రాయమని అన్నారు. ఈ ప్రక్రియల్లో కృషి చేసిన వారెవరూ లేరు. శీలా వీర్రాజు గారు మాత్రం తన ఆత్మకథను వచన కవితలోనే రాసి కుందుర్తి కోరిక నెరవేర్చారు. మిగిలిన ప్రక్రియల మాటెలావున్నా దీర్ఘకవితా కావ్యాలు రాసి తెలుగు కవిత్వాన్ని సుసంపన్నం చేసిన కవులకు మాత్రం కొరతలేదు తెలుగు సాహిత్యంలో. మొద్దునిద్ర పోతున్న సమాజాన్ని, సాహిత్యాన్ని ఓ కుదుపుకుదిపింది కొయ్య గుఱ్ఱం. ఆ తర్వాత నుండి అనేక దీర్ఘ కవితా సంపుటాలు వస్తూనే ఉన్నాయి నేటివరకూ అవిరామంగా.

నాన్న మీద వివిధ కవులు రాసిన కవితా సంపుటాలు ఎన్నో వచ్చాయి. ఇవన్నీ కూడ పురుషులు రాసినవే. ఇప్పుడు నాన్న కావాలి అని ఎస్. సుమిత్రాదేవిగారు ఒక దీర్ఘకవితా కావ్యాన్ని తెచ్చారు.

మనది పితృస్వామ్య వ్యవస్థ సమాజం అణుయుగంలో అడుగుపెట్టినా, ఇంటర్నెట్ కాలంలో జీవిస్తున్నా ఒకప్పటి సంప్రదాయ భావనలు, భావజాలాలు మాత్రం వదలలేదు. స్త్రీలు పురుషులు సమానం 'ఆకాశంలో హృదయం వుంది సగం' అన్నారు. స్త్రీకి కూడ ఒక హృదయం వుంది దానికి వ్యాయామం కావాలి' అని చలం అన్నాడు. స్త్రీలకు చదువెందుకన్న కాలంలో స్త్రీల చదువుకోసం కందుకూరి తదితరులు ఉద్యమించారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పోరాడారు. ఇన్ని పోరాటాల తర్వాత ఇంటి పంజరాలనుండి స్త్రీలు బయటకు వచ్చి అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ప్రతిసంవత్సరం మహిళాదినోత్సవాలు జరుపుకొంటున్నారు. ఐనా ఇప్పటికీ కుటుంబానికి యజమాని పురుషుడే. ఎంతో కాలం పోరాట ఫలితంగా పిల్లలు స్కూల్లో చేరేటప్పుడు అప్లికేషన్‌లో తండ్రి పేరుతో పాటు తల్లి పేరుకూడా రాస్తున్నారు. సమానత్వం దిశగా ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తున్నారు. ఐనా ఈ పుస్తకంలో నాన్నకే అధిక ప్రాధాన్యమిచ్చారు కవయిత్రి. ఈ దీర్ఘకవితలో నాన్న గొప్పదనాన్ని చిత్రీకరిస్తూ అనేక విధాలుగా వర్ణించారు. బాల్యం నుంచి చివరిదశ వరకు నాన్న జీవన విధానాన్ని వ్యాఖ్యానించారు. 'శిశువు శబ్ద తరంగం/ నాన్న గుండెలో/ ఆనందపరవశం' పసిపాపాయి ఏడుపు, పెరిగాక చెప్పే మాటలు నాన్నకు ఆనందం కలిగిస్తాయని అంటారు.

కొంచెం ఊహ తెలిసాక పిల్లలు బయటనుంచి ఇంటికి నాన్న వచ్చే సమయం తెలిసికొని నాన్నరాగానే పరుగెత్తుకుంటూ వెళతారు. భుజంమీద వాలిపోతారు. 'నాన్న శబ్దం విని, ఎదురేగి / పరుగెత్తే పసిపాదాలు/ భుజకీర్తిగా వాలిన చిట్టిపావురం' అని చిన్న పిల్లల చేష్టలను కళ్ళకు కట్టినట్లుగా వర్ణిస్తారు కవయిత్రి పాపాయిలకు నాన్నంటే ఎందుకిష్టమో చెప్తారు. "చిన్నప్పుడు/ ఆర్నెల్లకోసారి/ సనాతనంగా / భయపెట్టిన/ అమ్మ చేతిలోని / ఆముదం/ నాన్నయితే/ ఆధునికంగా/ చిటికెడు విరేచనాల

మాత్రతో ప్రత్యక్షం/ చింతపండుచారు/ వేడినీళ్ళపద్యం/ నాన్నను చూసి పరార్/ అందుకే/ నాన్నంటే ఇష్టం అంటారు.

చిన్న మాత్ర వేస్తాడని నాన్నంటే ఇష్టపడతారట పిల్లలు. 'బిడ్డలు ఆడుకొనే చెట్టుపుట్ట/ నాన్న కనుసన్నల్లోని/ అభయారణ్యం' నాన్న మంచితనపు తాయెత్తు మహిమ పరిమళించేబాల్యం "/ నాన్న/ వాత్సల్యపు అపురూప జ్ఞాపకం' అని నాన్నని మంచితనం గల తాయెత్తు మహిమగా అభివర్ణిస్తారు.

రైతు నాన్నలు, జాలరి నాన్నలు, రిక్షా నాన్నలు, డ్రైవర్ కండక్టర్లు, పోస్టుమాన్లు మొ॥ విభిన్న వృత్తి పనులు చేస్తున్న తండ్రులు తమ పిల్లల కోసం ఎంత తపించి పోతారో అన్ని కాలాల్లో అనురాగ రుతువులై పిల్లల నెలా అభిమానిస్తారో అనేక అక్షర చిత్రాల్లో ఆవిష్కరించారు ఈ పుస్తకం నిండా. ' దురదృష్టాలు వెంటాడి/ వేధిస్తున్నపుడు/ దృఢమైన ప్రాకారంలా/ అనంతమైన ఆకాశంలా/ లోతైన సముద్రంలా/ అనుభవాలుపండిన తరువులా/ కనిపించే / రెండక్షరాల 'నా' ఆనే మనిషి/ నాన్న' అంటూ కుటుంబ ప్రతిష్ట బీటలు వారకుండా/ పునః స్వరూపిస్తాడు." అని నాన్న మీద తన ఎనలేని అభిమానాన్ని ప్రకటిస్తారు.

ఒకప్పుడు పిల్లల్ని లాలించిన తండ్రి ఇప్పుడు పెద్ద వాడయ్యాడు. అతణ్ణి అర్థం చేసికొమ్మని "నువ్వు తండ్రివయ్యాక నీ తండ్రి పసిబాలుడే! అతని చేష్టలు / నీ బిడ్డల చేష్టలు ఒక్కటే/ పిల్లల్ని అతనితో ఆడుకోనివ్వు అంటూ "నీ హృదయంలోనే కాదు/ నీ యింట్లోనూ చోటివ్వు/ వృద్ధాశ్రమంలో కాదు." అని బిడ్డకు హిత బోధచేస్తారు.

ఈ దీర్ఘ కవితను ముగిస్తూ "పంచ భక్ష్యాల్ని ప్రసాదించినా/ భూగోళం అన్ని బొమ్మల్ని/ బహుకరించినా/ అవేవీ/ వద్దుగాక వద్దు/ పుడమి తల్లి పచ్చని చిరునవ్వులాంటి/ నాన్న కావాలి/ నాన్నే కావాలి/ అంటూ నాన్నపై తనకు గల ప్రగాఢాభిమానాన్ని వెల్లడిస్తారు.

ఒకచోట కవయిత్రి పిల్లలకేరింతలతో/ శుభప్రదమైన ఆనందనందనం/ కుటుంబం/ ఆ / కుటుంబానికి/ మకుటం నాన్న" అంటారు.

ఇక్కడ మొదటి వాక్యాలు బాగున్నాయి. పిల్లల నవ్వులతో కుటుంబమెప్పుడూ ఆనందాలు పంచిపెట్టె నవనందనవనమే కానీ కుటుంబానికి మకుటం నాన్న అనడంలో మనసులో అనేక సందేహాలు. కుటుంబానికి యజమాని పురుషుడు" అని అంటుంది పితృస్వామ్య సమాజం. ఇక్కడ కవయిత్రి కూడ ఆ మాట వాడకుండా అదే అర్థం వచ్చే మకుటం అని వాడారు. మకుటం అంటే కిరీటం రాజ్యానికి ఎప్పుడూ ఒకటే కిరీటం వుంటుంది. రెండు వుండవుగదా/ మరికుటుంబంలో స్త్రీ పాత్రేమిటి.

అదీగాక చివరిలో "నాన్న కావాలి/ అని ఊరుకోకుండా" నాన్నే కావాలి" అనడంతో చదివే పాఠకుల మనసుల్లో "అమ్మ అక్కర్లేదా?'' అని ఒక వ్యతిరేక భావన రావడానికి అవకాశమిచ్చారు.

మరోచోట "అమ్మనుదుటి కుంకుమ/ ముత్తైదు గాజుల గలగల/ మద్దెల చిరుసవ్వడులు/ చిట్టి చేతులు ఆడుకొనే శక్తి/ నాన్న" అంటారు. అమ్మ ముఖంపై పెట్టుకొనే బొట్టులో వేసుకొనే గాజుల్లో, మెట్టెల్లో, మంగళసూత్రాల్లో నాన్న కనిపిస్తాడని వ్యాఖ్యానిస్తారు కవయిత్రి.

పెళ్ళిలో వచ్చేవి మంగళసూత్రాలు, మట్టెలే కానీ బొట్టు, గాజులు పుట్టిన దగ్గరనుంచే పెట్టుకొంటున్నారుగదా మహిళలు. ఈ మట్టెలు, మంగళ సూత్రాలు గుర్తులు కూడ కొన్ని ప్రయోజనాలను ఆశించి మహిళల జీవితాల్లోకి వచ్చాయి. ఆధునిక మహిళలు చాలామంది వీటిని పాటించడంలేదు.

ఈ పుస్తకం చదువుతున్నప్పుడు నాన్న గురించి ఆడపిల్లలు మగపిల్లల అభిప్రాయాలు వెల్లడిస్తారని అనుకొంటారు పాఠకులు.

ఒకప్పుడు నాన్నంటే భయపడేవాళ్ళు. ఇప్పుడు నాన్నంటే భయంలేని తరం వచ్చింది.

ఏది ఏమైనా తాను అనుకొన్న వస్తువుకు దీర్ఘ కవితా రూపమివ్వడంలో సఫలీకృతులయ్యారు కవయిత్రి సుమిత్రాదేవిగారు. నాన్న తన పిల్లల్ని ఎంత అపురూపంగా అభిమానంతో చూసుకొంటారో చక్కని అక్షర చిత్రాల్లో ఆవిష్కరించారు. సరళమైన శైలిలో పుస్తకం ఆద్యంతం ఒకేసారి చదివిస్తుంది.

కథ

# మారాలి లోకం

- వనజ తాతినేని
9985981666



**యా**సిడ్ సీసా, పెద్ద బ్రష్, చంకలో చీపురుకట్టతో పొద్దున్నే ప్రత్యక్షమయ్యాడు అప్పారావు.

"మూడొందలు ఇవ్వాల్సిందేనా, ఓ వంద రూపాయలు తగ్గించుకో" మా అత్తగారి బేరం.

"తప్పమ్మా అట్టా బేరాలాడకూడదు, చేసేది రోత పని. అడిగినంత ఇచ్చేస్తే రెండోసారి పిలిచినప్పుడు కాదనకుండా మర్యాదగా వస్తాను" మెత్తగా చెప్పినా ఖచ్చితంగా చెప్పాడు.

"ఎవరైనా అంతే తీసుకుంటున్నారు, అతన్ని రానివ్వండి" అన్నాను అత్త గారితో. "నువ్వు తెచ్చిన యాసిడ్ ఘాటైన వాసనొస్తుంది. అదొద్దు ఇది వాడుకో" అంటూ నేను తెచ్చిపెట్టిన యాసిడ్ బాటిల్ ఇచ్చాను. మధ్య మధ్యలో ఎలా శుభ్రం చేస్తున్నాడోనని చూసా. నేలమీద కూర్చుని కొద్ది కొద్దిగా యాసిడ్ చల్లుకుని బ్రష్ తో రుద్దుతూ మురికి పట్టిన టైల్స్ ని పాల రంగులోకి మార్చడానికి శరీరాన్ని అరగ దీసుకుంటున్నాడు. అప్పారావు వయసు యాభై ఏళ్ళు కూడా ఉండట్టు లేవు. నిత్యం రసాయనాల వాసన పీలుస్తూ ఉండటం వల్లనేమో చూపులకి అరవై ఏళ్ళు దాటిన వాడిలా కనబడతాడు. జాలేసింది, "కాసిని టీ తాగుతావా" అడిగాను.

"వద్దమ్మా! తాగితే పని చేయలేను".

రెండు గంటల్లో మూడు బాత్‌రూమ్‌లు శుభ్రం చేసేటప్పటికి ఇల్లంతా యాసిడ్ వాసన. పాపం ! ఎలా తట్టుకుంటున్నాడో అనుకుంటూనే వండిన పదార్థాలతో లంచ్ బాక్స్ సర్దుకుని స్కూల్ కెళ్ళడానికి రెడీ అయిపోయాను. నోటికి ముక్కుకి కలిపి కట్టుకున్న గుడ్డని విప్పుకుంటూ "శుభ్రంగా మెరిసిపోతున్నాయండి చూసుకోండి" అన్నాడు. ఐదొందల నోటు ఇస్తే "పొద్దు పొద్దునే నా దగ్గర చిల్లరెక్కడ ఉంటుందమ్మా ? మీరే చిల్లరీయండి" అన్నాడు.

"ఉంటే ఇవ్వడానికేం, సరే ఒకపని చేయి. నా వెనుకనే చోడవరం రా. అక్కడ స్కూల్ లో రెండు బాత్రూమ్స్ కడగాలి" అన్నాను.

''అంత దూరం నేను రానమ్మా, వేరే ఎవరినైనా పిలుచుకోండి'' అంటూ జేబులోనుండి రొండొందలు తీసిచ్చాడు.

"పని చేయడానికి ఎక్కడైతే ఏమైంది, పని కావాలి కానీ" అంది మా అత్తగారు.

''అదేమన్నా ప్రభుత్వ ఉద్యోగమా ? ఎక్కడైనా చేయడానికి" అంటూనే టిఫిన్ నోట్లో కుక్కుకుని బేగ్ తగిలించుకుని బండి కీస్ తీసుకుని లిఫ్ట్ దగ్గరికి వచ్చేసరికి కరంట్ పోయింది. అసలే ఆలస్యం అవుతుందనుకుంటే ఇదొకటని విసుక్కుంటూ గబగబా మెట్లు దిగుతూ సరిత టీచర్ కి లిఫ్ట్ ఇస్తానని చెప్పాను. సెంటర్ లో వెయిట్ చేస్తూ



ఉంటుందీపాటికే అనుకున్నాను.

అసలే పరీక్షల రోజులు దగ్గరలో ఉన్నాయి, నిమిషం ఆలస్యమైనా హెడ్ మాస్టర్ మాటల బెత్తం ఝుళిపించి అవమానపు వాతలు పెడతాడు. మీకు ఫేస్బుక్‌లో సోది చెప్పుకోవడానికి వాట్సాప్ గ్రూప్ లలో చీరలు, డిజైనర్ బ్లౌజ్ పిక్స్ షేర్ చేసుకోవడానికి టైమ్ ఉంటుంది కానీ కాస్త ముందుగా బయలుదేరి సమయానికి బడిలో ఉండాలనుకోరని నిన్ననే క్లాస్ తీసుకున్నాడు. పాపం సరిత బిక్కచచ్చిపోయింది. అలా స్కూల్ విషయాలు గురించి ఆలోచిస్తూ ఎప్పుడు బండి స్టార్ట్ చేసిందో . రెండు కిలోమీటర్లు ఎలా నడిపిందో క్రాస్ రోడ్డుకి వచ్చి సరిత టీచర్ ముందు బండి ఆపేవరకు బాహ్యప్రపంచంలో జీవించిన స్పృహే లేదు.

"ఈ రోజు టాయ్లెట్ క్లీన్ చేసే వంతు మనదే కదా ! ఎవరైనా దొరికారా మేడమ్" అడిగింది.

"లేదు సరితా, ఈ రోజు ఉదయాన్నే మా ఇంట్లో టాయ్లెట్స్ శుభ్రం చేయడానికి ఒకతను వచ్చాడు. అతన్నే రమ్మని అడిగాను, కానీ రావడం కుదరదన్నాడు. మనకి తప్పేటట్లు లేదు అన్నాను" చిరాకుగా.

"ఈ స్కూల్‌లోనూ తగినంత బోధనా సిబ్బంది, అటెండర్, స్వీపర్ కొరత ఎప్పుడూ ఉండేదే ! పదిహేను గదులున్న పాఠశాల శుభ్రం చేయడానికి ప్రభుత్వం ఇచ్చే డబ్బులు రెండున్నరవేలు. మెయింటెనెన్స్ నిధుల నుంచి కొంత, ఆర్ఎంఎస్ఏ నిధులలో నుంచి మరికొంత తీసి ఇచ్చినా ఆ జీతానికి గదులని వరండాలని శుభ్రం చేసి కుండల్లో మంచి నీళ్ళు పెట్టి వెళతాను అంతకన్నా ఎక్కువ పనిచేయను ఇష్టమైతే చేయించుకోండి లేకపోతే లేదు అని తెగేసి చెపుతుంది కాంతమ్మ. అందుకే ఎప్పటినుండో వంతులేసుకుని మరుగు దొడ్లు శుభ్రం చేసుకుంటున్నాం, మీరు ఈ స్కూల్ కి కొత్తగా వచ్చారు కాబట్టి మీకవన్నీ తెలియవు" అంది,

"మన టాయిలెట్స్ సంగతి అలా ఉంచండి, ఇవాళ పిల్లల టాయిలెట్ శుభ్రం చేసుకునే వరుసలో సిక్త్ క్లాస్ స్టూడెంట్ కృష్ణ ఉన్నాడనుకుంటా కదా ? మిగతా పిల్లల తల్లిదండ్రులతో పెద్దగా ఇబ్బందేమీ లేదు వచ్చిన గొడవల్లా ఆ కృష్ణ వాళ్ళమ్మ ఆ నరసమ్మ తోటే ! పోయినసారి కూడా పెద్ద గొడవ చేసింది. కావాలంటే మా పిల్లడు ఇంటికొచ్చి వెళతాడు దొడ్లు కడగడానికి వీల్లేదని గట్టి గట్టిగా అరుస్తుంటే మరుగుదొడ్లు వాళ్ళ చేతనే శుభ్రం చేయిస్తున్న సంగతి బయటకి తెలిసి పోయి ఏ మీడియా వాళ్ళో చిత్రీకరించి జనంలో ఏకి పెట్టేస్తారన్న భయమేస్తుంది" అన్నాను .

"పరిసరాల పరిశుభ్రత మన జీవితాల్లో ఒకభాగం అని పిల్లలకి అర్థమయ్యేటట్లు చెప్పి వంతులవారీగా శుభ్రం చేసుకోవడమే! ఎవరూ దొరకకపోతే మనింట్లో మనవే శుభ్రం చేసుకోవడంలేదా అలాగే ఇది" అంది సరిత

వినడానికి బాగానే ఉన్నా నాలో ఏదో అయిష్టత. "సరితా! నాకెదురైన అనుభవాలు మీకు ఉన్నాయో లేదో ! పోస్టింగ్ వచ్చిన కొత్తల్లో బాగా వెనుకబడిన కుగ్రామం. అప్పటికి ఆ వూరిలో ఉన్న టాయ్లెట్స్ ని వ్రేళ్ళ మీద లెక్కించవచ్చు. స్కూల్ లో ఒక్క మరుగు దొడ్డి లేదు. నాకొలీగ్స్ ముగ్గురు పురుషులే కాబట్టి వారు ఎక్కడో ఒకచోట మరుగు చూసుకుని పని కానిచ్చేసే వారు. నేను వెళ్ళాక సమస్యని సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్ళాను. ఆయన ఏదో తాత్కాలికంగా గుంజలు నాటి పరదాలు కట్టి దొడ్డి ఏర్పాటు చేసారు. ఆ వూరికి నీటి సౌకర్యం కూడా అంతంత మాత్రమే! అందరికి అన్నింటికీ చెరువు నీళ్ళే. తాగాడానికంటే ఇంటిదగ్గర నుండి నీళ్ళు పట్టికెళ్ళేదాన్ని కానీ బాత్ రూమ్కి వెళ్ళినప్పుడు ఆ చెరువు నీళ్ళే వాడటం వల్ల ఇన్ఫెక్షన్ వచ్చింది ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. అప్పటి నుండి ఇంటిదగ్గర బయలుదేరే ముందు వెళ్ళడం ఇంటికి వచ్చాకనే పొట్ట బరువు తీర్చుకోవడం. ఎక్కడ పనిచేసినా మరుగుదొడ్ల కోసం పోరాటం. తీరా ఆ పోరాటం ఫలించి అవి నిర్మించే టప్పటికి బదిలీ అయ్యేది. ఎక్కడైనా విద్యార్థులకే కాదు స్టాఫ్ క్కూడా మరుగుదొడ్ల సమస్యే" అన్నాను విసుగ్గా.

"తరగతి పుస్తకాల్లో గాంధీ గారు మరుగు దొడ్లు శుభ్రం చేసేవారు, కుష్టు వ్యాధి గ్రస్తులకి సేవ చేసేవారు అని చెపుతుంటే వినడం బాగుంటుంది కానీ ఆ పనులు స్వయంగా చేయాలంటే ఎంత అసహ్యించుకుంటామో ఇప్పుడు తెలుస్తుంది కదా! నా అనుభంలోనూ ఒక వాస్తవ జీవిత కథ ఉంది చెపుతాను వినండి" అంది.

పాఠాన్నే కాదు ప్రతి విషయాన్ని కథలా చెప్పే ఆమెకి రాసే ఉత్సాహం కూడా ఉంది, నాకున్న చదిలే అలవాటు మా ఇద్దరికీ నెయ్యానికి పునాది అయింది. సరిత అనుభవాన్ని

వినడానికి ఆసక్తిగా చెవి వొగ్గాను.



“నా క్లాస్మేట్ పద్మ వాళ్ళమ్మ పారిశుధ్య కార్మికురాలు వీధులు, మరుగుదొడ్లు శుభ్రం చేసే పని చేసేది. వాళ్ళ నాన్న సైకిల్ షాపు పెట్టుకుని రిపేర్లు చేస్తూ, సైకిళ్ళు అద్దెకిచ్చుకుంటూ ఉండేవాడు. అతని చేతి క్రిందే నలుగురు కుర్రాళ్ళు పనిచేస్తూ ఉంటే పద్మ వాళ్ళమ్మ ఎందుకు అలా వీధులు ఊడ్వడం అనుకునేదాన్ని. పద్మ వాళ్ళమ్మ చక్కటి సిల్క్ చీరెలు కట్టేది, మేచింగ్ బ్లౌస్ వేసుకుని తలలో ఫ్రెష్ గా ఉండే పూలు పెట్టుకుని మంచి చెప్పులు ధరించి మూతికి అడ్డుగుడ్డ కట్టుకుని వీధుల్ని మరుగుదొడ్లుని శుభ్రం చేస్తూ ఉండేది . పద్మ నా ఫ్రెండ్ కాబట్టి అప్పుడప్పుడు వాళ్ళింటికి వెళుతుండేదాన్ని. వాళ్ళది బెంగుళూరు పెంకుటిల్లు ఇంటా బయటా అంతా నాపబండలు వేసి శుభ్రంగా ఉండేది . నిజం చెప్పొద్దూ మాకు ఎకరాలు, బండ్లూ, నగలూ నాణాలు ఉండాయన్నమాటే కానీ వాళ్ళిల్లు ఉన్నంత శుభ్రంగా, షోకుగా మా ఇల్లు ఉండేది కాదు. మా అమ్మ పాతిక రూపాయల కృష్ణలంక కల్పన కాటన్ చీరలు. కట్టటం తప్ప మంచి సిల్క్ చీరలు కట్టడం చూడలేదు, పెళ్ళికో పేరంటానికో వెళ్ళేటప్పుడు పట్టు చీర. నేనెప్పుడు పద్మ వాళ్ళింటికి వెళ్ళినా నాన్వెజ్ తో భోజనం వడ్డించేది ఆమె, వాళ్ళింట్లో భోజనం చేసినట్లు మా అమ్మకి తెలిసి విరగకొట్టింది నన్ను. క్లాస్‌లో చాలామంది కన్నా పద్మ మంచి బట్టలు వేసుకునేది. స్కిన్‌కి అంట కుండా గోళ్ళ రంగు వేసుకునేది, బాగా చదివేది కూడా ! చాలామంది ఆమెని కులం కారణంగా దూరంగా ఉంచి తమ ఈర్ష్యని ఇంకోవిధంగా చూపించేవారు. నేను మా కులాన్ని వృత్తిని వారి కులాన్ని వృత్తిని వేరు వేరుగానో గొప్పగానో హీనంగానో భావించలేదు అలా అనుకోవాలని నాకప్పటికి తెలియదు కూడా ! ఆలోచనలు వికసించే కొద్దీ వారి వ ృత్తి ఎందుకు హీనమైందో అర్థమైంది. ఇప్పటికీ పద్మ వాళ్ళమ్మ ఆ పని చేస్తూనే ఉంటుంది. ఒక కొడుకు సైకిల్ షాప్ బదులు మెకానిక్ షాప్ నడుపుతుంటే మిగతా పిల్లలు మంచి ఉద్యోగాలు చేసున్నారు. వాళ్ళమ్మని ఆ పని చేయడం మానేయమని వత్తిడి చేస్తారు. పని చేయడంలో తప్పేముంది మన పనే అది కదా అంటుందట. నిష్కామకర్మగా చేసే పనిలో ఆనందం వెదుక్కుంటుంది. మా ఐదుగురు పిల్లలని ఆ వృత్తి చేయమని అనలేదు, వద్దని అనలేదు. మా ఇష్టాలకే వదిలేసింది అని తన తల్లి గురించి పద్మ గర్వంగా చెపుతుంది “అంటూ వాస్తవ కథని ముగించింది,

“ఏ వృత్తికావృత్తి గొప్పవే కావచ్చు కానీ సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయడం, మరుగుదొడ్లు కడగడం, డ్రైనేజీలు శుభ్రం చేసే పని మాత్రం కర్మచారి సఫాయిలకే పరిమితం అయిపోయింది? వాళ్ళకి ఆ పని ఇష్టం లేకపోయినా బ్రతకడానికి ఇంకో పని దొరక్క అయిష్టంగానే ఆ పని చేసేవాళ్ళున్నారు. వాళ్ళ పిల్లలు చదువుకుని అవకాశాలని ఉపయోగించుకుని వేర్వేరు ఉద్యోగాలలో సెటిల్ అవుతున్నారు కదా,పద్మ వాళ్ళ కుటుంబం అలాగే కదా ఆ వ ృత్తిలో నుండి బయటపడింది, మిగతా వారిలోనూ కాలక్రమేణా మార్పు వస్తుందిలే”అన్నాను. అంతలోకి స్కూల్ వచ్చింది. మాటలు, బండి రెండూ ఆపాము.

నరసమ్మ మధ్యాహ్నం భోజనం డబ్బా తెచ్చి కొడుక్కిచ్చి రోజూలా వెళ్ళిపోకుండా స్టాఫ్ రూమ్ దగ్గరకి వచ్చింది నాతో మాట్లాడాలని. అందరూ భోజనాలు తిని క్లాస్స్ లకి వెళ్లిపోయాదాకా ఆగి తర్వాత “టీచరమ్మా ! నా కొడుకుని దొడ్లు కడిగే పని చేయమన్నారంట, పిల్లాడ్ని చదువుకోడానికి పంపిచ్చాము కానీ దొడ్లు కడగడానికి పంపిచ్చామా ఏమిటీ ?” అంది తీవ్రంగా.

“ఎవరి కంచం వాళ్ళు కడుక్కున్నట్టు ఎవరి బట్టలు వాళ్ళు ఉతుక్కున్నట్టు ఎవరి మరుగుదొడ్లు వాళ్ళు కడుక్కోవడంలో తప్పేం ఉంది? మా టీచర్లు మాత్రం ఎవరి వంతు వాళ్ళు వచ్చినప్పుడు కడగడం లేదూ” అని సరిత టీచర్ క్లాస్ కి వెళ్ళిపోయింది .

అందంతా చూస్తున్న కాంతమ్మ నోటిమీద వేలుంచుకుని ఆశ్చర్యంగా చూసి చూసి “అదేంటే నరసమ్మా ! అంత మిడిసిపాటు ఎందుకే నీకు? మీ ఆయన సిటీలోకి వెళ్లి దొడ్లు కడిగే పనేగా చేసేది” అంది

“నువ్వూరుకో కాంతమ్మా! మీ ఆయన కల్లు గీత గీస్తే నీ కొడుకు కల్లు అమ్ముకుంటున్నాడా ? మెకానిక్ పని చేయట్లా ? ఆ కుండలు చేసే ఆయన కొడుకు కుండలు చేస్తున్నాడా ? నా కొడుకుని ఎందుకమ్మా దొడ్లు కడగాలని చెపుతారు ? నా కొడుకు ఆ పని చేయడు గాక చేయడు కావాలంటే నూట యాభై కాకపోతే రెండొందలు ఇస్తాను ఎవరితోనైనా కడిగిచ్చుకోండి అంటూ కొంగు ముడి విప్పి డబ్బు తీసి టేబుల్



పై పెట్టి కులవృత్తి అంట, కులం అంటా ? దాని పీక మీద కాలేసి నొక్కి పడెయ్యాలి , నా కొడుకు బాగా చదువుకుని కలక్టర్ అవ్వాలి, ఏ నా కొడుకన్నా అప్పుడూ కులం గురించి వృత్తిని గురించి మాట్లాడాలి చెపుతా ఆళ్ల పని, గంగానమ్మకి దున్నపోతుని బలి ఇచ్చినట్టు నరుకుతా ఒక్కొక్కళ్ళని" అనేసి విసురుగా వెళ్ళిపోయింది.

స్టాఫ్ రూమ్ అంతా నిర్ఘాంతపోయింది. ఎవరికీ నోరు పెగల్లేదు. తేరుకున్నాక కాంతమ్మని "కృష్ణ వాళ్ళ నాన్న పేరేమిటి" అడిగాను "అప్పారావు అండీ, కృష్ణ కి ఓ అన్న ఉండేవాడు. వన్ టౌన్ లో మురుగుకాల్వలోకి పనిచేయడానికి దిగి చచ్చిపోయాడు. అప్పటి నుండి నరసమ్మ అలా తయారయింది"

అయ్యో పాపం ! అంటూ అందరిలో కాసేపక్కడ విచారం కమ్ముకుంది

నాకొకటి అర్థమైంది పిల్లల చేత గ్రౌండ్ శుభ్రం చేయించినంత సులభం కాదు మరుగుదొడ్లు శుభ్రం చేయించడం అంటే అని. టేబుల్ పై నరసమ్మ పెట్టెళ్లిన డబ్బునే చూస్తూ ఆలోచించసాగాను. అయినా ఈ నరసమ్మకి అర్థం కావడంలేదా? కృష్ణ ఒక్కడి చేత దొడ్లు శుభ్రం చేయించడం లేదు రోజుకి కొంత మంది పిల్లలు ఆ పని పంచుకుంటున్నారని. ఒకవేళ విషయం అర్థమైనా అర్థంకానట్టు ఉంటుందేమో! కిటికీలో నుండి తెల్లటి కిరణం చీల్చుకునివచ్చి కళ్ళలో పడి గుచ్చుకుంటుంది. కళ్ళు నలుపుకున్నట్టు మనసుని ఆలోచనని నలుపుకుంటే కొంచెం కొంచెంగా నరసమ్మ అర్థమవుతుంది. తరతరాలుగా వాళ్ళని అంటిపెట్టుకున్న వృత్తి పట్ల విముఖత, అసహ్యం, ఒక కొడుకుని పోగొట్టుకోవడం, సమాజం చూసే చిన్న చూపు అన్నీ కలిసి ఆమె మనసులో బలమైన ముద్ర వేసాయని పించింది. ఆమె అన్నట్టు ఎవరి కులవృత్తులు వాళ్ళు చేస్తున్నారా? ఆ కాలం ఎప్పుడో పోయింది. తన తండ్రి వ్యవసాయం చేసేవారు. తను ఉపాధ్యాయ వృత్తి, కొడుకు సాఫ్ట్వేర్. అయినా ఈ మధ్య సరదాగా కుండలు చేయడం నేర్చుకుంటానని పట్టుబట్టి ఆ కోర్స్‌లో చేరాడు. ఇప్పుడు సారె పెట్టి కుండలు చేయడంలేదు. హెయిర్ సెలూన్ నడుపుకునే ప్రకాష్ వాళ్ళ అన్నయ్య మెడలో జంధ్యమేసుకుని హైదరాబాద్ లో అమ్మవారి గుడిలో పూజారిగా చెలామణి అయిపోవడంలేదూ లాంటి విషయాల గురించి ఆలోచిస్తూ ఒక పిరియడ్ గడిపేసా.

క్లాస్ నుండి వచ్చిన సరితకి విషయం చెప్పి నా ఆలోచనలు పంచుకున్నా. "చేసే పనిని బట్టి మనిషికి గౌరవం ఇవ్వడం కాదు, ప్రతి ఒక్కరికి పనిపట్ల గౌరవం ఉండాలి. దురదృష్టం ఏమిటంటే పనిని రోతగా చూస్తూ ఆ పని చేస్తున్న మనిషిని అవమానపరుస్తుండటం ఎందుకో ?ఇది మారాలి "అన్నాను

సరిత ముఖం ఎర్రబడుతుండగా,ఆలోచనల్లో ఆవేశం కదం త్రొక్కుతుండగా "సమాజంలో కులవృక్షం ఊడలు దిగి ఉంది ఆ వృక్షాన్ని వృత్తుల పేరిట ఇంకా పెంచి పోషించకూడదు. తరాలనుండి జిడ్డులా అంటుకున్న వృత్తులని విసర్జించి ఎవరికిష్టమైన పని వాళ్ళు చేసుకోవాలి, ఎవరి అవసరాలకి తగ్గట్టు వాళ్ళే పని చేసుకునేటట్లు తర్ఫీదు పొందాలి. కుల వృక్షాలని నేలకూల్చాలంటే ఇదే మార్గం. ఉపాధి కోసమే పని కాకుండా అభిరుచి ప్రకారం పని, తృప్తి కోసం పని చేయడం జరగాలి కానీ ఎవరిని ఈ పని నువ్వే చేయాలని బలవంత పెట్టకూడదు. ఆఖరికి కృష్ణని కూడా వంతులు వారీగా మరుగు దొడ్లు శుభ్రం చేసుకునే క్రమంలో కూడా బలవంతపెట్టకూడదు మేడమ్" అంది.


నా మనసుకి పట్టిన మురికి వదిలినట్లయింది. కొద్దిసేపు సరితని విస్మయంగా చూసినా మరుక్షణమే హృదయానికి హత్తుకుని మనస్ఫూర్తిగా అభినందించాను. తర్వాత పిరియడ్ లో ఎవరి క్లాస్స్ పిల్లలకి వాళ్ళు పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొనేటట్లు చేయాలని ఆ విధంగా సందేశాలని ఇవ్వాలని నిర్ణయించుకున్నాం.

లాంగ్ బెల్ మ్రోగగానే "పదండి ముందుకు, సెలబ్రిటీ లు పట్టుకున్నట్టు కాకుండా చిత్తశుద్ధితో చీపురు, చేట, బకెట్ పట్టుకుందాం మనం కూడా !" అని లేచి నిలబడ్డాను. స్టాఫ్ రూమ్ నుండి కొంత మంది ఉత్సాహంతోనూ, కొంతమంది అయిష్టంగానూ గ్రౌండ్ వైపు, మరుగుదొడ్లు వైపు కదిలారు. అప్పటికే పుస్తకాల సంచీ భుజాన తగిలించుకుని గేటు దాటుతూ కనిపించాడు కృష్ణ .

## విశ్లేషణ

# విలక్షణ ఆత్మకథ 'నేనో కూలోణ్ణి'

హిందీమూలం: **లీలా బాందివడేకర్**
తెలుగు: **ఘట్టమరాజు**
**09964082076**



*చెప్పుకోదగ్గ మంది మహిళలు మరాఠీలో స్వీయచరిత్రలు రాసుకొన్నారు. వాళ్ల రచనల్లో కాలంకొద్దీ వచ్చిన చాలా మార్పులు చోటు చేసుకొన్నాయి. రెవరెండ్ నారాయణ వామనతిలక్, భార్య లక్ష్మీబాయి **1934-38** ల మధ్య 'స్మృతిచిత్రే' (జ్ఞాపక చిత్రాలు) శీర్షికతో ఆత్మకథ రాసుకొన్నారు. ఇది ఇప్పటికీ ఓ శ్రేష్ఠమైన స్వీయచరిత్రగా ప్రసిద్ధి. లక్ష్మీబాయి తన ఆత్మకథ నిజాయితీగా సమకాలీన సంఘధోరణుల్ని, మతవిశ్వాసాల్నీ శక్తిమంతంగా చిత్రించింది. ఆమె స్వీయచరిత్రలో లోతైన హేతువాద దృష్టితోపాటు, అసాధారణమైన వ్యంగ్యం కూడా కనిపిస్తుంది.*

మరాఠీ సాహిత్యంలో స్వీయ చరిత్ర రచనావ్యాసంగం చాలా కాలం నుంచి సాగుతూవుంది. 1882కు ముందే నానాఘడ్నవీసు, వాసుదేవ బలవంత ఫడ్కే, విష్ణుబువా బ్రహ్మచారి మొదలైన మహనీయులు తమ జీవితానుభవాల గురించి ఆరాకొరా రచనలు చేశారు. కాని అవి నేటి స్వీయచరిత్రల్లా సంపూర్ణమైనవి కావు. మరాఠీలో తొలిసారిగా స్వీయచరిత్ర రాసుకొన్న గౌరవం శ్రీమతి రమాబాయి రానడేకు దక్కుతుంది. ఈమె ప్రసిద్ధ సంఘసేవాపరాయణులైన న్యాయమూర్తి మహాదేవ గోవింద రానడే సతీమణి. రమాబాయి రానడే 1910లో 'అమ్చా ఆయుష్యాతీల్ కాహీ అర్‌వణీ (నా జీవితంలోని కొన్ని సంఘటనలు) అన్న ఆత్మకథ రాసుకొన్నారు. దాన్లో ఆమె తన భర్తను పదే పదే గౌరవ పురస్కారంగా స్మరించుకొంది. దీని తర్వాత 1960 దాకా మరాఠీలో ఎన్నో స్వీయచరిత్రలు వెలువడ్డాయి. వాస్తవిక సంఘటనలు, గతస్మృతులు, విన్నపాలు, భార్యాభర్తల మధ్య అభిప్రాయ భేదాలు, ఫిర్యాదులు, సొంత అనుభవాల ద్వారా వ్యక్తమైన సాంఘిక చరిత్ర, పరనీయత, సూక్ష్మత, ప్రబోధాత్మకత వగైరా ఈ స్వీయచరిత్రల విశిష్టగుణాలు.

చెప్పుకోదగ్గ మంది మహిళలు మరాఠీలో స్వీయచరిత్రలు రాసుకొన్నారు. వాళ్ల రచనల్లో కాలంకొద్దీ వచ్చిన చాలా మార్పులు చోటు చేసుకొన్నాయి. రెవరెండ్ నారాయణ వామనతిలక్, భార్య లక్ష్మీబాయి 1934-38 ల మధ్య 'స్మృతిచిత్రే' (జ్ఞాపక చిత్రాలు) శీర్షికతో ఆత్మకథ రాసుకొన్నారు. ఇది ఇప్పటికీ ఓ శ్రేష్ఠమైన స్వీయచరిత్రగా ప్రసిద్ధి. లక్ష్మీబాయి తన ఆత్మకథ నిజాయితీగా సమకాలీన సంఘధోరణుల్ని, మతవిశ్వాసాల్నీ శక్తిమంతంగా చిత్రించింది. ఆమె స్వీయచరిత్రలో లోతైన హేతువాద దృష్టితోపాటు, అసాధారణమైన వ్యంగ్యం కూడా కనిపిస్తుంది. 1960 నుంచి వివిధ రంగాలకు, వర్గాలకు చెందిన మహిళలు విభిన్నరీతుల్లో ఆత్మకథలు వెలువరించారు. తమ కుటుంబ సభ్యులతో, సంఘంతో పోరాడిన వైనం రాను రాను ఎక్కువ కావడం మరాఠీ రచయిత్రుల స్వీయచరిత్రల్లో మనం చూడొచ్చు. ప్రఖ్యాత సంఘసేవకుల, పాత్రికేయుల, రచయితల భార్యలు కూడా స్వీయచరిత్రలు రాస్తున్నారు. భావస్వాతంత్ర్యంతో పరిపుష్టమైన ఈ ఆత్మకథలు ప్రజాదరణ కూడా పొందుతున్నాయి. కొన్ని

సందర్భాల్లో వివాదాస్పదం కావడం కూడా కద్దు. మరాఠీ మహిళలు ఆత్మకథలు పాఠకుల్లో దయ, జాలి, ఆలోచనలు కలిగించేలా రూపొందడం ప్రశంసార్హం. ఈ స్వీయచరిత్రలో రచయిత్రులు మగవాళ్ల పట్ల (ముఖ్యంగా, మొగుళ్ళ పట్ల) ఆక్రోశం, తిరుగుబాటు ప్రకటించారు. కాని దళితుల, పీడితుల ఆత్మకథల్లో వ్యక్తమయ్యే తీవ్రత, కనపడదు. మరాఠీ రచయిత్రులు సంపూర్ణ భావస్వాతంత్ర్యంతో ఇంత ఎక్కువ సంఖ్యలో ఆత్మకథలు రాయటానికి కారణం మహారాష్ట్రలో జరుగుతున్న సంఘసంస్కరణోద్యమాలు, స్త్రీ విద్యాభివృద్ధి అని చెప్పొచ్చు. పంతొమ్మిదవ శతాబ్దపు ఉత్తరార్ధంలో సాగిన మహారాష్ట్ర సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమంలో హేతువాదం విజృంభించింది. విశాల దృక్పథాలు వెల్లివిరిశాయి. హిందూసంఘం లోని వివిధ క్షేత్రాల్లోని లోపదోషాల సమీక్ష జరిగింది. వర్ణ, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా హేతుబద్ధ చర్చలు జరిగాయి. స్త్రీ విద్య, స్త్రీ వ్యక్తిత్వ వికాసం గురించి తీవ్రమైన చర్చలు సాగాయి. మతాంతీకరణ గురించి వేడివాడి వాదోపవాదాలు జరిగాయి. భారతీయ జీవన దృక్పథం, విలువలు, మంచి చెడ్డలు వివేచించబడ్డాయి. పాశ్చాత్య జీవిత విలువల గురించి జిజ్ఞాసాత్మకమైన మధనం జరిగింది. వీటి ఫలితంగా ప్రసిద్ధ మరాఠీ రచయిత హరినారాయణ ఆప్టే 'పణో లక్షాత్ కోణ్ ఘే తో' (ఎవరు నా గురించి నాగరికంగా ఆలోచిస్తారు?) స్త్రీల గురించి ఆలోచనలు రేకెత్తించే నవల రాశారు. స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వంలాంటి ప్రాథమిక పౌరహక్కులు చాటే, నవయుగాన్ని ఊహిస్తూ కేశవసుత ఉద్వేగ భరితమైన కవితలు రాశారు. జాంబేకర్, లోక్‌హితవాది. అగర్‌కర్, తిలక్, చిప్‌లూతోణ్ మొదలైన మేధావులు, చింతనాశీలురు శక్తిమంతమైన గద్యరచనలు వెలయించారు. మహర్షి ధోండో కేశవకర్వే లాంటి మహానుభావుడు స్త్రీలకు ఉన్నతవిద్య నేర్పించేందుకుగాను ఓ ప్రత్యేక విశ్వవిద్యాలయాన్నే స్థాపించారు. అంతకుమునుపే మహాత్మజ్యోతిభాపులే నిమ్నజాతివర్గాల ప్రజలకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు పాఠశాలలు స్థాపించి, చెప్పుకోదగ్గ కృషి చేసే వున్నారు. మహిళల వ్యక్తిత్వ వికాసానికై ఎన్నో ఉద్యమాలు బయలుదేరాయి. వీటన్నిటి ఫలితంగా స్త్రీల్లో తాము పైకి రావాలన్న ఆకాంక్ష పుట్టుకొచ్చింది. వాళ్లు మేల్కొన్నారు. తమ మూగబాధల్ని ప్రపంచానికి తెలియచేయాలన్న కోరిక ఆ మహిళల హృదంతరాళాల్లోంచి పెల్లుబికి వచ్చింది.

**మరాఠీ రచయిత్రులు సంపూర్ణ భావస్వాతంత్ర్యంతో ఇంత ఎక్కువ సంఖ్యలో ఆత్మకథలు రాయటానికి కారణం మహారాష్ట్రలో జరుగుతున్న సంఘసంస్కరణోద్యమాలు, స్త్రీ విద్యాభివృద్ధి అని చెప్పొచ్చు.**

వేర్వేరు రంగాల్లో, వర్గాల్లో, వృత్తుల్లో పనిచేస్తున్న మగవాళ్లు ఆత్మకథలు రాసుకొచ్చారు. వీటిలో రచయితల ఆలోచనలు, సంఘం పట్ల వాళ్ల దృక్పథాలు, వాళ్ల వివిధానుభవం పరిజ్ఞానం, ఆయా క్షేత్రాల్లో ఉప్పతిల్లే సమస్యలు వ్యక్తమయ్యాయి.

1960 ప్రాంతంలో దళిత రచయితలు, రచయిత్రులు స్వీయచరిత్రలు రాయడం ప్రారంభించారు. కాలక్రమంలో ఇవి ఓ విశిష్ట సాహితీప్రక్రియగా రూపొందాయి. దళిత సూర్యుడు బాబాసాహెబ్ అంబేద్కర్ దళిత సాహిత్యానికి వెన్నుదన్నుగా నిలబడ్డారంటే అతిశయోక్తి కాదు. దళిత, వెనుకబడ్డ వర్గాల రచయితల ఆత్మకథల్లో వ్యవస్థపట్ల తిరుగుబాటు ధోరణి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఎన్నో ఏళ్లుగా సాగుతున్న అన్యాయాన్నీ, పీడనను, అత్యాచారాన్ని, నిర్లక్ష్యాన్ని ఎదుర్కొవడమే ఈ దళిత ఆత్మకథల మూలవస్తువని చెప్పుకోవచ్చు. ఈ దళిత స్వీయ చరిత్రల్లో ఓ వైపు అభిజాత్య సంఘం పట్ల పెచ్రేగుతున్న క్రోధాన్ని, పోరాటానికై ఆరాటం వ్యక్తమవుతుంటే, మరోవైపు తమ చీకటి జీవితాల్లో వెలుగు నింపుకోనేందుకై ఉద్యమం చేపట్టాలన్న దృఢనిశ్చయం, స్పష్టంగా కనపడింది. మొదట్లో దళిత రచయితల స్వీయచరిత్రలు చాలా తాజాగా, వాడిగా వేడిగా వుంటూ అపూర్వమైన జీవనానుభవాన్ని చిత్రించేవి. కాని తర్వాతి ఆత్మకథల్లో ఆ వాడీ, ఆ వేడీ కనపళ్లేదు. కారణం వేరేగా చెప్పనక్కర్లేదు. పీడకుల పట్ల, పీడితులు సాధారణంగా అన్ని చోట్లా ఒకేలా ప్రవర్తిస్తారు. వ్యక్తులు వేరే కావొచ్చు కాని, వాళ్ల జీవితాలు, అనుభవాలు దాదాపు ఒకేలా వుంటాయి. అందువల్లేనేమో దళిత, పీడిత వర్గాల రచయితల ఆత్మకథలన్నీ ఒకే మూసలో పోసినట్లగుపడుతాయి. సృజనశీలత, ఆలోచనాపరత లేకపోవడం వల్ల ఈ దళిత, పీడిత రచయితల ఆత్మకథలు తమ ప్రత్యేకతను కోల్పోయాయి. దయాపవార్ 'బలూత' లక్ష్మణమానె 'ఉపరా', లక్ష్మణగాయక్వాడ్ 'ఉచల్యా' నామ్‌దేవ్ తుసాలో 'రాఘవ వేళ్' మొదలైన దళిత, పీడిత రచయితలు తమ ఆత్మకథలకుగాను ఎన్నో బహుమతులు పొందారు. ఆధునిక మరాఠీ సాహిత్య చరిత్రలో వాళ్లకు ప్రముఖస్థానం లభించింది కూడా.

1992లో వెలువడ్డ అప్పా కర్‌పే ఆత్మకథ 'మీతో హమాల్' నేనో కూలోణ్ణి చదివి నేనెంతో ఆశ్చర్యపోయ్యాను. ఇందాకా నేను చదివిన ఆత్మకథలన్నీ ఓ ప్రత్యేక జాతికీ, తెగకూ లేదా వర్గానికీ చెందిన వ్యక్తుల చుట్టూ తిరిగే రచనలు. కాని అప్పాకోర్ పే ఆత్మకథ 'నేనో కూలోణ్ణి' మాత్రం విలక్షణంగా తోచింది. పైన పేర్కొన్న నిర్దిష్టమైన హద్దుల్ని దాటి, భారతదేశానికే పరిమితం కాక, ప్రపంచవ్యాప్తమైన కూలీల ఆత్మకథలా అనిపించింది నాకు. అప్పా కోరపే ఓనమాలు కూడా రాని ఓ కూలీ పడరాని పాట్లు పడి, నిజాయితీవల్లా, కూలిజనుల ప్రేమాదరాల వల్ల నేడు 'మహారాష్ట్ర రాజ్య మాథాడీ మహామండలి' ఉపాధ్యక్ష పదవి అలంకరించి వున్నారు. ఆయన ఆత్మకథ రాయాలని ఎందుకు అనుకొన్నారు? ఆయన తన ఆత్మకథ 'నేనో కూలోణ్ణి' 'తొలిపలుకు'లో ఇలా రాశారు; "కూలీ ఎక్కడైనా సరే కూలీనే, వ్యాపారులు అతన్ని ఓ ఎద్దులా చూస్తారు. అతని వద్ద చెప్పుకోతగ్గ విషయాలు ఏముంటాయని? ఓ కూలోడి అనుభవాలూ అనుభవాలేనా? కూలీల నుంచి మనం తెలుసుకోదగ్గ విషయాలు ఏమైనా వుంటాయంటారా? హవ్వ ! ఎవరైనా వింటే నవ్విపోతారు కాని ! ఐనా సరే, నేను నా అనుభవాల్ని మీకు వినిపించాలనుకొంటున్నాను. నా వెతల కతలు మీకు వినిపించి, నా గుండె బరువు దించుకోవాలనుకొంటున్నాను. ఓ వేళ నా అనుభవాల వల్ల ఎవరికైనా జీవితయాత్రలో ముందుకు సాగేందుకు కాసింత ప్రేరణ లభించిందనుకోండి, వాళ్లకు ఎంతో కొంత మేలు చేకూరింది అనుకోండి – అలాంటప్పుడు నా కథ చెప్పి తీరాల్సిందే అని నా కనిపించింది." ప్రసిద్ధ మహారాష్ట్ర సంఘసేవకుడు డా.బాబా ఆఢావ్ వల్ల అప్పా కోరపేకు స్వీయచరిత్ర రాయాలన్న స్ఫూర్తి లభించింది. కోరపే కూలీల సభల్లో, సమావేశాల్లో తన అనుభవాలు వినిపిస్తుంటే వాళ్లకు అవన్నీ తమ అనుభవాల్లాగే తోచాయి. అప్పా కోరపే ఆత్మకథ 'నేనో కూలోణ్ణి' లో ఎంతో ఆత్మీయత వుంది. తీవ్రమైన బాధ వుంది చెప్పరాని పేగూ సార్థకం వుంది. బాధలగాథల్ని గుండెలకు హత్తుకొనేలా చెప్పే నైపుణ్యం వుంది. అప్పా తన కష్టసుఖాల్ని అక్షరరూపంలో పెట్టాలన్న కోరిక కలిగింది. డా॥ బాబా ఆఢావ్‌కు కాని అప్పా కోరపేకు పొట్టపొడిస్తే అక్షరం ముక్కరాదే! రాయడం అసలే తెలీదే! మరి, ఆయన అనుభవాలు

***అప్పాకోర్ పే ఆత్మకథ 'నేనో కూలోణ్ణి' మాత్రం విలక్షణంగా తోచింది. పైన పేర్కొన్న నిర్దిష్టమైన హద్దుల్ని దాటి, భారతదేశానికే పరిమితం కాక, ప్రపంచవ్యాప్తమైన కూలీల ఆత్మకథలా అనిపించింది నాకు.***

పుస్తకరూపంలో వెలువడేదెలా? మరి ఆ వ్యాసభగవానుని భవాల్ని రాసే వినాయకుడు ఎక్కడున్నాడు? అహమ్మద్ నగర్ నివాసి ప్రఖ్యాత మరాఠీ విద్వాంసులు డా. గంగాధర మోర్జే అప్పా కోరపే అనుభవాల్ని ముఖతః విని నివ్వెరపోయ్యాడు. ఆయన నూరు ఆరైనా సరే కోరపే అనుభవాలు పుస్తక రూపంలో వెలువడి తీరాల్సిందే అని నిశ్చయించుకొన్నాడు. ఆయన కోరికపై అప్పా కోరపే తన గోడు వినిపించడం మొదలెట్టాడు. శ్రీమతి అశ్విని కావళే టేప్ చేసి, తర్వాత రాసిపెట్టింది. మరాఠీలో వెలువడ్డ ఇతర ఆత్మకథల్లో లేని ఎన్నో సుగుణాలు అప్పా కోరపే ఆత్మకథలో వుండటం ఓ విశేషం.

యజమానులు కూలీలతో నడుచుకొనే విధానం, కూలీల దయనీయ ఆర్థిక పరిస్థితులు, వ్యసనాల కారణంగా వాళ్ల బతుకులు కుక్కలు చింపిన విస్తరి కావడం, ఇలా కూలీనాలీ జనుల బాధతప్త కథలు మరాఠీలో తొలిసారిగా అప్పా కోరపే ఆత్మకథ ద్వారా వ్యక్తమయ్యాయి. పీడిత తాడిత ప్రజల ఆత్మకథల్లో కనపడే ఆక్రోశం, ఆవేశం, ప్రతీకారవాంఛ, విధ్వంసాత్మక ధోరణులు – 'నేనో కూలోణ్ణి' లో ఎక్కడా కనపడదు. అంటే పీడకుల్ని వ్యతిరేకించే ధోరణి అప్పా కోరపేకు లేదని కాదు. ఆయన దోపిడీనీ, దుర్మార్గాన్నీ తీవ్రంగా ఎదురిస్తాడు. అయితే అహింసామార్గం ద్వారా మాత్రమే ఆయన నానాకష్టాలు పడి కూలీలను ఒక తాటి మీదికి తెచ్చి, కార్మికసంఘం స్థాపిస్తాడు. ఉద్యమాలు ప్రారంభిస్తాడు. అప్పా కోరపే ఎంతో కాలం తర్వాత ఎన్నో కష్టనష్టాలు అనుభవించిన పిదప, కాస్త వెసులుబాటు కలిగి ఓ మోస్తరు జీవితం గడప గలిగాడు. ఆయన జీవితంలో సుఖశాంతులు, నెలకొన్నా, ఆయన మనస్సులో అశాంతి, అలజడి వుండనే వుండింది. కూలీనాలీ జనం మేల్కొనాలనీ, వాళ్ల బతుకులు పండాలనీ, వాళ్ల పిల్లలు చదువూ సంధ్యలు నేర్చి సంఘంలో తలెత్తుకు బతకాలన్నదే ఆయన ఆశయం అప్పా మహారాష్ట్రలోని వూరూరూ తిరుగుతూ వుపన్యాసాలు ఇచ్చేవాడు.

అప్పా కోరపే డా. బాబా ఆఢావ్ ప్రేరణ వల్లా ఇతరుల సాయంతో అహమ్మద్‌నగర్‌లో కూలీల భవనాన్ని నిర్మించాడు. కూలీలకు చౌకగా రొట్టెలు, కూరా లభించేలా కేంద్రాల్ని ఏర్పాటు చేశాడు. భర్తలు వొదిలేసిన భార్యల బాగోగులు చూసుకొనేందుకు సంఘాలు స్థాపించాడు.

## కవిత

# వాళ్ళెప్పుడో చచ్చారురా ... !!!?

- జి.తిరుపతిరావు
9440302484

ఒరేయ్ ! ఒరేయ్ !!
వాళ్ళేమ్ పాపం చేశారురా ??
వాళ్ళూ మనుషులేరా !!
వాళ్ళను వదిలేయండిరా
వాళ్ళెప్పుడో చచ్చారురా!!
మూతికి మూకుడు, ముడ్డికి చీపురు
కట్టిననాడే వాళ్ళు చచ్చార్రా !!
పొలిండ్లను ఎత్తిపట్టి
కప్పం కట్టమన్ననాడే
వాళ్ళు చచ్చారు !!
నిర్దయగా నిండుచూలాలి
గుండెలమీద తన్నిననాడే
వాళ్ళు చచ్చారు !!
మానాన్ని వేలం వేసి
నడి వీధిన నిలబెట్టిన నాడె
వాళ్ళు చచ్చార్రా !!!
ఇంక చంపకండిరా

దంపతుల్ని
నడివీధిలో నగ్నంగా మండుటెండలో
ఒకరి భారం ఒకరితొ మోయిస్తూ...
నడుస్తున్న శవాల్ని....
కుళ్ళ బొడిచి
మళ్ళ బొడిచి, మళ్ళ బొడిచి
పొడిచి పొడిచి చంపకండిరా
ఎందుకంటె....
వాళ్ళెప్పుడో చచ్చారురా..
వాళ్ళెప్పుడో చచ్చారు!!!



నేనురా.....
మనుషుల్లో మిగిలిన మానవత్వాన్నిరా ...
చేతులెత్తి మొక్కుతున్నా
మీ అరాచక అటవిక చర్యలతో
ఇంకా చంపకండిరా....

వాళ్ళెప్పుడో చచ్చారురా
వాళ్ళెప్పుడో చచ్చారు!!!

(గుజరాత్ లొ జరిగిన సంఘటనకు ప్రతిస్పందనగా)

---

చుట్టుపక్కల వాళ్లతో మంచిగా కలిసి తిరిగితే, వొళ్ళంచి పనిచేస్తే ఓ మామూలు మనిషి కూడా ఎంతో ఎత్తుకు ఎదగొచ్చని ఆప్పా కోరపే ఆత్మకథ 'నేనో కూలోణ్ణి' వల్ల తెలుసుకోవచ్చు. దళితుల ఆత్మకథల్లో సాధారణంగా వ్యక్తమయ్యే దూషణ–దౌర్జన్యాలు, తిరుగుబాటు ధోరణులు ఈ పుస్తకంలో మచ్చుకైనా కనపడవు. ఈ పుస్తకం చదివితే సంఘం పూర్తిగా కుళ్లిపోలేదనీ, కంపు కొట్టడం లేదనీ, ఈ సమాజం ముందు ముందుకు బాగుపడే అవకాశాలున్నయన్న ఆశాభావం వ్యక్తమవుతుంది.

ఆప్పా కోరపే ఆత్మకథ 'నేనో కూలోణ్ణి' మౌఖిక సంప్రదాయానికి చెందినదానిలా తోస్తుంది. ఆయన జానపదకథలు చెప్పే కళాకారునిలా కనిపిస్తాడు. చిన్ని చిన్ని పదాలతో, చిన్న చిన్న వాక్యాలతో కూడిన ఈ ఆత్మకథ పాఠకునిలో ఉత్కంఠ కలిగిస్తుంది. ఆయన భాష పల్లె భాషే ఆయన స్వీయచరిత్రలో తటస్థ దృక్పథంతో కథ నడిపాడు.

చదువుకోలేదన్న మాటేగాని ఆప్పాకు సంస్కారం వుంది. వివేకం వుంది ఆయనకు మూఢనమ్మకాలంటే గిట్టదు. ప్రజల్ని వాటికి దూరంగా వుండమంటాడు. ఈ కారణాల వల్ల నాకు ఈ ఆత్మకథ మరాఠీలోని ఇతర ఆత్మకథల కంటే భిన్నంగా, విలక్షణంగా కనపడింది. ఓ కూలివాడి ఈ ఆత్మకథ "ఉద్ధరేత్ ఆత్మనో ఆత్మనం:" అన్న సందేశాన్ని ఇస్తుంది. విఖ్యాత బెంగాలీ రచయిత్రి మహాశ్వేతాదేవి చదువురాని ఆదివాసీలు చదువుకున్న పట్టణవాసుల కంటే ఎక్కువ సంస్కారవంతులని అంది. ఆ మాట అక్షరాలా నిజం చదువురాని పల్లీయుల ఆశానిరాశల్నీ , కష్టసుఖాల్నీ అనుభవాల్నీ టేప్ చేయించి, వాటికి అక్షర రూపం కల్పిస్తే ఎంతో గొప్ప సాహిత్యం లభిస్తుంది. దీని ద్వారా మాండలికాల సత్తా, నుడికారపు ఇంపుసొంపులు సంతరించుకొని మన భాషలు శక్తిమంతం అవుతాయి. భారతదేశంలోని వేర్వేరు రాష్ట్రాల ప్రజలు ఇలాంటి రచనల్ని చదివి స్ఫూర్తి పొందాలని ఆశిస్తున్నాను.

*(ఓ కూలివాడైన ఆప్పా కోరపే మరాఠీలో రాసుకొన్న ఆత్మకథ 'మీతో హమాల్' ను ప్రసిద్ధ హిందీ విదుషీమణి శ్రీమతి లీలా బాందివడేకర్ 'మై తో రహారా హమాల్' అన్న పేరుతో అనువదించి 2000 లో ప్రచురించారు. ఆ పుస్తకానికి ఆమె రాసిన ముందుమాటకు అనువాదమే ఈ రచన.)*

## కవిత

# సంచయనం

- లాస్య ప్రియ కుప్పా
9640551664



పొద్దుటి శ్రమలన్నీ
ఆదమరిచి గురకపెడ్తున్నాయి
కొన్ని నులకలపై, మరికొన్ని కటికనేలపై

రేపటి తరాలన్నీ
కలల్లో తేలిపోతున్నాయి
కొన్ని అమ్మ బుజ్జగింపుల్లో, మరికొన్ని బామ్మ కథల్లో

అలసిన పశువులన్నీ
భవితని మింగుతూ, గతాన్ని నెమరేస్తున్నాయి
కొన్ని నిలబడి, మరికొన్ని సాగిలబడి

వలసకొంగల ఒంటికాలి జపాలు
పచ్చని ఆకాశంలో వెన్నెల చుక్కల్లా మెరుస్తున్నాయి
కొన్ని ఒద్దికగా, మరికొన్ని బద్ధకంగా

కాలువ నీళ్ళు మాత్రం
కలవరంతో రగిలిపోతున్నాయి
బల్లకట్టు దురాగతాలకు
ఘోరాన్నేదో మోస్తోంది మరి
చీకటి తెల్లబోయేలా
వీధికుక్కలు సైతం విస్తుబోయేలా

వెలుగు పుల్లలు నిప్పుల్లా విరుచుకుపడ్డాయి
ఊళ్ళోని గుడెసెలు భగ్గుమన్నాయి
బూడిదకుప్పల్లో పవిత్ర అవశేషాలు
కొన్ని పాలనవ్వులు, కొన్ని సిరిమువ్వలు
మరి కొన్నిగువ్వలు ఇంకొన్ని కనుగవ్వలు

ఎంత వెతికినా
కులాల కుంపట్ల జాడొక్కటే దొరకటం లేదు!

# గో....గో

- నందిరాజు శ్రీనివాస్
8008506085

ఆవు సాధుజీవి
మనిషి స్వార్థజీవి
ఆవు మూగజీవి
మనిషి మూర్ఖజీవి.

ఆవుమీద కవితలో
మనిషి గోలెందుకంటే
మనిషిని పశువుని చేస్తోంది
ఆవే కదా ఇప్పుడు

ఆవును తింటానంటాడు
ఒకడు
తింటే తంతానంటాడు
ఇంకోడు
పిల్లకు పాలిచ్చి
పులికి వస్తానని చెప్పిన ఆవు
మనిషికి మనిషికి మధ్య
చిచ్చు పెట్టింది.
తినేసే పులినే నమ్మింది
ఆవుకేం తెలుసు
పులికంటే మనిషే ప్రమాదమని
ప్రేమగా పెంచిన చేతులతోనే

నీ తల నరుకుతాడని
తలలూ నరుక్కుంటారని

గోరక్షకులు దిగారు
గోభక్షకులంటూ హుంకరిస్తున్నారు.
కొమ్ములు లేకుండానే
కుమ్మేస్తున్నారు.
రాజ్యం చోద్యం చూస్తోంది.

రోడ్లమీద గోమాత
చెత్తాచెదారం తింటున్నప్పుడు
వీరంతా ఏమయ్యారో
ట్రాఫిక్ నియమాలు మాకు కాదని
గోవులన్ని గుంపులుగా చేరుతున్నప్పుడు
ఒక్కళ్ళు కనపడరేం.

అవును ఆవును
చంపడం తప్పే
దానికి ఒళ్ళుమరిచి పోయి
మనిషిని చంపడం
ఒప్పా...



గోమాత గోగో
ఎక్కడికియినా
దూరంగా గో
పాలిచ్చి
రక్షకులను
ప్రాణాలకోసం
భక్షకులను తయారు చెయ్యకుండా
మనుషుల్లేని చోటకి
గోమాత ఎక్కడికయినా గో...గో

తినే పులి ఎదురయితే
కధను నీకు తెలుసు
పనయ్యాక నువ్వెళ్ళినా
తినదు పాపం
అందుకే గో..గో..

## నచ్చిన రచన

# కత్తుల వంతెనపై కవిత్వ సమరం



**- పిళ్ళా కుమారస్వామి**
**9490122229**

***'చం' గంభీర కంఠం నుండి 2008లో వెలువడిన కవితల సంపుటి 'ఒక కత్తుల వంతెన', 'చం' అనంతపురంలో గార్లదిన్నెలోని ఉన్నత పాఠశాలలో గణిత ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తూ గత ఇరవైఏళ్లుగా తన సాహిత్యపిపాసన, కవిగా, సాహితీకార్యకర్తగా చాటుకుంటూ వస్తున్నాడు. 'చం' కలల నుంచి చిన్న పిల్లల కోసం 'బుజ్జోనికల' కూడా వచ్చింది. చంద్రశేఖర శాస్త్రి తన కలం పేరు 'చం' గా లోకానికి పరిచయమయ్యాడు.***

అలవోకగా తను రాసిన కవిత్వాన్ని ఆశువుగా మననం చేసుకుంటూ అందరి ఎదుట ఆలపించే గొంతుక 'చం'.

'చం' గంభీర కంఠం నుండి 2008లో వెలువడిన కవితల సంపుటి 'ఒక కత్తుల వంతెన', 'చం' అనంతపురంలో గార్లదిన్నెలోని ఉన్నత పాఠశాలలో గణిత ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తూ గత ఇరవైఏళ్లుగా తన సాహిత్యపిపాసన, కవిగా, సాహితీకార్యకర్తగా చాటుకుంటూ వస్తున్నాడు. 'చం' కలల నుంచి చిన్న పిల్లల కోసం 'బుజ్జోనికల' కూడా వచ్చింది. చంద్రశేఖర శాస్త్రి తన కలం పేరు 'చం' గా లోకానికి పరిచయమయ్యాడు.

'చం' కవిత్వంలో వర్తమాన దృశ్యాలు అక్షరాల పందిరిలా అల్లుకుని చిక్కనైన పాటలా గొంతెత్తి, యుద్ధ గీతాన్ని ఆలపిస్తాయి.

ఈ కవితా సంకలనంలో ఐదు కవితలు ప్రపంచీకరణపై మరో నాలుగు కవితలు కవిత్వంపై, గద్దర్, శ్రీశ్రీ, మదర్‌థెరిస్సాలపై కవితలు, రైతులపై మూడు కవితలు వున్నాయి. దళితస్వరం, స్త్రీవాదస్వరం, బాల్యం, పేదరికం, ఉగ్రవాదం, ఫ్యాక్షన్, కరువు, శ్రమజీవి, అవినీతి, రాజకీయం మొదలైన సామాజిక అంశాలను తన కవితా వస్తువులుగా తీసుకున్నాడు.

సామాజిక సంఘర్షణ జరుగుతున్న సందర్భాలలో కవి నిశ్శబ్ధంగా కూర్చొలేడు. బరిలో ఏదో ఒకవైపు నిలబడి తన అస్తిత్వాన్ని తెలియజేయడమే గాక సమాజగమనాన్ని నిర్దేశిస్తాడు. విద్యుత్ పోరాటం జరిగినపుడు ముగ్గురు కార్మికులను బషీర్‌బాగ్‌లో కాల్చివేశారు. అప్పుడు 'విద్యుత్తీగల ఉరితాడు' కవిత రాశారు. మాలమాదిగల మధ్య వర్గీకరణ చిచ్చు వచ్చింది. ఆ సందర్భంలో 'గబ్బిలంపాట' రాశారు. ఇలా ఈ కవితలన్నీ ఎక్కడ్నుంచీ ఊహాలోకంలో నుంచి వుండి పడినవికావు. ఎంతో తనలోతాను ఘర్షణపడ్డాక, వాటిని చెప్పాలని తపనపడ్డాక ఎంతో చైతన్యయుతంగా కవిత్వాన్ని రాసి ప్రచురించాడు.

ప్రపంచీకరణ బహుముఖాలను, భారతదేశం అప్పుల ఊబిలో పడిపోయిన వైనాన్ని ఆయన కవిత్వంలో చూస్తాం. ప్రపంచీకరణ పడగనీడను, బహుళజాతి సంస్థలు ఉక్కు కౌగిళ్ళను అర్థం చేసుకున్నాడు 'చం'. ప్రపంచీకరణ అంటే పెట్టుబడుల ప్రవాహంతో పాటు అందుకు అనుగుణంగా స్వదేశీ చట్టాల సరళీకరణ. ప్రపంచీకరణను 'పడమటిగాలి' గా కవిత్వీకరించాం. అందుకే 'చం' తన 'ఎలా?' కవితలో

***'వేయి పడగల బహుళజాతి సర్పం / బుసలు నింపుకున్న***

***అప్పులతూట్లు వేణువు పాడేది / ప్రియదర్శిని రాగమే.***
ఈ మట్టిలో మొలుస్తున్నది / విదేశీ విషబీజాలే "

అప్పుల ఊబిలో కూరుకుపోయిన మనదేశం తన 'అప్పుల దాస్యం' నుంచి బయటపడాలంటే ఇతర దేశాలు మనదేశంపై ఆంక్షలు వేయాలంటాడు. ఆ ఆంక్షలు సాంద్ర పరిణామాలలోంచి, ఒక ఒరిపిడిలోంచి వజ్రం మెరిసినట్లు, ఆకాంక్షలు నందివర్థనుల్లా తీగలు తీగలు సాగుతాయంటాడు.

దీని కోసం

***'బుద్ధుడు మరీ మరీ నవ్వాలి***
***నాదేశానికి మరిన్ని ఆంక్షలు కావాలి***
***శత్రుశిబిరంలో గుబులు రేగాలి***
***శత్రువు సద్దుమణగాలి***
***స్వశక్తి పెల్లుబికాలి***
***స్వదేశీ చేతల రూపుదాల్చాలి '***

అంటూ ఆంక్షల పందిరిని నిర్మిస్తే దేశం ఎదుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు 'చం'.

ప్రపంచీకరణ బహుముఖి, అది ఆక్టోపస్. అన్ని రంగాల్లోకి విస్తరించి అన్నింటినీ పీల్చేస్తోంది. అనంతపురం జిల్లా రైతు వెన్నెముకను కొంచెం కొంచెం విరిచేసి అంపశయ్యపై పరుండబెట్టింది. పామోలిన్ దిగుమతులతో వేరుశెనగ కాయల నూనెకు డిమాండ్ తగ్గిపోయింది. ఫలితంగా వేరెశెనగ పంటల విస్తీర్ణం పడిపోయింది. చైనా నుంచి సిల్కు దిగుమతి కారణంగా జిల్లాలో పట్టు డిమాండు పడిపోయి పట్టుపరిశ్రమ చతికిలపడిపోయింది. ఆపై నిత్యం కరువు, ప్రభుత్వాల ఆసరా కరువు. ఈ నేపథ్యంలో మట్టి మనిషి ఆత్మహత్య చేసుకుంటే అది ఆత్మహత్య కాదని, ఈ సమాజానిదని, ఈ దుష్టపాలకులదని ఎలుగెత్తి చాటుతాడు తన ' గద్దెలాడుతున్న దృశ్యం'లో ఇలా...

***'రైతు పక్షి వలసపోయాక ఉగాది గీతం పాడేదెవరు ? / పాడువడిన గూట్లో / ముసలిపక్షి చావకేం చేస్తుంది/ మోనోక్రోటోఫాస్ తాగి / మన్నుతిన్న మనిషిది ఆత్మహత్య కాదు ముమ్మాటికి హత్యే, రాజ్యం చేసిన హత్య "***

ప్రపంచీకరణతో మనిషి పరాయికరణ చెందడం మొదలుపెట్టాడు. ఈ పరాయికరణతో మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి. మనిషి మాయమైపోతున్నాడు. మనిషి కవరేజి ఏరియాలో లేకుండాపోతున్నాడు. గతంలో అనంతపురం నగరం నడిబొడ్డున వున్న సుజాత హోటల్‌లో కలిసే ఆత్మీయమిత్రులు ఇప్పుడు కలవటం లేదు. దీన్ని స్మృతి కవిత్వంలో

***అందరినీ అలరించిన సుజాత***
***ఈ మధ్య బాగా మారిపోయింది***
***హంగులు ఎక్కువై***
***హృదయం కుంచించుకు పోయింది.***
***గ్లోబల్ గాలానికి చిక్కిన***
***చేప సుజాత.***

మరో కవితలో దీన్నే ***'మనుషుల మధ్య / దూరం పెరిగింది / ప్రపంచం / చిన్నదైపోయింది"*** అంటాడు. మనుషుల మధ్య స్నేహ సంబంధాలు డబ్బు సంబంధాలుగా మారిపోవటాన్ని, మమతానురాగాలు దూరమవటాన్ని ఆయన తన కవిత్వంలో వ్యక్తీకరించాడు.చాలాదూరమైన మిత్రులు కలవని సందర్భంలో ఆత్మీయమిత్రుడు పుస్తకాలేనంటాడు 'చం'.

***'మిత్రులు ఒక్కరూ / కలవటం లేదా / అయితే లైబ్రరీ కెళదాం "***

అంటూ పుస్తకం మనల్ని మనిషిగా నిలబెడుతుందని చెపుతాడు.

ఈ కవితా సంపుటిలో శ్రమజీవికి పట్టంగట్టే మంచి కవిత ఉంది. అందులో ప్రపంచానికి పర్యాయపదం చేశాడు కష్టజీవిని 'చం'. శ్రామికులు హక్కులు దినంగా భావించే 'మే డే ' రోజున ఎలుగెత్తి పాడాల్సిన కవిత ఇది.

***'కర్తవాడు / ధర్మరాజు / క్రియవాడు***
***.......      ...***
***శ్రమశక్తికి నిర్వచనం వాడు***
***ప్రగతిరథానికి చక్రం వాడు***
***చైతన్యానికి ఊపిరివాడు***
***... ...      ...***
***వాడే లయ కారుడు***
***వాడిదే ప్రపంచం***
***ప్రపంచానికి పర్యాయపదం వాడే'***


జాషువా తన 'గబ్బిలం' కావ్యంలో ఒక దళితుడు తన ఆవేదనను 'గబ్బిలం' ద్వారా చెపుతాడు. కాళిదాసు నాయికానాయికల విరహాన్ని మేఘసందేశం ద్వారా చెప్పినట్లు...

## కవిత

# కాగితపు కాన్పు

- ఇ. రామకృష్ణ
99854 03678

**తా**ను ఎంగిలిచేసి విసిరిన ఈ సాయంత్రాన
నా మనసు నిరాశతో తన చోటికి ప్రయాణం కట్టి
తన పరిమళాన్ని మోసుకొస్తుంది
గదిలో నిశ్శబ్దం భగ్నమై
కాగితపు లలాటం పురుడు పోసుకుంది తన పేరై...



కంటికింద వలయాల్లో తప్పిపోయి
అందంగా ఆక్రమించుకుంటుంది అక్షరమై
కాగితమ్మీద అచ్చుకాని అక్షరాలు కొన్ని
తనులేని దుఃఖాన్ని, చీకటిని గ్లోరిపై చేస్తాయి
గదిలో నిండిన తన కౌగిలివాసన ఆఘ్రాణిస్తూ
ధీర్ఘవాక్యంలా కాగితంలోకి దూకి ఒంటరిగా
ప్రవహిస్తాన్నేను..

నా ఒంటరితనాన్ని చంకనెత్తుకుని
కాసేపు ఏకాంతంగా నడుస్తుంది
నా కలల్ని తన కళ్ళతో మోస్తుంది
నా ఆనందాల్ని తన ఉత్సవాల్లో ఊరేగించి
చిందేసి చందనం పూస్తుంది
నా శోకపు అలను తనలోకి అనుమతించి
గురిచూసి నాపై కసిగా కురుస్తుంది
నా గాయాలన్నీ గులాబీలై పుష్పిస్తాయి

కాగితం నిండా కవిత్వపు తడిచేసి
ఉదయిస్తున్న సూర్యుడి కోసం ఎదురుచూస్తుంది
అస్తమిస్తున్న సూర్యుడి కోసం నే తపిస్తాను
జీవితాన్ని మోస్తూ తాను ఆస్వాదిస్తూ నేను

ఎప్పటికీ కలవని రెండు దారుల్లో కలిసి..
కాగితంపై ప్రయాణిస్తూ మేము..!!

---

***'గబ్బిలాలు పోట్లాడుకుంటే***
***గుడ్లగూబలు విందు చేసుకుంటాయి.***
***బ్రతుకు తెల్లారక ముందే***
***అర్థరాత్రి వేగుచుక్క మొలవాలి'*** అంటాడు 'చం'.

దళితులు రెండు వర్గాలుగా చీలిపోయారు. మాలమహానాడు, మాదిగదండోరాగా. వారి మధ్యలో వైషమ్యాలు పెరిగిపోయాయి. ఐక్యత కొరవడింది, ఇది పాలకులకు ఎంతో ఆనందదాయకం. అందుకోసం వారిని జాగృతం చేస్తున్నాడు కవి. 'చదరంగంలో నల్లపావులు' గెలవాలి అంటూ దళితులకు రాజ్యాధికారం రావలసిన అవసరాన్ని తెలియజేస్తాడు.

కవి ఎవరో అతని సామాజిక దృక్పథమేమిటో ప్రతి కవి తన సంపుటిలో ఒక్క కవితైనా చేరుస్తాడు. 'కవిత' అనే కవితలో కవిబాహ్యాముఖం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

***'అమానవీయతను ప్రశ్నించేసాధన,***
***సమకాలీన సమస్యలకు స్పందన***
***సమాజ గమనానికి గమ్యానికి దిక్సూచి***
***కష్టజీవి కన్నీరు తుడిచే ఓ చల్లని హస్తం'***

కవిత్వమంటే ఇష్టం 'చం'కు, కవితను ఆరాధిస్తూ ప్రేమిస్తూ, ***'నా భవితే నీవు / చేయూతనీవు / మమతల నవత నీవు / కవితా, కవితా/'*** అంటూ కవిత్వంపై తన, ఆరాధనాభావాన్ని వ్యక్తీకరిస్తాడు.

***'ఒక పాటకు గొంతు నులిమితే / వేయిపాటలు పుడతాయి'*** అనే కవితాచరణం గద్దర్ గురించి రాసినదే. ఆయనపై హత్యాప్రయత్నం జరిగినపుడు రాసినది.

శ్రీశ్రీని 'చీకటి చరిత్రపై వెలుగు సంతకం'గా వర్ణిస్తాడు 'చం.' ప్రశ్నను పేదవాడి కొడవలితీసి / ప్రళయగర్జన చేసిన ప్రజాకవి' అంటూ శ్రీశ్రీని 'చం' ఒక్క మాటలో వర్ణిస్తాడు.

కవి సమాజంలో చేసే అంతర్ బాహిర్ యుద్ధా రావమే కవిత్వమంటాడు చలం. ఈ యుద్ధం కవిలో నిరంతరంగా జరుగుతూనే ఉంటుంది. మనిషిగా వుండటానికి యుద్ధం చేయాలి. బతకడానికి యుద్ధం చేయాలి. ఆలోచనలతో యుద్ధం చేయాలి. ఆర్భాటాలతో యుద్ధం చేయాలి. ఈ యుద్ధం అనివార్యం. యుద్ధం ఎందుకు చేయాలి? 'చం' కవితాచరణాల్లో మనం అర్థం చేసుకోవచ్చు.

***యుద్ధాన్ని వాయిదా వేయకూడదు / యుద్ధాన్ని ఆహ్వానించాలి / ... /... / యుద్ధమంటే నిరంతరచైతన్యం / యుద్ధమంటే నిర్నిరోధం చేయటం / ప్రగతిబాటవేయడం.***

# స్టేన్లీ కుబ్రిక్ 'ఎ క్లాక్‌వర్క్ ఆరెంజ్ ...'

- కాళిదాసు పురుషోత్తం
09247564044



*అలెక్స్ లండన్ మునిసిపల్ శ్రామికులకు కేటాయించిన మురికివాడలో ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటాడు. తల్లి ఏదో ఫ్యాక్టరీలో కార్మికురాలు. అలెక్స్ కొంతకాలం రిఫార్మ్ స్కూల్లో ఉండి, ప్రస్తుతం హైస్కూల్‌లో చదువుతుంటాడు. అతను స్కూలుకు నామంపెట్టి జులాయిగా తిరుగుతున్నా, అతనేవో మంచి పనులు చేస్తూ, స్కూలుకు కూడా వెళ్ళలేకపోతున్నాడని తల్లి భావిస్తుంది. దర్శకుడు సినిమాను అలెక్స్ స్వగతాల ద్వారా, అతని దృష్టికోణం నుంచి చిత్రించాడు. తరచు అతని స్వగతం, సంభాషణలు మామూలు సంభాషణలకు, కవితలకు మధ్య విభజనరేఖను చెరిపివేస్తూ ఉంటాయి.*

**1970** దశాబ్దంలో హాలీవుడ్‌లో ఎగసిపడిన "న్యూవేవ్ సినిమా" ఉద్యమ సారథుల్లో స్టేన్లీ కుబ్రిక్ ఒకరు. సత్యజిత్‌రే లాగే సినిమా దర్శకత్వంతో పాటు స్క్రీన్‌ప్లే, ఫొటోగ్రఫి, కూర్పు, సంగీతం వంటి అనేక శాఖలను పర్యవేక్షించేవాడు. దాదాపు కుబ్రిక్ దర్శకత్వం వహించిన సినిమాలన్నీ నవలలకో, కథలకో చిత్రానుసరణలు. "2001-A Space Odyssey" సినిమా కుబ్రిక్‌కు గొప్ప కీర్తి నిచ్చింది. ఆయన ఈ సినిమాలో ప్రవేశపెట్టిన "సైంటిఫిక్ రియలిజం" ధోరణిలో ఎన్నెన్నో సినిమాలు వచ్చాయి.

కుబ్రిక్ ఇంగ్లాండులో స్థిరపడిన తర్వాత, 1971లో "ఎ క్లాక్‌వర్క్ ఆరెంజ్" సినిమా తీశాడు. దీన్ని గొప్ప ప్రయోగాత్మక చిత్రమని విమర్శకులు ప్రశంసిస్తే, హింసను, అశ్లీలాన్ని ఆకర్షణీయంగా చూపించాడని నైతిక వాదులు దాడిచేశారు. ఇంగ్లాండులో జరిగిన హింసాత్మక సంఘటనల తర్వాత, కుబ్రిక్ ఈ చిత్రాన్ని ఆ దేశంలో ప్రదర్శించకుండా ఉపసంహరించాడు గాని, అమెరికాలో మాత్రం దిగ్విజయంగా ప్రదర్శించబడింది. 1980 వేసవిలో పూనా ఫిల్మ్ ఇన్స్టిట్యూట్‌లో ఈ సినిమా చూసే అవకాశం లభించింది. 35 సంవత్సరాల తర్వాత, ఈ సినిమా మరొక మాటు చూసి ఈ నాలుగు మాటలు రాస్తున్నాను.

ఈ సినిమాలో ప్రధానపాత్ర అలెక్స్ భవిష్యత్తరం యువతకు ప్రతీక. అతన్ని, అతని మిత్రులను నీతినియమాలు గాలికి వదలి, పైశాచిక హింసాప్రవృత్తి అలవరచుకొన్న థగ్గుల ముఠాగా చెప్పొచ్చు. దర్శకుడు చెప్పడు గాని అలెక్స్ గ్యాంగ్ ఈ సమాజమే తయారుచేసిన హింసా బాలకులనవచ్చు.

అలెక్స్ లండన్ మునిసిపల్ శ్రామికులకు కేటాయించిన మురికివాడలో ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటాడు. తల్లి ఏదో ఫ్యాక్టరీలో కార్మికురాలు. అలెక్స్ కొంతకాలం రిఫార్మ్ స్కూల్లో ఉండి, ప్రస్తుతం హైస్కూల్‌లో చదువుతుంటాడు. అతను స్కూలుకు నామంపెట్టి జులాయిగా తిరుగుతున్నా, అతనేవో మంచి పనులు చేస్తూ, స్కూలుకు కూడా వెళ్ళలేకపోతున్నాడని తల్లి భావిస్తుంది. దర్శకుడు సినిమాను అలెక్స్ స్వగతాల ద్వారా, అతని దృష్టికోణం నుంచి చిత్రించాడు. తరచు అతని స్వగతం, సంభాషణలు మామూలు సంభాషణలకు, కవితలకు మధ్య విభజనరేఖను చెరిపివేస్తూ ఉంటాయి.

అలెక్స్ గ్యాంగ్ సేదతీరడానికో, కార్యాచరణకు బయల్దేరే ముందో తరచు 'మిల్క్ బార్'లో కలుస్తారు. ఈమారు అక్కణ్ణించి ఒక నిర్జన నాటకశాలకు వెళ్తారు. అలెక్స్ ప్రత్యర్థివర్గం లేదా గ్యాంగ్ నాటకశాలలో ఒక యువతి మీద అత్యాచారం చేస్తూ కంటబడతారు. అలెక్స్ బృందం ప్రత్యర్థి ముఠాపై దాడిచేసి, చిత్తు చిత్తు చేస్తుంది. పోలీసుల అలికిడి విని అక్కణ్ణించి పారిపోయి, ఆ హుషారులోనే ఒక వృద్ధుడైన రచయిత ఇంట్లో జొరబడి అతణ్ణి దారుణంగా కొట్టి, అతని కళ్ళముందే అతని

భార్యను చెరుస్తారు.

మిల్క్‌బార్‌లో అలెక్స్, అతని ముఠా సభ్యులు సరదాగా కబుర్లు చెప్పుకొంటుండగా, ఆ సమీపంలో మరొక టేబుల్ ముందు కూర్చొని ముగ్గురో, నలుగురో ముచ్చట్లాడుతూ ఉంటారు. అనుకోకుండా ఆ బృందంలో ఒక మహిళ అద్భుతమైన కోకిల కంఠంతో లుడ్విన్ వేన్ 9వ సింఫొనీలోని కొంత భాగాన్ని ఆలపిస్తుంది. ఎక్కణ్ణుంచో ఆ బార్‌లోకి ఎగిరివచ్చి వాలినపిట్ట పాటలాగా ఆ పాట తనను ఏ గంధర్వ లోకాల్లోకో తీసుకొని పోతున్నట్లు అలెక్స్ భావిస్తున్న తరుణంలో అతని సహచరుడు పాట బాగా లేదన్నట్లు వెకిలి నవ్వు నవ్వుతాడు. అలెక్స్ స్వప్నం చెదిరిపోతుంది. పట్టరాని కోపంతో తన చేతిలో ఉన్న బ్యాట్‌తో అతణ్ణి కొడతాడు. ఊహించని ఈ సంఘటనకు అక్కడ ఉన్న వాళ్ళంతా నిర్ఘాంతపోతారు. ఆమె పాడుతున్న పాట తనకు తెలుసని అలెక్స్ అంటాడు.

***చికిత్స ఫలితంగా అతనిలో మానవ సంవేదనలన్నీ నశించి జడప్రాయుడవుతాడు. నగ్నయువతి ఎదురుగా ఉన్నా, తనను కొట్టి హింసించినా అతనిలో స్పందన, ప్రతిచర్య ఉండదు.***

మరొక దృశ్యం. కేసెట్‌లు, పుస్తకాలు అమ్మే షాపులో అలెక్స్‌కు ఇద్దరు టీనేజ్ అమ్మాయిలు పరిచయ మవుతారు. అలెక్సు గదిలో ముగ్గురూ నిస్సిగ్గుగా శృంగారంలో పాల్గొంటారు. అలెక్స్ డ్రాయరు సొరుగులో దాచుకున్న వాచీలు, కెమెరాలు, ఇతర వస్తువులు, నోట్లకాగితాల వంక ఆప్యాయంగా, తృప్తిగా చూసుకొంటాడు. తన పెంపుడు పామును లాలిస్తాడు.

అలెక్స్ గ్యాంగ్‌లోని ముగ్గురు సభ్యులకు అతనంటే కంటగింపు. అలెక్స్ పాశవికంగా దాడిచేసి, భయభ్రాంతులను చేసి, వాళ్ళను తన అదుపాజ్ఞల్లో ఉంచుకొంటాడు. వాళ్ళు ప్రతీకారం కోసం కాచుకొని ఉంటారు. మద్యం సేవించి ఆరాత్రి సిటీకి దూరంగా, వివిక్తంగా ఉన్న ప్రదేశంలో హెల్త్‌ఫాం నిర్వహిస్తున్న మహిళ ఇంట్లో దొంగతనానికి బయల్దేరుతారు. ఆమె జాగ్రత్తపడి పోలీసులకు ఫోన్ చేస్తుంది. అలెక్స్ ఒక్కడే మొండి ధైర్యంతో, పెరటివైపు నుంచి ఇంట్లో జొరబడతాడు. ఆమె ప్రతిఘటిస్తే, అక్కడే టేబుల్ మీద అలంకారంగా పెట్టిన పోర్సిలిన్ శిల్పం పురుషజననాంగంతో ఆమెను కొట్టి, పోలీసుల రాకను పసిగట్టి బయట పడతాడు. వెలుపల వేచివున్న అతని మిత్రులు పాలబాటిల్‌తో అతని ముఖాన్ని పచ్చడిచేసి పారిపోతారు.

పోలీసులు, కోర్టువిచారణ, హత్యానేరం కింద అలెక్స్‌కు 44 సంవత్సరాల జైలుశిక్ష విధించబడుతుంది. నేరస్థులపై మానసిక వైద్యులచేత ప్రయోగాలు జరిపించి, నేరస్థులను హింసాప్రవృత్తినుంచి దూరంచేసే ఒక ప్రణాళికను ప్రభుత్వం చేపడుతుంది. తనమీద ఈ ప్రయోగాలు జరపడానికి అలెక్సు అంగీకరిస్తాడు. వైద్యులు నిర్విరామంగా అలెక్స్‌కు హింస, శృంగారం ఉన్న దృశ్యాలను తెరమీద చూపుతారు. ఆ దృశ్యాలతో పాటు, అతనికి ఎంతో ప్రియమైన బెథోవెన్ 9వ సింఫొని సంగీతాన్ని కూడా నేపథ్యంలో వినిపిస్తారు. దుస్సహమైన చికిత్సను అలెక్స్ భరిస్తాడు. చికిత్స ఫలితంగా అతనిలో మానవ సంవేదనలన్నీ నశించి జడప్రాయుడవుతాడు. నగ్నయువతి ఎదురుగా ఉన్నా, తనను కొట్టి హింసించినా అతనిలో స్పందన, ప్రతిచర్య ఉండదు. ప్రయోగం విజయవంతమైనట్లు భావించి, ప్రభుత్వం జైలుశిక్ష రద్దుచేస్తుంది.

అలెక్స్ నిస్సహాయుడుగా, ఒంటరిగా బయటి ప్రపంచంలోకి అడుగు పెడ్తాడు. తల్లిదండ్రులు ఇంట్లోకి రానివ్వరు. అతని చేతుల్లో హింసకు గురైన వాళ్ళందరూ ప్రతీకారానికి సిద్ధంగా ఉంటారు. బిచ్చగాళ్ళు అలెక్స్ కన్పించగానే చుట్టుముట్టి దారుణంగా కొడతారు. పోలీసులు అలెక్స్‌ను బిచ్చగాళ్ళ నుంచి కాపాడుతారు గాని, పూర్వం వాళ్ళు అలెక్స్ ముఠాలో సభ్యులు. అలెక్స్‌ను ఒక నిర్జనప్రదేశంలో దారుణంగా కొట్టి వదలి వెళ్తారు పాత మిత్రులైన పోలీసులు. అలెక్స్ చేతుల్లో గాయపడి చక్రాల కుర్చీకి పరిమితమైన రచయిత అలెక్స్‌కు ఆశ్రయమిచ్చినా, తనవంతు ప్రతీకారం తీర్చుకుంటాడు. ప్రభుత్వానికి వ్యతిరేకులైన రాజకీయపక్షం వాళ్ళను పిలిపిస్తాడు. వాళ్ళ ప్రశ్నలకు సమాధానాలు చెప్తూ, తనకు జీవితేచ్ఛ నశించిందని అలెక్స్ అంటాడు. ప్రభుత్వం మీద ప్రయోగించడానికి వాళ్ళకో ఆయుధం దొరికినట్లయింది. రచయిత అలెక్స్‌ను గదిలో బంధించి బెథోవెన్ 9వ సింఫొనీని వినిపిస్తాడు. ఆ సంగీతాన్ని సహించలేక అలెక్స్ మేడమీద నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడతాడు. తీవ్రంగా గాయపడి స్పృహ లేకుండా ఆస్పత్రిలో ఎంతో కాలం ఉండి, తన బెడ్ సమీపంలో ఒక డాక్టరు, నర్సు సృష్టికార్యంలో నిమగ్నమై ఉండగా స్పృహలోకి వస్తాడు.

సమాజంలో పెచ్చరిల్లిపోయిన 'అల్ట్రావైలెన్సు'కు

నిర్ఘాంతపోయిన క్రైస్తవ మతవాది ప్రతిస్పందనగా విమర్శకులు ఏంథొని బర్జెస్ రచించిన ‘ఎ క్లాక్‌వర్క్ ఆరెంజ్’ నవల (1962)ను భావించారు. కౌమారదశలోనే మానవత్వాన్ని కోల్పోయిన అలెక్స్ ముఠాను ఈ సమాజమే తయారుచేసింది. మానవత్వాన్ని పోగొట్టుకొని యాంత్రికంగా మారిన సమాజంలో సాధారణ మానవులు కూడా తమ వివేచనను, నైతికతను కోల్పోతారేమో! అలెక్స్ వర్తనను నియంత్రించి సమాజం అతణ్ణి అమానుషంగా, థగ్గుగా మారిస్తే, అతనికి వైద్యం చేసిన వైద్యులు కూడా అతని ప్రవర్తనను ‘కండిషన్’ చేసి యాంత్రికంగా నడుచుకొనేట్లు మార్చారు. అలెక్స్ ప్రయోగాలకు ముందూ, తర్వాత ‘కండిషన్’ చేయబడ్డ కుర్రాడే. క్లాక్‌వర్క్ ఆరెంజ్ ఒక ప్రతీక. జీవసంబంధమైన జాజికొయ్య పెట్టెలో అమర్చిన గడియారం యంత్రం. బహిరంగంగా జీవపదార్థం కావచ్చుగాని, లోపల నియంత్రించబడిన యంత్రమే. స్టేన్లీ కుబ్రిక్ మాత్రం తన సినిమాను ఆశావహంగా ముగిస్తాడు, అలెక్స్ బెథోవెన్ 9వ సింఫొనీని ఆస్వాదిస్తున్నట్లు చూపి.

నేను రాసినంత మామూలుగా కుబ్రిక్ సినిమాలో సెక్స్, హింసా దృశ్యాలు ఉండవు. ఊహకందని ఈ దృశ్యాలు, సంగీతం, అనుభూతులు ప్రేక్షకుల్లో జుగుప్సను, భయాన్ని కలిగిస్తాయి. స్థాణువులై చూస్తారు ఆ దృశ్యాలను. అవి సమ్మోహకాలు ఏమాత్రం కావు. హింసను ఆకర్షణీయంగా, గ్లోరిఫై చేసి చూపించడం మీద కుబ్రిక్ అభిప్రాయం కూడా ఇదేనేమో! ఈ సినిమాకు మన దేశంలో సెన్సార్ సర్టిఫికేట్ లభించలేదు గాని, దీన్లోని హింసా దృశ్యాలు మాత్రం మన సినిమాల్లో ఒదిగిపోయాయి.

అలెక్స్‌కు పాశ్చాత్య క్లాసికల్ సంగీతం మీద పిచ్చి అభిమానం. బాల్యంలోనే అతనికి అంత సంగీతం పిచ్చి ఎట్లా కలిగిందో దర్శకుడు చెప్పడు. రాత్రివేళ బిచ్చగాడు వికారమైన గొంతుకతో ఏదో పిచ్చి పాట పాడుతుంటే అలెక్స్ సహించలేడు. అలెక్స్ ప్రతి కదలికా లయబద్ధంగా ఉంటుంది. కేసెట్‌లు అమ్మే షాపులో సంగీతం వింటున్నంతసేపూ అతని వేళ్ళు లయబద్ధంగా కదులుతుంటాయి. అతని చేతికర్రను ఎప్పుడూ సంగీతానికి అనుగుణంగా కదిలిస్తూ ఉంటాడు. ‘సింగింగ్ ఇన్ ది రెయిన్’ అనే సుప్రసిద్ధమైన పాట పాడుతూనే అలెక్స్ రచయిత భార్య మీద అత్యాచారం చేస్తాడు. కుబ్రిక్ క్లాసికల్

***నేను రాసినంత మామూలుగా కుబ్రిక్ సినిమాలో సెక్స్, హింసా దృశ్యాలు ఉండవు. ఊహకందని ఈ దృశ్యాలు, సంగీతం, అనుభూతులు ప్రేక్షకుల్లో జుగుప్సను, భయాన్ని కలిగిస్తాయి. స్థాణువులై చూస్తారు ఆ దృశ్యాలను.***


రాగాలను, సంగీతాన్ని నేపథ్య సంగీతంగా వాడుకొన్నాడు. హెల్త్‌ఫాం నిర్వహిస్తున్న మహిళను అలెక్స్ పురుషాంగం రూపంలో ఉన్న శిల్పంతో కొట్టి చంపుతాడు. జననాంగం హత్యాయుధం. పాలబాటిల్‌తో అలెక్స్ ముఖం మీద కొడతారు అతని మిత్రులు. కళాభిరుచికి, మానవతకు సంబంధం లేదని కుబ్రిక్ సూచిస్తున్నాడా అని అన్పిస్తుంది. ది ట్రెయిన్ సినిమాలో జర్మన్ సైన్యాధికారి గొప్ప కళాభిరుచి ఉన్న వ్యక్తి. ప్యారిస్ మ్యూజియం నుంచి పెయింటింగ్స్‌ను తరలించడానికి ఎంతమంది జనం చచ్చినా అతనికి చీమకుట్టినట్లుండదు. అలెక్స్ చేతుల్లో మరణించిన ఫాంహౌస్ యజమానురాలి ఇంటి గోడల నిండా శృంగార చిత్రాలే వేలాడుతూ ఉంటాయి. అలెక్స్ అపార్ట్‌మెంటు మెట్ల వద్ద గోడకు మైకెలేంజిలో వంటి గొప్ప చిత్రకారుడి చిత్రాన్ని అనుకరించిన చిత్రం ఉంటుంది. చాక్‌పీసుతో దానిమీద గీసిన అసభ్యమైన రాతలు, బొమ్మలు చూస్తాము.

నాటక రంగస్థలం మీద కుర్రాళ్ళు ఒక యువతిపై అత్యాచారం చెయ్యడం, అలెక్స్ గదిలో అమ్మాయిలతో శృంగారం వంటి దృశ్యాలు చాలా వేగంగా మారిపోతూ ఉంటాయి. ‘ఇది నిజంకాదు’ అనే ఒక భావాన్ని కలిగించడానికే ఆ దృశ్యాలను దర్శకుడు అట్లా చిత్రించినట్లు తోస్తుంది. రక్తాన్ని ఎప్పుడూ రక్తంలాగా కాక పెయింట్ లాగా చూపించడంలో కూడా ఇటువంటి స్ఫురణ ఉన్నట్లుంది.

ఎ క్లాక్‌వర్క్ ఆరెంజ్ సినిమలో ప్రతి ఫ్రేము ఒక వర్ణచిత్రం అనిపిస్తుంది. లైటింగ్ శిల్పం (plastics) వల్ల దృశ్యాలన్నీ ఏవో స్వప్నలోకంలోవిగా, అధివాస్తవికంగా అన్పిస్తాయి. అలెక్స్, అతని మిత్రుల కదలికలు, సంభాషణ చాలా ‘stylised’గా తోస్తాయి. అలెక్స్ ముఠా సభ్యుల వేషం, భాష, ప్రతి కదలిక, వాళ్ళ చేతుల్లో ధరించిన బేస్‌బాల్ బ్యాట్లు చూడగానే ఎదుటివాళ్ళు భయవిహ్వాలు లవుతారు. ఈ సినిమా ప్రేక్షకులను అనేక స్థాయిల్లో స్పృశిస్తుంది. ఎన్నో కొత్త అర్థాలు, ప్రతీకలు. అలెక్స్ గదిలోని వస్తువులన్నిటినీ కెమెరా panning ద్వారా చూపుతుంది. ఒక్కమాటా లేకుండా అతని అభిరుచులు, ఇష్టాలు అన్నీ తెలిసిపోతాయి. కెమెరానేత్రం క్షణాల్లో ఒక వస్తువునుంచి మరొక వస్తువుమీదికి మారుతూ, అనుగుణంగా గొప్ప సంగీతం. సినిమా అంతా గుర్తు లేకపోయినా ఈ దృశ్యం మాత్రం మనస్సుల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది.

# మునుపటి మహబూబ్‌నగర్ జిల్లా శాసనాలు

- డా॥ ఈమని శివనాగిరెడ్డి
9848598446



మునుపటి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 82 కన్నడ శాసనాలున్నాయి. బాదామీ చాళుక్యులు, రాష్ట్రకూటులు, కళ్యాణ చాళుక్యులు, కళాచూర్యులు, కాకతీయులు, విజయనగర రాజుల శాసనాలున్నాయి. వాటిలో క్రీ.శ.713లో. బాదామీ (పశ్చిమ) చాళుక్య రాజైన విజయాదిత్యుడు, అలంపూరు శాసనం మొట్టమొదట శాసనం కాగా, విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు, అలంపూరులోనే క్రీ.శ. 1521వ సంవత్సరంలో, విడుదల చేసిన శాసనం చివరి శాసనం.

అలంపూరులోని, తుంగభద్రానది ఒడ్డున గల బాలబ్రహ్మేశ్వరాలయ ప్రాకారం మెట్ల దగ్గర గల 'దేవబ్రాణి' అనే ప్రదేశంలో బాదామీ చాళుక్య రాజైన విజయాదిత్యుడు క్రీ.శ. 635-36 (క్రీ.శ. 713-14)లో ఒక శాసనాన్ని చెక్కించాడు. ఇందులో 1 నుంచి 6 లైన్లు సంస్కృత భాషలో ఉండగా, ఒక లైను మాత్రమే కన్నడంలో ఉంది. దీని ప్రకారం ఈ నిరవధ్య ప్రాకారాన్ని ఈశానాచార్యుడు నిర్మించాడు. అలంపూరులోని మహాద్వారానికి కుడివైపు స్థంభం మీద, రాష్ట్రకూట రాజైన ధారావర్షధృవుడు క్రీ.శ. 780లో చెక్కించిన శాసనముంది. ఇందులో, ఆలయ శ్రీ వాగిళు మహాద్వారాన్ని, అలంపూరును పాలిస్తున్న బాలవర్మరసు నిర్మించి, కొన్ని కానుకలు సమర్పించినట్లుగానూ, అక్కడి మఠాధిపతి సోమాడిభట్ట, బ్రహ్మేశ్వర భటారల ప్రస్తావనా ఉన్నాయి.

రాష్ట్రకూటుల కాలానికి చెందిన కురువగట్టిలోని ఒక శాసనంలో కలివల్లభ ధృవుని (క్రీ.శ. 780-92) కుమారుడైన మూడో గోవిందుడు (క్రీ.శ. 792-814) చాళుక్య వినయాదిత్యుని కుమారుని స్నేహితుడనీ, ఎన్నో యుద్ధాల్లో పాల్గన్నాడని తెలియజేస్తుంది. మీనాంబరంలోని మరో రాష్ట్రకూట శాసనములో కన్నారదేవ మూడో కృష్ణుని (క్రీ.శ. 936-67) పాలనలో కాలాముఖ శైవుడైన అగస్త్య గురువరు ప్రస్తావన ఉంది. అలంపూరు మ్యూజియంలోని సిద్ధ సోమేశ్వర దేవర మఠం తపోధనుల కోసం, తెలుగు చోళ రాజైన ఇఱుగణచోళ మహారాజు 400 మర్తన్ల భూమిని దానం చేసినట్లు చెప్పబడింది. దీనివల్ల అలంపురంలో కాలాముఖ శైవమఠం ఉండేదని తెలుస్తుంది.

అలంపురంలోని ఒక వీరగల్లు పైగల క్రీ.శ. 1028-29 వ సంవత్సరం నాటి శాసనంలో, కళ్యాణచాళుక్య రాజైన జయసింహవల్లభుడు కన్నెనాడును జయించటానికి వచ్చినప్పుడు, రాచమల్లు అనే వీరుడు ఏనుగును పొడిచి, మరణించాడని ఉంది. కొల్లాపురం తాలూకా మల్లేశ్వరంలోని అగస్త్యేశ్వర దేవాలయంలో ఉన్న క్రీ.శ. 1051, అక్టోబరు 27, ఆదివారం నాటి శాసనంలో, త్రైలోక్యమల్ల దేవుడు అతని సామంతుడైన మహామండలేశ్వర కుమార విజయాదిత్య దేవుడు అతని భార్య మయిలలదేవి కలిసి కందూరు నాడులోని వద్దవని

– 500 కంపణంలోని ఇత్తిపి–90 కి చెందిన రెండు గ్రామాలను అదే దేవాలయ సత్రానికి దానం చేసిన వివరాలున్నాయి.

అలంపూరు మ్యూజియంలోని మరో స్థంభం పైనగల క్రీ.శ. 1057, జనవరి 4, శనివారం నాడు, త్రైలోక్య మల్లదేవుని సామంతుడైన మహామండలేశ్వర ఇరుగన చోళ మహారాజు (తెలుగు చోళ) మహామాత్యుడు, సుంకప్రెగ్గడ అయిన లోకమాణికశెట్టి, మహాస్థానాధిపతి బ్రహ్మరాశిపండితుని సమక్షంలో, నాల్గునాడుల నుంచి రావలసిన సుంకాలను, బ్రహ్మేశ్వర దేవుని అఖండ దీపానికి దానంగా ఇచ్చాడని చెప్పబడింది. ఏయే వస్తువుల నుంచి ఎంతెంత సుంకం వసూలు చేయాలోనన్న వివరాలు కూడా ఈ శాసనంలో ఉన్నాయి.

ఉజ్జిలిలోని క్రీ.శ.1066వ సంవత్సరపు శాసనంలో కళ్యాణపురం నుంచి త్రైలోక్య మల్లదేవర పాలిస్తున్నప్పుడు అతని సామంతుడైన మహామండలేశ్వర వల్లభ చోళ మహారాజు, స్థానిక బద్దిగజినాలయం లోని చెన్నపార్శ్వనాధునికి, కొంత భూమిని, పూలతోటను దానం చేసినట్లునూ, ఈ ఆలయం (కలకవెలుగు – 500 రాజధాని అయిన నాడు ఉజ్జివాలాల (ఉజ్జిలి) కోటలో ఉందనీ, అది ద్రావిడ సంఘం, సేణగణం, కౌరూరు గచ్చకు చెందిందనీ, ఈ ఆలయ స్థానాధిపతి వాదిరాజ శిష్యుడైన ఇంద్రసేన పండితునికి, ఈ దానాన్ని, ఈ బసది జీర్ణోద్ధరణకు, పార్శ్వనాథుని అంగరంగభోగాలకు, తపోధనుల ఆహార అవసరాలకు ఇవ్వబడిందని చెప్పబడింది. అలంపూరు మ్యూజియంలోనున్న క్రీ.శ. 1067 నాటి శాసనంలో చాళుక్య త్రైలోక్య మల్లదేవుడు కళ్యాణ పురం నుంచి పాలిస్తుండగా, అతని సామంతుడైన మహామండలేశ్వర (తెలుగు చోళ) చిద్దణ చోళ మహారాజు అయిన – 300 నుంచి పాలించేప్పుడు, అయిజ –300 చౌదరి మేసనయ్య ప్రెగ్గడ, గావుండలు కలిసి, అలంపూరు బ్రహ్మేశ్వరునికి పరమేశ్వరదత్తిగా, అయిజ–300 కిందగల గ్రామాల నుంచి ఒక్కో గద్యాణ పొన్నును మహాస్థానాధిపతి బ్రహ్మరాశి భట్టారకుని పాదాలు కడిగి దానంగా సమర్పించిన వివరాలున్నాయి.

గద్వాల తాలూక పూడూరు గ్రామంలోని శివాలయం పక్కనున్న క్రీ.శ. 1087 నాటి శాసనంలో, మహామండలేశ్వర నాలుగో పల్లవ భూప చంద్ర ప్రభ (వల్లవ) జినాలయాన్ని నిర్మించి, కొన్ని దానాలను ప్రకటించినట్లుగా ఉంది. ఈ ఆలయానికి తారగణాధిప ప్రభజినాలయమని కూడా పేరు. క్రీ.శ. 1091, డిసెంబరు 25, గురువారం నాటి గంగాపురం శాసనంలో, కళ్యాణ నగరంలో నుంచి త్రిభువన మల్ల దేవుడు పాలిస్తుండగా, జ్యోతిశ్శాస్త్రవేత్తలైన ఆదిత్య భట్టోపాధ్యయ, విద్దణభట్టులకు జ్యోతిర్వృత్తి కింద, చక్రమ క్షేమం కోసం, సకళ ప్రకాశక భట్టారకుడు కొంత భూమిని దానం చేసిన వివరాలున్నాయి. అలంపూరు మ్యూజియంలో నున్న క్రీ.శ. 1107, డిసెంబరు 25, బుధవారం నాటి శాసనంలో కళ్యాణ చోళుని త్రిభువనమల్లదేవుని సామంతుడైన మహామండలేశ్వర, మల్లరసు, కందనహాళ (కర్నూలు) నుంచి రావలసిన ఆదాయాన్ని అలంపూరులోని బ్రహ్మేశ్వరునికి దానం చేసినట్లుగా చెప్పబడింది. అదే మ్యూజియంలో నున్న క్రీ.శ.1107, డిసెంబరు 25 బుధవారం నాటి శాసనంలో కళ్యాణ చాళుక్య త్రిభువన మల్ల దేవుడు జయన్తీపురం నుంచి పాలిస్తున్నాడనీ, అతని పట్ట మహాదేవి, అభినవ సరస్వతి, అయిజ–300లోని, నుండవలి, బోరువెల్లి, సాళియూరు, కడంబూరు గ్రామాలను అలంపూరు బ్రహ్మేశ్వరునికి సేవకొరకు మహాస్థానాధిపతి దరుణీంద్ర పండితునికి దానం చేసినట్లుగా పేర్కొనబడింది.


ఆవంచలోని చాళుక్యభరణం, త్రిభువన మల్లదేవుని క్రీ.శ. 1113, జూలై 28, సోమవారం, చక్రవర్తి కుమారుడైన మహామండలేశ్వర కుమారతైలపుని దండయాత్రలను గురించి, ఇంకా తన రాజధాని అయిన ఆవంచ ప్రజల కోరికపై, కొన్ని సాంఘిక దురాచారాలను రూపుమాపటానికి ఇచ్చిన ఆదేశాల గురించి ఉంది. ఆలవానిపల్లిలోని త్రిభువన మల్లదేవుని కుమారుడు మహామండలేశ్వర, యువరాజ తైలపదేవుడు, కోడూరు–1000 నుంచి పాలిస్తుండగా, క్రీ.శ. 1110, అక్టోబరు, 29 శనివారం శాసనంలో, యువరాజు రాజధాని అయిన కోడూరులో స్థానికులను సంప్రదించి చేసిన కొన్ని కట్టుబాట్లున్నాయి. చాళుక్య చక్రవర్తి త్రిభువన మల్ల, విక్రమాదిత్యుడు (ఆరవ) చందలదేవి కుమారుడు, మహామండలేశ్వర కుమార తైలపుని విజయాలు, అతడు కోడూరు నుంచి పాలిస్తుండగా క్రీ.శ. 1121, ఆగస్టు 14 ఆదివారం నాటి శాసనంలో తన భార్య లక్ష్మీదేవి, కుమారులు పెర్మాడి, బిక్కి దేవుల ప్రస్తావనతో పాటు నెక్కొండలోని రామేశ్వరునికి, కందూరు–1000 లోని బూదుపుర గ్రామాన్ని దానం చేసిన వివరాలున్నాయి.

క్రీ.శ. 1126, ఫిబ్రవరి 19, గురువారం నాటి జడ్చర్ల శాసనంలో, భూలోక మల్ల దేవుడు కళ్యాణపురం నుంచి రాజ్యం

## కవిత

### చినుకు

- గరికిపాటి మాస్టారు
8897672733



*చినుకు రాలకుంటే రైతు లోకానికి వణుకు*
*నాటిన విత్తనం మొలకెత్తదని*
*చినుకు పడకపోతే జనానికి బెరుకు*
*దప్పిక తీరదని*
*చినుకు చినుకుకూ రైతు ముఖంలో నవ్వుల పువ్వులు*
*పూస్తాయ్.*
*జీవాలు నిలవాలంటే చినుకు రాలాలి.*
*చినుకు రాలినప్పుడు నేల తల్లి ఫక్కున నవ్వుతుంది*
*ఎంతైన పొడికి ఓర్చగలం కానీ తడికి ఓర్చలేం...*
*అనంటూంటారు*
*వర్షపు తడి తగలందే చేను ఎలా పండుతుంది..?*
*చినుకు తడి తగలందే కడుపు ఎలా నిండుతుంది..?*
*కనుక.....సోదరా..!*
*వర్షపు తడికి ఓర్చుకో*
*చినుకు రాలాలని కోరుకో....*

---

చేయుచుండగా, అతని కుమారులకు తైలపురు, కందూరు నుంచి పాలిస్తున్నాడనీ, వీరబలంజ కులానికి చెందిన బయ్యశెట్టి, గంగాపురంలో పార్శ్వనాథునికి చైత్యాలయాన్ని నిర్మించగా, అయ్యావళి-500, మూవత్తారు బీడుగళు, ముమ్మరిదండ, సమస్త దభయ నానా దేశీయులు, శెట్లు, ఆ చైత్యాలయానికి ఇచ్చిన దాన వివరాలున్నాయి.

అలంపూరులోని సూర్యనారాయణ దేవాలయు స్థంభంలోనున్న, క్రీ.శ. 1182, జనవరి 11, సోమవారం నాటి కళాచూరి అనంతమల్లుని శాసనంలో, అయ్యావళి-500, ఉభయనాదేశి, ముమ్మరి దండ, కన్నడ-4000 ఇంతింబుళగొబ్బూరు, మద్దూరు, అలంపూరుకు చెందిన వ్యాపార సంఘ సభ్యులు ఒకచోట సమావేశమై, వ్యాపార వస్తువులపై వేసే సుంకాదాయాన్ని, స్థానిక గవరేశ్వర దేవునికి దానం చేసినట్లు చెప్పబడింది. వర్ధమానపురంలోని క్రీ.శ. 1229, జనవరి 16 మంగళవారం నాటి కాకతీయ గణపతి దేవుడు ఓరుగల్లు నుంచి రాజ్యం చేస్తుండగా, అతని సామంతుడు, వర్ధమానపురం నుంచి కందూరునాడును పాలిస్తున్నాడు. ఈ శాసనంలో, కీర్తినారాయణ పురయంబుళానికి చెందిన దేమిశెట్టి వైదిశెట్టి, ఇక్కడ ఒక చెరువును తవ్వించి, సకలేశ్వర మరియూ ఇతర దేవతలకు ఆలయాలను నిర్మించారు. అమ్మే వస్తువులపై విధించే సుంకాల నుంచి వచ్చే ఆదాయాన్ని స్థానిక వ్యాపార సంఘాలు ఆ దేవాలయాలకు దానంగా ఇచ్చినట్లు చెప్పబడింది.

అలంపూరు మ్యూజియంలో నున్న క్రీ.శ. 1521, జూన్ 16, విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల శాసనంలో గౌరదణ్ణాయక బసవయ్య ఆజ్ఞలపై నారణయ్య, చెన్నపాడు, వెలంపాడు గ్రామాలను బాలబ్రహ్మేశ్వర దేవుని సేవలకు గాను దానం చేసినట్లుగా చెప్పబడింది. ఇదే శాసనంలో, శ్రీకృష్ణదేవరాయలు తన ఉత్తర దిగ్విజయయాత్ర ముగిసిన రాచూరును స్వాధీనం చేసుకొన్న తరువాత గౌరదణ్ణాయక బసవయ్యకు అలంపూరును అమరదణ్ణాయంగా ఇచ్చినట్లు పేర్కొనబడింది. అలంపూరులోని యోగానంద నరసింహ దేవాలయంలోని క్రీ.శ. 1521, జూన్ 16 నాటి శ్రీకృష్ణదేవరాయని శాసనంలో, గౌరెదణ్ణాయక నారయణయ్య, గౌరెదణ్ణాయక బసవయ్య ఆదేశాలపై, స్థానిక యోగానంద నరసింహునికి, అలంపురంలో కొంత భూమిని, బయరాపురం (నరసింహపురం) అనే గ్రామాన్ని దానం చేశాడని చెప్పబడింది.

ఇలా, మునుపటి మహబూబ్‌నగర్ జిల్లాలో పశ్చిమ చాళుక్యుల నుంచి విజయనగర రాజుల దాకా, విడుదల చేసిన కన్నడ శాసనాల్లో రాజులు, చక్రవర్తులు, వారి భార్యలు, యువరాజులు, రాజధానులు, అధికారులు, సీమలు, స్థలాలు, గ్రామాలు, వృత్తుల వాళ్ళు, వ్యాపారస్తులు, వివిధ మతాలు, స్థానాధిపతులు, ఆర్థిక సామాజిక వివరాలు నిక్షిప్తమై చరిత్రకెక్కటానికి ఎదురుచూస్తున్నాయి.

## కవిత

# తిరుగు ప్రయాణం

- గరికపాటి మణీందర్
99 48 32 62



టికెట్ రిజర్వేషన్ అయింది.
ఆరు రోజుల ఎదురు చూపు
లిప్తకాలంలో కరిగి పోయింది.

శ్రీమతి బ్యాగు సర్దుతోంది
మల్లెపువ్వుల్లా సాపు చేసిన
ప్యాంటు షర్టులను
మొగలి రేకుల్లా ముడిచింది.

మమకారంగా పల్లిలో కారం
అనురాగంతో ఆవకాయ సీసా
కారప్పూస సున్నుండల డబ్బా...
చందమామలా గుండ్రంగా వత్తిన
నాలుగు చపాతీలు
నిమ్మకాయలతో చేసిన పులిహోర క్యారియరు

షేవింగ్ కిట్టూ మందుగోలీల పర్సు
దేనితో ఏదీ సంఘర్షించుకోకుండా
ఒలికిపోయి బట్టలు పాడవకుండా
నైపుణ్యం అంతా ప్రదర్శించి నాజూగ్గా సర్దింది.

రాత్రి గోరుకొయ్యలు నడి నెత్తికొచ్చేవరకూ...
ఏకబిగిన ఆవలింతలు ఏవేవో ముచ్చట్లు.

చీకటిని గడియారం ముల్లులతో ఊడుస్తూంది
అలా కునుకు పట్టిందో లేదో
అలారం అదేపనిగా కచ్చేరి మొదలెట్టింది.

బిరబిరా కాలకృత్యాలు తీర్చుకున్నాను
బద్ధకించకుండా వండుకోండి
వేళకు తిని పడుకోండి
రోజూ ఫోన్ చేస్తుండండి
సెలవు కలిసొచ్చేట్టు సి యల్ పెట్టండి
రెండు రోజులు ఉన్నట్టుంటుంది.

అంటూ వీడుకోలుగా చేయి ఊపుతోంది.
తన కళ్ళలో సన్నటి కన్నీటి పొర
నన్ను నిలువెల్లా ఆవహించిన దిగులు తెర.

బహుశా తన ప్రేమనంతా కుక్కిందేమో...
బరువైన బ్యాగును ఈడ్చుకుంటూ
వచ్చే ఆదివారాన్ని వేళ్ళపై గణిస్తూ
భారంగా కదిలాయి నా కాళ్ళు

# స్వేచ్ఛా గీతిక

- ఇల్ల ప్రసన్నలక్ష్మి
9494165632




నట్టింట నవ్వుల విరబోతకి
ఆమెపైనెందుకీ ఆక్షేపణ...?
జన్మపై నిషేధాజ్ఞల నిర్దేశనం
బడబాగ్నులను భరిస్తూ
గుండెల్లోని దిగులు పక్షి రెక్కల సవ్వడి
నడకనూ నడతనూ శాసించే
సమాజ దృక్కోణం
మట్టిపొరలను చీల్చుకొచ్చే మొలకై
విశ్వమంతా పరివ్యాప్తమౌతూ... ఫరిడవిల్లుతూ
సంజె వెలుగుల నడుమ
ఉరికే ఉప్పెనై
బతుకు రణపు హోరులో దూసుకెళ్తుంటే...
సహనం సింహాసనమెక్కి

శీలపరీక్షకు తలొగ్గే సీతను కాలేను
సంసార రథానికి శల్య సారథ్యం వహించలేను
ఆత్మాభిమానపు అందలమెక్కి
దిక్కులు పిక్కటిల్లేలా
అవని అంచులని కదిలిస్తూ...
అతివ శ్వాసలోని ధిక్కార స్వరాన్ని
స్వేచ్ఛాగీతికనై ఆలపిస్తా...!

**కథ**

# ఓపెన్ సీక్రెట్స్

- డా॥ ఎజ్రాశాస్త్రి
9014756393



"**తా**తా! తాతా!... అటుచూడు..."ఆశ్చర్యంగా వ్రేలు చూపిస్తున్నాడు బుడ్డిగాడు. వాళ్ళ తాత వెంకట్రామయ్య అటు చూసాడు. ఆశ్చర్యం!... పిల్లల కుక్క ఒక్కటి పిల్లి పిల్లకు కూడా తన పిల్లలతో పాటుగా పాలిస్తుంది. బుడ్డిగాడితో పాటు సంటిగాడు కూడా ఆశ్చర్యంగా అడుగుతున్నారు వాళ్ళ తాతయ్య వెంకట్రామయ్యను.

"కుక్కలు కూడా పిల్లులకి పాలిస్తాయా తాతా!"


"ఇవ్వవు గాని ఎక్కడో అడపాదడపా అలా జరుగుతుంది. ఈ మధ్య మేక కుక్క పిల్లకి, కుక్క మేక పిల్లకి కూడా పాలిస్తున్నట్టు అప్పుడప్పుడు పేపర్లోను, టీ.వి.ల్లోను చూస్తున్నాం గదా! ఆ జాబితాలో బాపతేయిది."

"తాతా!కుక్కలు ముడ్డి కడుక్కో వేంటి!ఎవరూ కడగరు కూడాను.అలాగే పీతిముడ్డితో ఇంట్లో కొచ్చేస్తాయ్ ఎందుకని తాతయ్య'' ఐస్క్రీం తింటున్న బుడ్డిగాడి తమ్ముడు సంటిగాడందుకున్నాడు.

బుడ్డిగాడి అసలుపేరు గణేష్,వీడికి తొమ్మిదేళ్ళు. సంటిగాడి అసలుపేరు శిరీష్.వీడికి ఏడేళ్ళు.ఈ యిద్దరు చిన్నకూతురు సరస్వతి బిడ్డలు. వెంకట్రామయ్య ఎప్పుడు బజారుకెళ్ళినా ఇద్దర్నీ తీసుకెళ్ళాల్సిందే! అలా అలవాటైపోయింది ఆయనకు.

వెంకట్రామయ్య ఒక మోస్తరు భూస్వామి. ఆయనదొక చిన్న దివానం. పొలమదీ చూసుకోడానికి పాలేళ్ళు కూలోళ్ళు - ఇంట్లోపనోళ్ళు. ఈయనకి యిద్దరుకూతుళ్ళు ఒక కొడుకు. పెద్ద కూతురు లక్ష్మి భర్త, ఆరేళ్ళ కొడుకు రుత్విక్ ఒకేసారి పదేళ్ళ క్రితం కారు యాక్సిడెంట్లో పోయారు. అప్పట్నుంచి కొడుకుని, భర్తని పోగోట్టుకున్న పెద్ద కూతురు లక్ష్మి కూడా తన దగ్గరే వుంటుంది. కొడుకైతే అమెరికాలో వుంటున్నాడు. యింకా అతనికి పెళ్ళి కాలేదు. ఇప్పుడు పెద్దకూతురు లక్ష్మి క్కూడా ఈ యిద్దరు గారాల బిడ్డలే. వెంకట్రామయ్యకైతే భార్యపోయి అప్పుడే ఇరవైఏళ్ళయి పోయింది. అందుకే ఈ బుడతలతోటే లోకం. తనకు పక్క పోర్షన్లో వుంటున్న వెంకట్రామయ్య తమ్ముడికి భార్య పోయి ఏడాది దాటింది. యాభై ఏళ్ళుంటాయి. నెల క్రితమే రెండో పెళ్ళి చేసుకున్నాడు. తన ముందు భార్యకు పిల్లల్లేరు. అందుకే ఈ జంటకు వీళ్ళే గారాల బిడ్డలు. ఇలా ఆ యింట్లో వాళ్లందరికి గారాల బిడలైపోయారు. అయినాగాని, అందరికంటే వెంకట్రామయ్య తాతయ్యతోటే ఇరవైనాల్గంటలూ

వీరుండేది. నిజం చెప్పాలంటే ఈ పిల్లల తల్లి అదే వెంకట్రామయ్య చిన్న కూతురు సరస్వతి కంటే కూడా తనకే ఎక్కువ చేరిక మరి. చిన్నకూతురు భర్త అదే ఈ బుడతలు తండ్రి పదేళ్ళ నుండి దుబాయ్ లోనే వుంటున్నాడు. అందుకే వెంకట్రామయ్య ఎప్పుడు బజారుకెళ్ళిన ఈ యిద్దరూ వుండాల్సిందే వెంట!. వెళ్ళేటప్పుడు మొదలుపెట్టి యింటికి తిరిగొచ్చే వరకు తాతయ్యను ప్రశ్నల మీద ప్రశ్నలువేసి చంపుకు తింటారీ బుడతలిద్దరు. వెంకట్రామయ్య ఓపిగ్గా తనకు తోచినట్టు ఆ ప్రశ్నలకు జవాబులు చెప్పుకుపోతుంటాడు. బుడతలిద్దరూ దారిపొడుగునా ప్రశ్నలేప్రశ్నలు.



"అవును తాతయ్యా.. మనం కుక్కల్నేమొ యింటిలో పెట్టుకుంటూ బెడ్ రూంలో క్కూడా రానిచ్చేస్తాం. మరి మన పనోళ్ళని బెడ్ రూముల్లో గట్టా రానియ్యమెందుకు తాతయ్య" మళ్ళీ బుడ్డిగాడి ప్రశ్న

" అంతే కాదన్నయ్య .. మనంగాని దోడ్లో కూచోని ముడ్డి కడుక్కోపోతే మనల్ని యింట్లోకి రానిస్తారా?" సంటిగాడి ప్రశ్న.

"పాపం పిల్లి పిల్లకి అమ్మ చచ్చిపోయింది గత్తాతయ్యా కారు క్రిందపడి. అందుకే పాపం పిల్లిపిల్లకి కుక్క పాలిస్తుంది." మళ్ళీ సంటిగాడి మనసంతా ఆ పిల్లిపిల్లవైపు పోయింది.

"అవును తాతయ్యా.. మన పనిమనిషి వెంకమ్మ చచ్చిపోతే. ఆ చంటి పిల్లోడికి ఏ చంటిపిల్ల తల్లి కూడా పాలివ్వలేదేంటి తాతయ్యా? ఆ వెంకమ్మ కొడుకూ తమ్ముడూ ఒక నెలలోనే పుట్టారని చెప్పుతూ వుండేవారు మీరంతా. మరి మమ్మీ కూడా ఒక్క రోజైనా పాలివ్వలేదేంటి తాతయ్యా!. పైగా మన పనిమనిషి పిల్లోడేగా...ఆ వెంకమ్మ బతికున్నపుడు మనింట్లో బోల్డంత పనిచేసేదిగదా!. మా ముడ్లు కూడా కడిగేది చిన్నప్పుడు."

''ఆళ్ళు మనింట్లో పనోళ్లు. అందుకే మమ్మీపాలివ్వకూడదు. కత్తాతయ్యా."

తాతయ్యకి జవాబు చెప్పే చాన్సేలేకుండా అన్నదమ్ములిద్దరూ ఒకరి తర్వాత ఒకరు మాట్లాడేస్తూ ప్రశ్నలు, జవాబులు వాళ్ళకు వాళ్ళే చెప్పేసుకుంటున్నారు. వెంకట్రామయ్యకు సమాధానం చెప్పే అవకాశమే వుండదొక్కొక్కసారి. తప్పొప్పులు, పాప పుణ్యాలు న్యాయన్యాయాలు, ధర్మాధర్మాలు ఒకటేమిటి? అన్ని వాళ్ళే నిర్ణయిం చేసినట్లుంది, వారి సంభాషణ వింటే! ఆది నుండి ఇలా అలవాటైపోయింది. బుడతలిద్దరికి అవకాశమిచ్చినప్పుడు మాత్రం వెంకట్రామయ్య నిజాయితీగా తనకు తెల్సినట్టు జవాబులు చెప్పుతుంటాడు.

" పిల్లికి కుక్క బద్దశత్రువని, అలాగే ఎలుక్కి పిల్లి బద్ద శత్రువని మా కాన్వెంట్ లో సార్లు చెప్పారు గాని, యిక్కడేమో దానికి వ్యతిరేకంగా జరుగుతుంది. కత్తాతయ్యా మన మనుషుల కంటే అవే నయం గత్తాతయ్యా!."

"అవును మన మమ్మీ కూడా పాపం ఆ వెంకమ్మ కొడుక్కి ఒక్క పూటంటే ఒక్క పూట కూడా పాలివ్వలేదు పాపం. నిజమే గత్తాతయ్య" సంటిగాడు గుక్కతిప్పకుండా చెప్పేస్తున్నాడు.

ఇంతలో అటుగా వచ్చే వాళ్ళింట్లో పనోడు పేరయ్యను చూసి,

"అదుగో పేరయ్య కూడా వచ్చాడు. మన మొచ్చిన బజారుకే. ఇదిగో... పేరయ్య ఇటు.. ఇక్కడున్నాం" సంటిగాడు కేకలు.

"అవును తాతయ్యా పెద్దోళ్ళని మావయ్యని, బాబాయని, తాతయ్యని పిలవాలి గదా మనింట్లో పనిచేసే పేరయ్య లాంటి పెద్దోళ్ళని, యంకటేశు లాంటి పెద్దోళ్ళని పేరుపెట్టి పిలుస్తామెందుకు తాతయ్య?తమ్ముడు కూడా అంతే. పేరయ్యకి మనవళ్ళు, మనవరాళ్ళు ఉన్నారు. వారంతా పేరయ్యని పేరుపెట్టి ఎప్పుడూ ఎవ్వరూ పిలవరు వారు పేరయ్యని తాతయ్యనే పిలుస్తారు. మనమే తమ్ముడితో సహా తనని పేరుపెట్టి పిలుస్తాం ఇది ఒకరకంగా తప్పే గత్తాతయ్యా"

"పెద్దోళ్ళని పేరుపెట్టి పిలువ కూడదు గాని, మరి పేరయ్య మన పని మనిషి గదా, పైగా తక్కువ కులమోడుగా అందుకే పిలవొచ్చు గత్తాతయ్యా."


వీళ్ళద్దరి మాటలకు వెంకట్రామయ్య సమాధానం చెప్పేలోపే పేరయ్య వచ్చి

"చినబాబు, సంటిబాబు గోరు నన్నల్లంత దూరంలోనే సూసి గుర్తు పట్టేసినారు బాబయ్య. ఎంత గుర్తో నేనంటే! సంటిబాబు గోరికి"

మురిసి పోతు వచ్చీరాగనే చంటిగాడ్ని చంకనేకసుకున్నాడు పేరయ్య.

"మీ తమ్ముడు గోరు బజారి కంపారు బాబయ్య. నిజానికి పొద్దుగాలొక పాలొచ్చాను. ఆ చిన్నమ్మగోరేదో

మరిసిపోయినారంట. మళ్ళీ కాయితం ముక్క మీద ఏదో రాసి పంపీసినారు నన్ను. చిన్నయ్యగోరు వయస్సుకు పెద్దోరైన మరి కొత్త సంసారం గంద, అమ్మ గోరు పడు సావిడ. ఏవేవో రాసిత్తారు కొనుక్కు రమ్మని"



పేరయ్య ఫుల్‌స్టాఫ్ లేకుండా వెంకట్రామయ్యతో చెబుతుండగానే,

"తాతయ్యా! చినతాతయ్య పెద్దమ్మ కంటే ఎంతో పెద్దోడు గదా. పైగా చిన్న మామ్మ చచ్చిపోగానే అదే సంవత్సరం తిరక్కుండానే పెళ్ళి చేసుకున్నాడు. అంతేగాదు కొత్త మామ్మ అదే అమ్మమ్మకి అమ్మ వయసే అంటున్నారు. మరి పెద్దమ్మకి నువ్వెందుకు మళ్ళీ పెళ్ళి చేయలేత్తాతయ్యా? పెద్దనాన్న, అన్నయ్య చచ్చిపోయి అప్పుడే పదేళ్ళపోయిందని అప్పుడప్పుడు నువ్వే గుర్తు చేస్తుంటావ్ మరి"

" తప్పుబాబు!అట్టాంటి పెద్ద పెద్ద మాటలు మీ లాటి పిల్లలు మాటాడగూడదు." పేరయ్య సద్రున అందుకున్నాడు.

"ఏ... నేనన్నాదాంట్లో తప్పేముంది? నేనన్నది నిజంగాదా? అబద్ధమేమన్నా అన్నానా? చెప్పు.." రెట్టించాడు బుడ్డిగాడు.

"కొత్త అమ్మమ్మ భలేస్మాట్‌గా వుంటుంది కత్తాతయ్యా ఎప్పుడూ కొత్త కొత్త డ్రెస్సులేసుకుంటుంది. చేతినిండా బోల్డన్ని రంగు రంగుల గాజులు. చీరకి మ్యాచ్చైన బొట్టుండాల్సిందే ఎప్పుడూ. మరి పెద్దమ్మకి చేతికి గాజులేవుండవ్. అసలూ మొకానికి బొట్టూ వుండదేటి తాతయ్యా!..నువుకొనివ్వవా?.."

సంటిగాడి ప్రశ్నలకి వెంకట్రామయ్య ఖంగుతిన్నాడు.

"మీరిద్దరు ఒకలికిమించినోళ్ళొకరు. ఇలాటి ఇషయాలు పెద్దోల్నడ గొచ్చా? ఆ.. తప్పుగాదు.. బొత్తిగా భయం లేదు మీకు"

పేరయ్య ఒక్కసారిగా గొంతు పెంచాడు .

"ఎందుకు భయం ఏ విషయాలైన తెలీకపోతే పెద్దోళ్ళడిగి తెలుసుకోమని మా స్కూల్లో చెప్పారు తెలుసా?...అందుకే మాకు తెలీని విషయాలన్ని తాతయ్య నడిగి తెలుసుకుంటాం. కత్తాతయ్యా!"

"నేను కూడా అంతే చేస్తాను. కత్తాతయ్యా..." మళ్ళీ సంటిగాడు కొనసాగింపు.

వెంకట్రామయ్య వెంటనే కల్పించుకుని మాట్లడలేక పోయాడన్నా మాటేగాని, తన గుండెల్లోకి తూటాలు దిగినట్టుంది మనవళ్ళ ప్రశ్నలకి. నిజానికి ఆ ప్రశ్నలకేమి సమాధానం చెప్పాలో తనకు సరిగ్గా తెలీదు.అందుకే తను ఆలోచనలో పడ్డాడు. పేరయ్య సమాధానాలు, గద్దింపు వల్ల కొంత ఊరట కల్గిండి, వెంకట్రామయ్యకు గాని

"అన్నింటికి పేరయ్య అడ్డం చెప్పుతూ మేమేదో తప్పుఅన్నట్టు గద్దిస్తుంటే నువ్వు మాట్లాడవేంటి తాతయ్య" బుడ్డి గాడు నిలదీశాడు.

"లేదు..లేదు.. చెప్తాను బాబు చెప్తా.ఎందుకంటే చినతాతయ్య మగోడు గదా పెద్దమ్మేమొ, ఆడ. అందుకే ఈ తేడా"

"మరైతే ఆడామగా సమానమని మా బళ్ళో మాస్టార్లు ఎందుకు చెబుతున్నారు?"

"చూడు బాబు సమానమే నేనూ కాదనటంలా. మరియిది పెళ్ళి యవారంగదా"

"పెళ్ళిళ్ళలో మాత్రం ఆడా మగా సమానంగాదు. అంతేనా తాతయ్య."

ప్రశ్నకి ప్రశ్నకి ఏ మాత్రం గేప్ లేకుండా తాతయ్య బుడతలిద్దరు హాట్ సంభాషణ.

"ఇదిగో బుడ్డిబాబు గోరు... సంటిబాబు గోరు!. నేనొక మాటాడగనా?మీరు బర్లో జాయినైనప్పుడు మీ తండ్రి పేరడుగుతున్నారా?తల్లి పేరడుగుతున్నారా."–పేరయ్య సూటిగా ప్రశ్నించాడు.

"ఇది వరకు నీవన్నట్టు తండ్రి పేరొకటే అడిగే వారు గాని. ఇప్పుడైతే ఇద్దరు పేర్లూ అడుగుతున్నారు."

"పోనీలె మరి మొన్నటిదాకా తండ్రి గోరి పేరే ఎందుకడిగి రాసుకునే వోళ్ళో తెలిసిందా బాబు గారూ"

"ఏంటి తెలిసింది. నువు చెప్పేదంతా దేనికి?–ఆడోళ్ళు మగోళ్ళు ఒకటి గాదు. అంటే సమానంగాదని చెప్పటానికి అంతేనా?"


పేరయ్య బుడతలిద్దరి వేడి వేడి సంభాషణ మధ్యలో వెంకట్రామయ్య కల్పించుకుని

"నీవన్నది నిజమే బుడ్డి! ఆడా మగా సమానమే. నేనూ అదే చెబుతున్నా. కాని మరి కుటుంబ పెద్ద ఎవరు? ఎవరని మా బళ్ళో చెప్పారు చెప్పు?"

"డాడీ! అదే తండ్రి"

"మరదే. అందుకే కొన్ని విషయాలు తండ్రి లేక మగాడికి ప్రత్యేకత వుంటుందన్న మాట"

ఇంతవరకు తిండిలో పడిపోయిన చంటిగాడు గబుక్కున కల్పించుకుని



"తాతయ్యా! యింట్లో కంచాలు కడగటం ఎప్పుడూ ఆడోళ్ళే చేస్తారెందుకు? చిన్నపిల్లలమైనా మా లాంటి మగ పిల్లోళ్ళు ఎంచక్కా తినేసిన కంచాలక్కడ వదేసి ఎంచక్కా ఆడుకుంటానికెళ్ళిపోతాం. ఆడోళ్ళెంత పెద్దోళ్ళైన మా ఎంగిలి కంచాల్ని కడుగుతారెందుకు తాతయ్యా!"

"మరిదేనా సమానత్వం అంటే. అందుకే అడుగుతున్నా కనీసం ఎక్కడెక్కడ మగోళ్ళెక్కువో ఎక్కడెక్కడ ఆడోళ్ళు తక్కువో చెప్పు తాతయ్యా! వివరంగా"

మళ్ళీ బుడ్డిగాడి సూటిప్రశ్న.

"ఇదిగో బుడ్డిబాబు గోరు.. కోప్పడకపోతే ఒక మాట సెప్పుతాను. తాతయ్యగోరు సెప్పింది, యిసుమంటి కంచాలుగట్టా కడిగే చిన్నచిన్న యిసయాలు గుర్తుండిగాదు. కొన్ని ముక్యమైనయిసయాల్లా మగోడు తప్పకుండా ఎక్కువే మరి.మగోడు మగోడే ఆడది ఆడదే.మొగోడితో ఆడదెట్టా సమానమౌద్ది? మీ యిస్కూల్లో యిట్టాగే నేర్పుతున్నారా?"

"అయితే మా మాష్టార్లు చెప్పిదంతా తప్పు. నువు చెప్పిందంతా రైటంటావ్ అంతేనా?"

"అహహ.. లేదు బాబయ్య కొన్ని యిసయాల్లో"

"అదే..ఆ కొన్ని విషయాలేంటొ మాకు తెలియాలిగా"

ఇద్దరి మధ్య సంభాషణలోకి వెంకట్రామయ్య ప్రవేశించి,

"మగవాళ్ళు చేసే కొన్ని పనులు ఆడవాళ్ళు చేయలేరు. అలాగే ఆడవాళ్ళు చేసే పనులు కొన్ని మగవాళ్ళు చేయలేరు.ఏదీ కంచాలు కడగటం మగాళ్ళు చేయలేరు. అంతేనా తాతయ్య"

"అహ అదిగాదు."

"ఏదిగాదు త్తాతయ్యా!... ఏదీ సూటిగా చెప్పవ్.ఇదీ రైటే అదీ రైటే అంటూ చివరికి ఏది అసలు రైటో, ఏది అసలు రాంగో తెలీకుండా మాట్లాడతావేంటి తాతయ్య. కంచాలు సంగతి అలా పక్కన పెడదాం డాడీని ఎప్పుడూ మమ్మీ గౌరవంగా ఏమండీ!.. అని పిలుస్తుంది. కాని డాడీ! నాకు తెలిసినప్పట్నుంచి ఒక్కసారంటే ఒక్కసారి కూడా 'ఏమండి' అని మమ్మీని పేరు పెట్టి పిలవటం చూళ్ళేదు. డాడీ ఎప్పుడూ, మమ్మీని పేరుపెట్టి పిలుస్తాడు. ఒక్కోసారైతే అసలు పేరేలేనట్టు 'ఇదిగో ఓయ్!..' అంటూ కూడా పిలుస్తుంటాడెందుకు మరి ఇదికూడా మగాళ్లు చేయలేనిపనా?అదీ మగాళ్ళు అనలేని మాటేనా?.."

గుక్క తిప్పకుండా గణగణా మాట్లాడేస్తూ నిలదీసినట్టు ఒక ప్రక్క బుడ్డిగాడు అడుగుతుంటే

"అంతేగా దన్నయ్య ఒక్కోసారి కోపమొచ్చినప్పుడు మమ్మీని "ఏమే వసే.. అని కూడా కసురుకుంటాడు డాడి మమ్మీని. నేనెన్నొ సార్లు విన్నాను"

సంటిగాడు వత్తాసు.

''అయ్య బాబోయ్..మీరు దేవాంతకులండి బాబోయ్.మీరసలు పిల్లలు గాదు పిడుగులు" అంటున్న పేరయ్య మాటలకు పుల్‌స్టాప్ చెప్పటానికి వెంకట్రామయ్య

"సరే గాని పేరయ్య.. ఇదిగో ఈ డబ్బులు పట్టుకెళ్ళి ఈ ప్రక్కనే బాలాజీ స్వీట్‌షాప్ వుంది. తెలుసుగా అక్కడ స్వచ్ఛమైన నేతితో చేసినా మైసూర్ పాక్ ప్యాకెట్సుంటాయి. రెండు పట్రా నువ్వెళ్ళిపోదువుగాని" అనటంతో క్షణాల్లో స్వీట్‌ప్యాకెట్స్ తీసుకొచ్చి మనవళ్ళు చేతిలో పెట్టి

"ఎళ్ళొత్తా బాబయ్యా" అంటూ పేరయ్య వెళ్ళిపోవటం.

ఇంతలో అటుగా వచ్చే ఆటోఆపి తాతా మనవళ్ళిద్దరూ ఆటో ఎక్కేయటం కూడా చకచకా జరిగిపోయింది.ఈ సారి మనవళ్ళిద్దరూ వేసే ప్రశ్నలకు పూర్తి బ్రేక్. అందులో ఒక ప్యాకెట్ విప్పి, అప్పుడే యిద్దరూ తిండిలో పడిపోయారు. వెంకట్రామయ్య మాత్రం యింటికొచ్చేవరకు తన్నుతాను ప్రశ్నించు కుంటూనే వున్నాడు. తన పెద్దరికంతో ఇప్పటివరకు పిల్లలకు తోచినట్లు సమాధానాలు చెప్పేడేగాని, వాళ్ళేసిన సరైన ప్రశ్నలకి సరిపోని జవాబులు లేవని ఒప్పుకుంటున్నాడు. తన మన స్సాక్షి గద్దిస్తుంటే, మనవళ్ళిద్దరూ వేసిన ప్రశ్నలన్ని నగ్నసత్యాలు.తిరుగులేని నిజాలు. బహిరంగ సత్యాలు. బహిరంగరహస్యాలు. **OPEN SECRETS** అంటూ తనలోతాను గొణుక్కుంటూనేవున్నాడు. తన మనసంతా ఎక్కడికో వెళ్ళిపోయింది. ఎక్కిన ఆటో మాత్రం యింటి ముందు కొచ్చి ఆగింది.ఆటో ఆగి ఆగకుండానే మనవళ్ళిద్దరు యింట్లోకి పరుగెత్తగా వెనక తానూ ఆటో వాడికి డబ్బులిచ్చి ఇంట్లోకి నడిచాడు.

## నివేదిక

# కాకినాడ సాహితీస్రవంతి 4వ వార్షికోత్సవం



*కాకినాడ సాహితీస్రవంతి 4వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తున్న డా॥ శాంతినారాయణ. చిత్రంలో గనారా, వొరప్రసాద్, గిడ్డు సుబ్బారావు, మార్ని జానకిరామ్ చౌదరి, జోశ్యుల కృష్ణబాబు, వుయ్యపు హనుమంతరావు, గడీల శివప్రసాద్*

కాకినాడ సాహితీస్రవంతి నాల్గవ వార్షికోత్సవం ఆగస్టు 6న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు కాకినాడ పి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎల్.సి.డి. హాల్‌లో జరిగింది. మొత్తం 5 విభాగాలుగా జరిగిన ఈ వార్షికోత్సవం ప్రారంభ సదస్సులో సాహితీస్రవంతి కాకినాడ గౌరవ అధ్యక్షులు డా॥ వుయ్యపు హనుమంతరావు సభాధ్యక్షులుగా సాహితీస్రవంతి ఆశయాలను, పనితీరును వివరించారు. ముఖ్య అతిథి సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు వొరప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామిక, ప్రగతిశీల, లౌకిక భావాలతో విశాల వేదికగా సాహితీస్రవంతి కృషి చేస్తుందని అన్నారు. సాంకేతిక అభివృద్ధి అద్భుతాల్ని




సృష్టిస్తున్నప్పటికీ సామాజికంగా ఇంకా ఛాందస భావాలు మానవ సంబంధాలను దెబ్బతీస్తున్నాయని అన్నారు. రచయితలు మానవ సంస్కారాన్ని పెంచే రచనలు విరివిగా చేయాలని కోరారు. సాహితీస్రవంతి అటువంటి రచయితలకు ప్రోత్సాహాన్ని ఇస్తుందని, వేదిక కల్పిస్తుందని అన్నారు. యువతరంలో సాహిత్య అభిరుచిని పెంపొందించడానికి సాహితీస్రవంతి కృషి చేస్తుందని తెలిపారు. విశిష్ట అతిథులుగా విచ్చేసిన సినర్జీ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ ప్రకాష్, పెద్దాపురం మహారాణి కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఆర్. ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్రవేట్ పాఠశాలల్లో ఎలాగు ఇంగ్లీషు మీడియం తప్పట్లేదు, కనీసం ప్రభుత్వ పాఠశాలల్లోనైనా తెలుగు మాధ్యమాన్ని ఎట్టి పరిస్థితులలోనూ కొనసాగించాలని అన్నారు. అనంతరం జరిగిన మొదటి సాహిత్యసదస్సుకు డా. జోశ్యుల కృష్ణబాబు అధ్యక్షత వహించారు. ప్రముఖ కథా, నవలా రచయిత డా॥ శాంతినారాయణ 'సమాజము – సాహిత్యం' అనే అంశంపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ సాహిత్యం సమాజ వాస్తవికతను ప్రతిబింబించాలని అన్నారు. ఇతిహాసాల పేరుతో ప్రజలను మౌఢ్యం వైపు నెట్టే సాహిత్యం విరివిగా ప్రచారం చేశారని అన్నారు. ఆధునిక సాహిత్యం అణగారిన వర్గాల జీవితాలను వెలుగులోకి తీసుకొస్తూ సమాజ వికాసానికి దోహదపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా సాహితీస్రవంతి 4వ వార్షికోత్సవ కవితా సంకలనం 'అలల తీరంలో..' పుస్తకాన్ని వొరప్రసాద్ ఆవిష్కరించారు. ప్రముఖ కవి, విమర్శకులు బొల్లోజు బాబా పుస్తకాన్ని సమీక్షిస్తూ మాట్లాడారు. భోజన విరామం అనంతరం జరిగిన రెండవ సాహిత్య సదస్సుకు ప్రముఖ రచయిత పాలపర్తి ధనరాజ్ అధ్యక్షత వహించారు. ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం పొందిన మెర్సీ మార్గరేట్ 'సమకాలీన కవిత్వం – సామాజికత' అంశంపై మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో వివిధ వర్గాల ప్రజల నుండి తమ అస్తిత్వాలను చాటుతూ కవిత్వం వెలువడుతుందని అన్నారు. తెలుగు సాహిత్యం విస్మరించబడిన జీవితాలను కవులు శక్తివంతంగా చిత్రీకరిస్తున్నారన్నారు.

మూడవ సాహిత్య సదస్సుకు కొత్తపేట కళా సాహితి కార్యదర్శి గిడ్డి సుబ్బారావు అధ్యక్షత వహించారు. వుయ్యపు హనుమంతరావు కవితా సంపుటి 'గాండీవం' పుస్తకాన్ని, మాకినీడి సూర్యభాస్కర్ రాసిన 'కల్లోల సరళి' పుస్తకాన్ని గిడ్డి సుబ్బారావు ఆవిష్కరించారు. సాయంత్రం 4 గంటలకు కవి సమ్మేళనాన్ని వద్దిపర్తి రామకృష్ణ శ్రీవాత్సవ నిర్వహించారు. గరికపాటి మాష్టారు, బొల్లోజుబాబా, యర్రమిల్లి శారద, పద్మజావాణి, అద్దేపల్లి జ్యోతి, ఉండవల్లి ఎం. మధునాపంతుల సత్యనారాయణమూర్తి, ఎర్రాశాస్త్రి, మేకా మన్మధరావు తదితర 40 మందికి పైగా కవులు స్వీయ కవితా గానం చేశారు. మరీ ముఖ్యంగా పి.ఆర్. కాలేజీలో ప్రత్యేక తెలుగుతో బి.ఎ. చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు తమ కవితలతో సభను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సాహితీస్రవంతి కాకినాడ నగర కమిటీని సాహితీస్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా ప్రకటించారు. అధ్యక్షులుగా మార్ని జానకిరాం, బొల్లోజు బాబా ప్రధాన కార్యదర్శిగా, పద్మజావాణి కోశాధికారిగా కాకినాడ నగర సాహితీస్రవంతి కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మేడిశెట్టి శ్రీరాములు పాడిన పాటలు సభికులను అలరించాయి. ◆

## నివాళి

# పోతుకూచి సాంబశివరావు కన్నుమూత



తూర్పు గోదావరి జిల్లాలోని ఆలమూరులో 1925, జనవరి 27న పోతుకూచి సాంబశివ రావు జన్మించారు. హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. పోతుకూచిగా తెలుగు సాహిత్యక్షేత్రంలో చిరపరిచితులైన వీరు ఆగస్టు 6న తుదిశ్వాస విడిచారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో నిరంతరం పోతుకూచి సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తుండేవారు. ఉదయ కిరణాలు, అన్వేషణ వంటి నవలలు, పలు నాటకాలు రాశారు. వీరి ఉదయ కిరణాలు నవలకు ఆంధ్రపత్రిక వారి బహుమతి అందుకున్నారు. కలిసుంటే కలదు సుఖం, తండ్రీ కొడుకులు వంటి వెండితెర నవలలూ రాశారు. విశ్వసాహితి సంస్థ, విశ్వరచన పక్షపత్రిక స్థాపించి చివరిదాకా నిర్వహించారు. పల్లె కదిలింది, దొంగ దొర, ఏడు సున్నాలు, ఇది తంతు, పెళ్ళి పిలుపు, ప్రతిధ్వనులు వంటి నాటకాలు ప్రాచుర్యం పొందాయి. ఇటీవల తన 'ఆత్మకథా తరంగాలు' పుస్తకాన్ని వెలువరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సంఘం సభ్యులుగా సేవలందించారు. ♦

## కవిత

# ఇష్టం

- నన్నపనేని రవి
9963671531



గూట్లో దాక్కున్న పిట్ట కంటే
వలస పక్షుల ప్రయాణమంటేనే
నాకెందుకో ఎక్కువ ఇష్టం

పూలతోటలో పచ్చపురుగు కంటే
తేనెటీగలూ తుమ్మెదలంటేనే నాకెందుకో ఎక్కువ ఇష్టం

అద్దంలో
ప్రతిబింబం మీద పోరుతున్న పేరు తెలియని
పికిలి కంటే
పంటపొలాల్లోకి దిగుతున్న పిచ్చుకల దండంటేనే
నాకెందుకో ఎక్కువ ఇష్టం


నల్లమబ్బుల కింద తూనీగలూ నడిచే దారిలో చీమలూ
మట్టిపుట్టలోని చెదపురుగులూ చెప్పే పాఠం
ఆలకించాలా
అనుభవానికీ ఆలోచనకీ జోడించుకోవాలా
పడమరకి ఓ కొమ్మా తూర్పుకి మరో కొమ్మా
విస్తరించిన
నియంత నీడల వృక్షరాజసం కంటే
జమ్మి చెట్లకింద తుమ్మచెట్లకింద లతలూ లతికలంటేనే
నాకెందుకో ఎక్కువ ఇష్టం

తలుపుచాటున
పిండివంటల ఒంటరి చిరుతిండి కంటే
చెలికాళ్ళ మధ్య
తోపులో
వానగాయలూ నేరేళ్ళూ నక్కెర్లూ
ఏరుకోడమంటేనేఎక్కువ ఇష్టం
తాటికర లెక్క తప్పుతున్నా
తొలిమాను మొదులుకొని ఇంకో తడవ గణించడమే
ఎక్కువ ఇష్టం
ముంజెల గంపచుట్టూ దొంతు కూర్చున్న
పిల్లగుంపంటేనే ఇంకా ఇష్టం

ఒక్కణ్ణో ఒక సాహసగాణ్ణో
నేనై ఉండడం కంటే
ఈగలు ముసిరిన బెల్లంగా జీవించడమే
నాకెంతో ఇష్టం
విభక్తులన్నింటిలోకి
'లు' వర్ణకమంటేనే మరింత ఇష్టం
నిత్య ఏకవచనం కంటే
మనిషి
నిత్య బహువచనరూపమవ్వడమే ఎప్పటికీ
నాకిష్టం.... ♦

# స్వీకారం

## నిషిధ నవల



**నల్లూరి రుక్మిణి**


వెల : 180 పేజీలు: 384

ప్రతులకు : 99891 33401

**ఆ**రు మాసాలు కలిసి వుంటే వారు వీరవుతారు. వీరు వారవుతారు అన్నట్టు ఈ 350 పుటల పుస్తకం పూర్తిగా చదివేసరికి అల్లూరు గ్రామం పాఠకుడి అంతరంగంలో భాగమవుతుంది. పాఠకుడు గ్రామ నివాసి గాకపోయినా అల్లూరు ప్రవాసిగా మాత్రం తప్పనిసరిగా మారిపోతాడు. ఆఖరి పేజీ ముగించి అలా కళ్ళు మూసుకుంటే పాఠకుడి మనోఫలకం మీద దృశ్యరూపంలో 'నిషిధ' నవల ప్రదర్శన ప్రారంభమవుతుంది.

**- ఖాదర్ మొహియుద్దీన్**

## ఆచార్య జి.ఎన్.రెడ్డి పీఠికలు




**సంపాదకత్వం: రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**

వెల : 175/- పేజీలు: 216

ప్రతులకు : 9440222117

**జి** ఎన్ రెడ్డి గారు నేరుగా పీఠిక రాస్తున్న గ్రంథంలోని విషయంలోకి వెళ్ళరు. గ్రంథంలో చర్చింపబడిన అంశానికి సబంధించిన నేపథ్యాన్ని మొదట వివరిస్తారు. ఆ తర్వాత తాను పీఠిక రాస్తున్న గ్రంథ రచయిత కృషిని, ఆ రచయిత అనుసరించిన పద్ధతిని వివరిస్తారు. అవసరమనిపిస్తే ఆ అంశం మీద ఇంకా జరగవలసిన కృషిని గుర్తుచేస్తారు. ఇది ఆయన పీఠికా నిర్మాణ పద్ధతి.

**- రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**



**డా॥ వి.ఆర్. రాసాని**

## సాహిత్య సమాలోచన

**సంపాదకులు: ఆచార్య నాగోలు కృష్ణారెడ్డి**
**డా॥ పి.సి. వెంకటేశ్వర్లు**


వెల : 300/- పేజీలు: 359

ప్రతులకు : 9848443610

**ర**చయితగా, పరిశోధకుడిగా, ఉత్తమ గురువుగా ఆయనకు ప్రత్యేకతలున్నా నిలువెల్లు మంచితనాన్ని నింపుకున్న నిగర్వి. మంచి స్నేహితుడు. అలాంటి వ్యక్తి పరిపూర్ణ మూర్తిమత్వాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేయాలనే ఆలోచన రెండో కారణం. ఈ రెండు కారణాల మేళవింపుతో వచ్చిన ఆలోచనే 'డా॥ వి.ఆర్. రాసాని సాహిత్య సమాలోచన' గ్రంథం.

**- సంపాదకులు**

## పూలవనం నానీలు



**కోపూరి పుష్పాదేవి**

వెల : 70/- పేజీలు: 80

ప్రతులకు : 9440766375

**ఎ**న్ని రాసినా నానీలపైన వారికి మక్కువ పెరుగుతూనే వస్తుందనటానికి ఈ సంపుటే తార్కాణం. నానీలపైనే ఎన్నో నానీలున్నాయిందులో. కవిత్వంపైన, భావుకత పైన వారికి గల అభినివేశం వీటిలో తొణికిస లాడుతున్నాయి.

**- డా॥ ఎన్. గోపి**

## అలల తీరంలో.... కవితా సంకలనం



**సంపాదకత్వం: బొల్లోజు బాబా**
**మార్ని జానకిరామ్ చౌదరి**
**పసుమర్తి పద్మజవాణి**


వెల : 30/- పేజీలు: 53

ప్రతులకు : 9908853081

**ఈ** సంచికలో యువకవులతో బాటు, కొందరు సీనియర్ కవుల కవితలూ చోటుచేసుకోవడం ముదావహం. కవితలు – గేయాలు, ప్రబోధ గీతాలు, వచన కవితలు, పద్యాల రూపంలో ఉన్నవి, కవితలు వైవిధ్యభరితంగా, సందేశాత్మకంగా పాఠకుల మనసుల్ని ఆకట్టుకునే విధంగా ఉన్నవి.

**- జి. సుబ్బారావు**

## బందగి కథలు



**విడదల సాంబశివరావు**

వెల : 150 పేజీలు: 166


ప్రతులకు : 9866400059

**కే**వలం సమస్యలను స్పృశించడమే కాదు, పరిష్కారం సూచించడం కూడా కథకుడి బాధ్యత అని గట్టిగా నమ్మే విడదల సాంబశివరావు గారు ఆ దిశగా దృష్టి సారించి సంధించిన కథాస్త్రాలే 'బందగి' సంపుటిలో చోటుచేసుకున్నాయి. మంచి కథలని... వైవిధ్యభరితమైన కథాంశాలని ఆస్వాధించామన్న తృప్తి పాఠకుడికి కలుగుతుందనడంలో సందేహం లేదు.

**- రమణ వెలమకన్ని**

# స్వీకారం

## ఎర్రని ఆకాశం




**(ప్రాక్పశ్చిమ సాహితీ రూపాల్లో వేశ్యా ప్రసక్తి)**

**డా॥ పి. రమేష్ నారాయణ**

**వెల : 200 పేజీలు: 170**

**ప్రతులకు : 94413 83888**

**ఈ** పుస్తకం చదవడం ప్రారంభించినప్పుడు ప్రపంచ సాహిత్యంలో ప్రతిబింబించే వేశ్యల జీవితాల్ని అన్వేషించే విమర్శ గ్రంథమని అభిప్రాయం కలుగుతుంది. పుస్తకం చివరికి వచ్చేసరికి ఇదొక సామాజిక శాస్త్ర రూపాన్ని సంతరించుకున్నట్లని పిస్తుంది. ఇలాంటి అంశాన్ని ఒక సాహిత్య వస్తువుగా ధైర్యంగా స్వీకరించి అన్ని కోణాల్లోనూ స్పృశిస్తూ ఏకసూత్రంగా ఇలాంటి రచనను కొనసాగించడం ఒక సాహసమే.

**- రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**

## కన్నీటి వాగు




**బియాస్ నది మృతుల కవితా సంకలనం**

**సంపాదకుడు: శిల్పా జగదీష్**


**వెల : 90/- పేజీలు: 105**

**ప్రతులకు : 9290827384**

**యౌ**వ్వనం ప్రభవించే వేళ మృత్యుశీతల స్పర్శతో గడ్డ కట్టుకుపోవడం పెను విషాదం. ఆ విషాదాన్ని భిన్నమైన కంఠస్వరాల్లో వినిపిస్తుంది కవిత్వం. ఒకటే వస్తువు – అభివ్యక్తి అనేక రూపాలు. ఇది కేవలం ప్రకృతి విపత్తు కాదు. మానవ మహా తప్పిదం. కొందరికి ఇది చిన్న తప్పిదంలా అనిపించవచ్చు. కానీ అది ఎంత ఘోర తప్పిదమో పర్యవసానం గుర్తు చేస్తుంది.

**- గుడిపాటి**

## ఉట్నూరు సాహితీ కెరటాలు




**కవితలు - పాటలు - వ్యాసాలు**

**సంపాదకులు: గోపగాని రవీందర్**


**వెల : 80/- పేజీలు: 102**

**ప్రతులకు : 9440979882**

**సా**హితీకారులు ఇక్కడ చేస్తున్న సాహితీ సేద్యానికి పులకితులైనవారు వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు. అందువల్లనే 'ఉట్నూరు కవిత, ఉట్నూరు సాహితీ సంచిక'లను వెలువరించి పలువురి ప్రశంసలను అందుకున్నాం. ఇప్పుడు 'ఉట్నూరు సాహితీ కెరటాలు'గా మీ ముందుకు వస్తున్నాం.

**- సంపాదకులు**

## ఇలా రువ్వుదామా రంగులు




**కవిత్వం**

**విజయ్ కోగంటి**

**వెల : 100/- పేజీలు: 96**


**ప్రతులకు : 8801823244**

**చు**ట్టూరా అల్లుకున్న బంధాలూ, సమూహాల గురించి తనదైన స్పష్టత వున్న క్రియాశీల ఆలోచనాపరుడు, వూరికే ఉద్వేగంలో కొట్టుకుపోయే ఆరంభ పరాయణత్వం కాకుండా నిలకడగా కొన్ని విలువలకి కట్టుబడిన నిబద్ధత విజయ్ వ్యక్తిత్వంలోంచి కవిత్వంలోకి ప్రవహిస్తుంది.

**- అఫ్సర్**

**కడలి బ్రతుకుల**

## కల్లోల సరళి...




**(గనారా కడలి కల్లోలం ఒక పరిచయం)**

**మాకినీడి సూర్యభాస్కర్**


**వెల : 40/- పేజీలు: 48**

**ప్రతులకు : 9491504045**

**ఏ**నుగు కొండను ఢీకొన్నట్టే... కానీ ఈ ఏనుగు, ఒక ఇనుప ఏనుగు; ఉక్కు మత్తేభం. అందువల్ల కొండ నుగ్గు నుగ్గు అవనున్న ఇతివృత్తం. కథ సారాంశం పాతదే అయినా, చెప్పడానికి ఎంచుకున్న వస్తువు అత్యాధునిక సమకాలీన సామాజిక దురవస్థ. వెరసి ఈ రచన విభిన్నమైనది. అందుకే ఈ నవలపై రాయాలనుకొనే సంకల్పం కలిగింది.

**- మాకినీడి సూర్యభాస్కర్**

## గాండీవం




**డా॥ వుయ్యపు హనుమంతరావు**


**వెల : 40/- పేజీలు: 38**

**ప్రతులకు : 9849425750**

**వు**య్యపు వారి తియ్యని మూర్తిమత్వం రాజనీతిజ్ఞతకు సంబంధించిన ఆలోచనతోను, ఆలోకనతోను పూర్తిగా నిండిపోయి,నిండుగా కనబడుతుంది. మూర్తిమత్వంలో భాగమైపోయిన ఆ ఆలోచన, ఆలోకనలే వీరి గేయాల్లో సైతం ప్రధాన స్రవంతి భావపరీమళమై సాగుతాయి. కవితా సంపుటుల శీర్షికలే ఇందుకు ప్రబల నిదర్శనంగా నిలుస్తాయి.

**- మాకినీడి సూర్యభాస్కర్**

## ప్రగతిశీల మానవీయ కవి సినారె



హైదరాబాద్‌లో జూలై 27న సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నవతెలంగాణ పబ్లిషింగ్‌హౌస్ ప్రచురించిన “అక్షర బాటసారి సినారె” గ్రంథాన్ని నేషనల్ బుక్ ట్రస్ట్ పుస్తక వికాస కేంద్రం (ఉస్మానియా యూనివర్శిటీ)లో డాక్టర్ నందిని సిధారెడ్డి ఆవిష్కరించారు. సినారె గొప్ప సాహిత్య జెండా. సమగ్ర దృక్పథం వున్న మహోన్నత వ్యక్తి. జనపథాలు రాసినా, సినిమా పాటలు రాసినా, కావ్యాలు రాసినా అవన్నీ కూడా మానవీయ విలువలతోను, సాహిత్య విలువలతోను తెలంగాణ మట్టి పరిమళాలతో గుభాళించాయని అన్నారు. తెలంగాణ బి.సి. కమిషన్ సభ్యులు, కవి జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ సినారె ‘సై తెలంగాణ’ అని ఉద్యమ సమయంలో వెన్నుదన్నుగా నిలిచారని, ‘తెలుగుజాతి మనది – రెండుగ వెలుగుజాతి మనది’ అని అన్నారని, పోతనను బమ్మెరవాసిగా ధృవీకరించి వివాదాన్ని ముగించారని, కొత్త కవులు రాసిన కవితా పంక్తుల్ని సభల్లో ఉటంకించి ప్రోత్సాహించారని అన్నారు. ఎన్.బి.టి. సహాయ సంపాదకులు డా॥ పత్తిపాక మోహన్ మాట్లాడుతూ సినారెతో తనకు గల సాహిత్యాంశాలు, హన్మాజీపేటలో కార్యక్రమాలు, మానేరు రచయితల సంఘం సభలో సినారె – పాల్గొనడం లాంటి విషయాలు.. సినారె క్యాలెండర్ ఆవిష్కరింపజేసి ప్రసంగించారు. వామపక్ష కోణంలో సినారెను సాహిత్యపరంగా చూస్తూ, రష్యా పతనంపై సినారె కవితను చదివి వినిపిస్తూ ప్రగతిశీల అభ్యుదయ కవిగా సినారెను శ్లాఘిస్తూ తెలంగాణ సాహితీ కో–కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు ప్రసంగించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన నవతెలంగాణ పబ్లిషింగ్‌హౌస్ జనరల్ మేనేజర్ కె. చంద్రమోహన్ మాట్లాడుతూ నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ తెలంగాణ సాహిత్యకారుల్ని – సాహిత్య సంపద మూలాల్ని వెలికి తీస్తోందని, తెలంగాణ చరిత్ర, దాశరథి స్మృతి, మఖ్దూంపై, అలిశెట్టిపై, నేడు సినారెపై పుస్తకాలు ప్రచురించిందని, భవిష్యత్తులో మరింత సమగ్రంగా తెలంగాణ తేజోమూర్తుల జీవితాలు, సాహిత్యాన్ని – రేపటి తరానికి లాభాపేక్షతో కాకుండా సాహితి – సామాజిక సేవా కోణంలో ప్రచురిస్తుందని అన్నారు. సినారె జన్మదినాన్ని కవితా దినోత్సవంగా 29 జూలై జరపాలని గోడ పత్రికను ప్రముఖ కవి, తెలంగాణ ఉద్యమకారులు – సాహితీవేత్త ‘నిజాం వెంకటేశం’ ఆవిష్కరించారు. ఈ సభకు కవి, అసిస్టెంట్ ఎడిటర్ తంగిరాల చక్రవర్తి స్వాగతం పలుకగా సురేష్, ఖయ్యూం పాషా, కృష్ణారెడ్డి, కవులు డా॥ వూసల రజనీ గంగాధర్, రఘుశ్రీ, తెలంగాణ సాహితి సిటీ సభ్యులు మోహన్‌కృష్ణ, జి.. నరేష్, తంగిళ్ళపల్లి కనకాచారి తదితరులు పాల్గొన్నారు.


**– డి. కృష్ణారెడ్డి**

## ‘మన్నే మాతరం’, ‘హౌరుప్పోటు కవిత్వ సంపుటాల ఆవిష్కరణ



హంద్రీనీవా సుజల స్రవంతి ఉద్యోగి, కవి, యములపల్లి నరసిరెడ్డి రచనలు ‘మన్నే మ్తారం’ (కవితా సంపుటి) ‘హౌరుప్పోటు’ (దీర్ఘకవిత) గ్రంథాల ఆవిష్కరణ సభ ఆగస్టు 6న అనంతపురంలో ఇంజనీర్స్ అసోసియేషన్ భవన్‌లో జరిగింది. జూపల్లి ప్రేమ్‌చంద్ అధ్యక్షత వహించిన ఈ సభలో ‘మన్నే మాతరం’ కవితా సంపుటిని డా॥ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, ‘హౌరుప్పోటు’ దీర్ఘ కవితను డా॥ రాధేయ ఆవిష్కరించారు. మల్లెల నరసింహామూర్తి, తూముచర్ల రాజారాం పుస్తకాలను సమీక్షించారు. ఈ సందర్భంగా రాచపాళెం చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో నీళ్ళకు కరువుందిగానీ కవిత్వానికి కరువు లేదన్నారు. మొదటి ప్రయత్నంలోనే సామాజిక స్పృహ కలిగిన రెండు పుస్తకాలను పాఠకుల ముందుకు తేవడం అభినందనీయమన్నారు. డా॥ రాధేయ కవితో తనకు గల అనుబంధాన్ని వివరించి మంచి కవిత్వంతో ముందుకొచ్చిన నరసిరెడ్డి త్వరలో యువకవుల్లో ఒక మెరికగా మిగులుతాడన్నారు. డా॥ రమేష్ నారాయణ మాట్లాడుతూ అంతరిస్తున్న భాషల్లోంచి తెలుగు మినహాయింపబడుతోంది అంటే అది ఇలాంటి యువకవుల కృషే అన్నారు. ఏలూరి ఎంగన్న కవి. డా॥ ఆశావాది ప్రకాశరావు, సడ్లపల్లె చిదంబర రెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హంద్రీనీవా సుజల స్రవంతి ఉద్యోగులు, జిల్లా కవులు పిల్లా కుమారస్వామి, మధురశ్రీ, ఒంటెద్దు రామలింగారెడ్డి, కొండారెడ్డి, నాగశేషు, మిద్దె మురళీకృష్ణ, షరీఫ్, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ♦

# నెల్లూరు సాహితీస్రవంతి ఆధ్వర్యంలో వేమన సాహితీ సమాలోచన సదస్సు



సాహితీస్రవంతి ఆధ్వర్యంలో నెల్లూరులో ఆగస్టు 6న జె.ఎస్. విజ్ఞానకేంద్రంలో 'వేమన సాహితీ సమాలోచన సదస్సు' జరిగింది. సాహితీస్రవంతి నెల్లూరు జిల్లా గౌరవ అధ్యక్షులు డా॥ ఈదూరి సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సభలో ప్రముఖ విమర్శకులు డా॥ మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ భక్త కవులు, భుక్త కవులు ఎందరో ఉన్నా ప్రజా కవులు కొందరే ఉంటారని, తెలుగు సాహిత్యంలో ప్రజాకవి అన్న పేరు పొందే అర్హతకు ఆద్యుడు వేమన అన్నారు. వేమన పద్యాలను వెలుగులోకి తేవడంలో సి.పి. బ్రౌన్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. నేటికి అందిన పద్యాలలోనే ఇన్ని విషయాలు దాగి ఉంటే మరుగున ఉన్న పద్యాలలో మరెన్ని దాగి ఉన్నాయో అన్నారు. సాంకేతిక ప్రజాస్వామ్య యుగంలో మనం ఉన్నప్పటికీ మానసికంగా నేటికీ ఫ్యూడల్ యుగంలోనే జీవిస్తున్నామని అన్నారు. విశ్వమంతటికీ ఒకే కంచం పెట్టి అన్నం పెట్టి అందరినీ కలిసి మెలిసి జీవించమని చెప్పిన విశ్వమానవతను చాటిన కవి వేమన అన్నారు. కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ 4 శతాబ్దాల కిందటే సాధారణ భాషలో సామాజిక విప్లవానికి పిలుపునిచ్చిన కవిగా వేమనను గుర్తించవచ్చన్నారు. తనను తాను తెలుసుకోవడం మరిచి ఎదుటి వారిలో తప్పులను వెదకటంలో తలమునకలై ఉన్న సమాజాన్ని మేల్కొలిపిన అభ్యుదయ వాది వేమన అన్నారు. డా॥ కాళిదాసు పురుషోత్తం మాట్లాడుతూ ప్రజాకవి వేమన చీకటి యుగంలో ఆశాజ్యోతిలా కనిపిస్తాడన్నారు. ఆయన శ్రమను గౌరవించాడని అన్నారు. సాహితీస్రవంతి నెల్లూరు జిల్లా గౌరవ అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సామాజిక సాహిత్య ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. రాబోయే తరాలకోసం వేమన భావాలను పదిలపరుచుకోవడానికి సాహితీస్రవంతి కృషి చేస్తుందని తెలిపారు.

### నెల్లూరు జిల్లా సాహితీస్రవంతి కమిటీ ఏర్పాటు

నెల్లూరు జిల్లా సాహితీస్రవంతి కమిటీ ఏర్పాటుచేసినట్లు కమిటీ ప్రధాన కార్యదర్శి పి. గోపినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీస్రవంతి ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాలో విశాల వేదికగా అభ్యుదయ సాహిత్య సాంస్కృతిక వికాసానికి కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలో ఒక మంచి సాహిత్య కార్యక్రమాల్ని నిర్వహించడం ద్వారా సాహితీస్రవంతి కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని తలంచిన తరుణంలో 'వేమన సాహితీ సమాలోచన' సదస్సు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాహితీస్రవంతి జిల్లా కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులు: విఠపు బాలసుబ్రహ్మణ్యం. అధ్యక్షులు: డా॥ ఈదూరు సుధాకర్, ఉపాధ్యక్షులు: చెలంచర్ల భాస్కర్ రెడ్డి, ఆత్మకూరు రామయ్య, ప్రధాన కార్యదర్శి: పి. గోపినాథ్, సహాయ కార్యదర్శులుగా ఈతకోట సుబ్బారావు, సలవాది చెంగయ్య, సభ్యులుగా జి. వేణుగోపాలరావు, ఎం.వి. చలపతి, బద్దెపూడి శీనయ్య, బి. పార్వతీశం ఎన్నికయ్యారని తెలిపారు. ♦



*విజయవాడలో ఆగస్టు 26న జరిగిన సాహితీస్రవంతి రాష్ట్రకమిటీ సమావేశంలో అనంతపురం జిల్లా సాహితీస్రవంతి ప్రచురించిన కవిత్వ వ్యాసాల సంపుటిని ఆవిష్కరిస్తున్న సాహితీస్రవంతి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తెలకపల్లి రవి. చిత్రంలో శాంతిశ్రీ, జంధ్యాల రఘుబాబు, వొరప్రసాద్, పి. కుమారస్వామి, ఎం.వి.ఎస్. శర్మ, చీకటి దివాకర్, నూనెల శ్రీనివాసరావు, వెంకటరమణ*



*విజయనగరంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో గురజాడ కేంద్ర గ్రంథాలయంలో ఆగస్టు 29న జరిగిన గిడుగు జయంతి, తెలుగు భాషా దినోత్సవ సభ. ఈ సందర్భంగా నిర్వహించిన కవి గాయక సమ్మేళనంలో కవిత చదువుతున్న ఇనుగంటి జానకి. చిత్రంలో పాయల మురళీకృష్ణ, దాసరి తిరుపతి రావు,ఇ.ఎస్ఎస్.ఎన్. మూర్తి తదితరులు*



Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**



అద్దేపల్లి రామమోహన రావు

06.09.1936 - 13.01.2016

SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.VJ/187/2017-19
Date of Posting : 08.09.2017 ▪ Date of Publication: 04.09.2017




If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor
Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059